జిన్‌పింగ్ శకం ముగిసిందా?



కొన్ని రోజులుగా అధికారిక కార్యక్రమాల్లో కనిపించని చైనా అధినేత 12

ప్రభుత్వ మీడియాలోనూ మాయం

బ్రిక్స్ సదస్సుకు ఆయన బదులు ప్రధాని

జిన్‌పింగ్‌ను పక్కనపెట్టారంటూ ఊహాగానాలు.. హ్యూ జింటావో హస్తం?

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



జనవరి 28 నుంచి 31వరకు

మేడారం మహా జాతర

జనవరి 21న మండే మెలుగు 13

ముహూర్తం ఖరారు చేసిన పూజారులు

గురువారం | 3-7-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 95 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: అష్టమి మ.2.07 తదుపరి నవమి; నక్షత్రం: హస్త మ.1.51 తదుపరి చిత్ర; వర్జ్యం:రా.10.50-12.38; దుర్ముహూర్తం: ఉ.10.09-11.01, మ.3.21-4.13; అమృతఘడియలు: ఉ.7.10-8.56; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.50 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



విద్యాశాఖపై ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, చిత్రంలో వేంనరేందర్‌రెడ్డి, కేకే, ఉన్నతాధికారులు

పాఠశాల విద్య.. ఇకపై 12వ తరగతి దాకా!

హైస్కూళ్ల స్థాయిని పెంచే యోచన

విద్యార్థుల డ్రాపౌట్లను నివారించేందుకు..

ఇతర రాష్ట్రాల్లో అధ్యయనం చేయాలి

పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి.. ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలి

యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాల ప్రగతిపై నివేదిక సమర్పించాలి

విద్యాశాఖపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం పదో తరగతి వరకు ఉన్న పాఠశాల విద్యను ఇకపై 12వ తరగతి వరకు పొడిగించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు ఉన్నత పాఠశాలల స్థాయిని పెంచి 12వ తరగతి వరకు కొనసాగించాలని భావిస్తోంది. ఈ అంశంపై అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పలు ఇతర రాష్ట్రాల్లో పాఠశాల విద్య 12వ తరగతి వరకు ఉంటోందని, దీంతో 9వ తరగతిలో ఉన్న విద్యార్థుల సంఖ్య 12వ తరగతి వరకూ కొనసాగుతోందని అన్నారు. కానీ, తెలంగాణలో పదో తరగతిలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటున్నా, మంచి ఫలితాలు వస్తున్నా.. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి సంఖ్య ఎందుకు తగ్గుతోందని ప్రశ్నించారు. ఇందుకు.. ఆయా రాష్ట్రాల్లో పాఠశాల విద్య 12వ తరగతి వరకు ఉండడం వల్లే డ్రాపౌట్ల సంఖ్య తక్కువగా ఉంటోందని అధికారులు బదులిచ్చారు. దీంతో ఇంటర్మీడియట్ వేరుగా ఉన్న రాష్ట్రాలు, పాఠశాలల్లో 12వ తరగతి వరకు ఉన్న రాష్ట్రాల్లో అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. ఈ విషయంలో విద్యా కమిషన్, ఆ విభాగంలో పని చేసే స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సలహాలు, సూచనలను పరిగణనలోకి

మిగతా 13వ పేజీలో...

ఏటా నెల రోజులు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయండి

ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో మద్దతివ్వండి.. ప్రైవేటు వైద్యులకు సీఎం రేవంత్ సూచన

దేశ విదేశాల్లో స్థిరపడ్డ డాక్టర్లూ సేవలందించాలని పిలుపు.. ఆరోగ్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్

13 ఇతర దేశాల నుంచి భారీగా వస్తున్న రోగులు.. స్వయం సహాయక మహిళలకు హెల్త్‌కార్డులిస్తాం

డా. నాగేశ్వర్‌రెడ్డికి భారతరత్న ఇవ్వాలి.. బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో సీఎం

విద్యార్థి, హెల్త్‌కేర్ వీసాలకు బ్రేక్!

ఆంక్షలకు అమెరికా, బ్రిటన్ సన్నద్ధం

భారతీయ విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం

ఎఫ్-1, జే-1, ఎం-1 వీసాలకు నిర్దిష్ట కాలపరిమితి

ఇష్టమొచ్చినంత కాలం ఉండే వీల్లేదు

ట్రంప్ సర్కారు నిబంధనల కొరడా

22 నుంచి ఇంగ్లండ్‌లో విదేశీ ఆరోగ్య సిబ్బంది నియామకాల నిలిపివేత

వాషింగ్టన్/లండన్, జూలై 2: విదేశీ విద్యార్థులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది తమ దేశాల్లోకి అధిక సంఖ్యలో రాకుండా అడ్డుకోవాలని అమెరికా, బ్రిటన్ భావిస్తున్నాయి. వారి సంఖ్యపై ఆంక్షలు విధించాలని నిర్ణయించాయి. అక్రమ వలసలపై కొరడా ఝుళిపిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం.. తాజాగా ఎఫ్-1, జే-1 వీసాలపై వచ్చిన విదేశీ విద్యార్థులపై ఆంక్షలు విధించాలని, వారు అమెరికాలో నివసించే సమయాన్ని కుదించాలని భావిస్తోంది. దీనివల్ల ఆయా వీసాలపై అక్కడకు

మిగతా 2వ పేజీలో...

రద్దీ వేళల్లో రెండింతల చార్జీ 2

ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి క్యాబ్ సేవల సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి

సరైన కారణం చెప్పకుండా రైడ్ రద్దు చేస్తే.. చార్జీ మొత్తంలో 10 శాతం జరిమానా

యాప్‌లో సూచించిన మార్గంలోనే ప్రయాణం

మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం



నిత్యావసర వస్తువులపై

జీఎస్టీ తగ్గుదల?

- 12 నుంచి 5 శాతానికి తగ్గించే యోచనలో కేంద్రం
- పూర్తిగా ఎత్తేసే ప్రతిపాదనపైనా పరిశీలన
- రాబోయే జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం
- టూత్‌పేస్ట్, నెయ్యి, సబ్బులు, పాదరక్షలు, దుస్తులు, వాషింగ్ మెషిన్లు తదితర వస్తువులు ఇక చౌక!



న్యూఢిల్లీ, జూలై 2: మధ్యతరగతి ప్రజలకు శుభవార్త. ఈ ఏడాది ఆదాయం పన్ను రాయితీలతో ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. ఆయా వర్గాలకు మరింత ఉపశమనం కల్పించేందుకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని తగ్గించడం ద్వారా ఊరట కల్పించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న నిత్యావసర వస్తువులపై పూర్తిగా పన్నును తొలగించడం లేదా చాలా వస్తువులను 5శాతం శ్లాబ్ పరిధిలోకి తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తోందని వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెషర్ కుక్కర్లు, వంట పాత్రలు, నెయ్యి, సబ్బులు, చిరుతిళ్లు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ.1000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ.500-1000 ధర కలిగిన పాదరక్షలు, తదితర వస్తువులపై జీఎస్టీని తగ్గించనున్నట్లు సమాచారం. ఈ తగ్గింపు అమల్లోకి వస్తే చాలా వస్తువులు చౌకగా దొరుకుతాయి. సామాన్యులు వాడే ఈ నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం వల్ల ప్రభుత్వంపై రూ.40-50వేల కోట్ల భారం పడనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ భారాన్ని మోసేందుకు సర్కారు సిద్ధమవుతోందని పేర్కొన్నాయి. ప్రజల వినియోగ సామర్థ్యాన్ని

మిగతా 2వ పేజీలో...

రూ.2వేల కోట్ల ఆస్తులను కాజేయడానికి

సోనియా, రాహుల్ కుట్ర

» నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ వాదన.. నేడూ విచారణ

న్యూఢిల్లీ, జూలై 2: తొంభై కోట్ల రూపాయల అప్పును సాకుగా చూపి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ2 వేల కోట్ల ఆస్తులను కాజేసేందుకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కుట్రపన్నారని ఈడీ ఆరోపించింది. ఇందుకోసమే 'యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేశారని.. అందులో సోనియా, రాహుల్‌కు 76 శాతం షేర్లున్నాయని పేర్కొంది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి.. ఢిల్లీ ప్రత్యేక కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈడీ తరపున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దృష్టికి పలు కీలక విషయాలను తీసుకొచ్చారు. ఏజేఎల్ సంస్థ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నుంచి రూ.90 కోట్లు అప్పుగా తీసుకుందని.. రూ.2000 కోట్ల ఆస్తులున్న ఆ సంస్థకు ఆ అప్పును తీర్చడం చిన్నపిల్లల ఆటతో సమానమని ఆయన పేర్కొన్నారు. కానీ, ఈ కేసులో ఆ రూ.90 కోట్లకు బదులుగా ఏజేఎల్ ఆస్తులు మొత్తాన్నీ స్వాధీనం చేసుకోవడానికి సోనియా, రాహుల్ 'యంగ్ ఇండియన్' అనే సంస్థను ఏర్పాటు చేశారని వివరించారు. దాని ఎండీగా రాహుల్ నియమితులైన ఆరురోజుల్లోనే.. 'అప్పు తీర్చండి లేదా దాన్ని ఈక్విటీ రూపంలోకి మార్చండి' అనే ప్రతిపాదనను ఏజేఎల్‌కు పంపారని రాజు కోర్టుకు తెలిపారు. తర్వాత ఏజేఎల్ తన ఆస్తులన్నింటినీ యంగ్ ఇండియన్ సంస్థకు ఇచ్చేసిందని పేర్కొన్నారు. ఈ ఆస్తులన్నీ ఏజేఎల్‌కు 1947 తర్వాత కేంద్ర ప్రభుత్వం, పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇచ్చినవేనని చెప్పారు. ఈ వ్యవహారంలో ప్రత్యక్ష లావాదేవీలకు తాను దూరంగా ఉండడానికే.. 'యంగ్ ఇండియన్' సంస్థను ఏఐసీసీ సృష్టించిందని చెప్పారు. రూ.90 కోట్ల రుణానికి బదులుగా మొత్తం ఆస్తులను ఎలా స్వాధీనం చేసుకుంటారన్నదే ప్రశ్న అని ఎస్వీ రాజు వాదించారు. ఈ వ్యవహారంలో షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు.. అన్నీ బోగస్ లావాదేవీలేనని కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణ గురువారం కొనసాగనుంది.

ఐదేళ్లూ నేనే ముఖ్యమంత్రి: సిద్దరామయ్య

» ఆయనకు మద్దతివ్వడం తప్ప మరో దారి లేదు: డీకే

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): నాయకత్వ మార్పుపై ఊహాగానాలు జోరందుకున్న నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. చిక్కబళ్లాపురలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని, ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని స్పష్టంచేశారు. బీజేపీ నేతలు అబద్ధాలు చెప్పడంలో దిట్టలని, నిజాలు చెప్పడం వారికి తెలియదని విమర్శించారు. తన నాయకత్వంపై పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన డీకే శివకుమార్‌ను గుర్తించి, ఆయనను సీఎం చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు కదా అని మీడియా ప్రశ్నించగా.. అందరూ ఎంతో కష్టపడ్డారని, తాను ఒంటరివాడిని కాదని సిద్దరామయ్య పేర్కొన్నారు. మరోవైపు, సిద్దరామయ్యకు మద్దతు ఇవ్వడం తప్ప తనకు మరో మార్గం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టంచేశారు. చిక్కబళ్లాపుర జిల్లా నందిహిల్స్‌పై జరుగుతున్న క్యాబినెట్ మీటింగ్‌కు హాజరయ్యే సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సిద్దరామయ్యకు అండగా ఉండి సహకరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఓవైపు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో చర్చలు కొనసాగిస్తుండగానే డీకే శివకుమార్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

చావు తప్పదని విమానంలోనే వీలునామాలు

» కుటుంబాలకు బ్యాంకు పిన్‌లు, ఇన్సూరెన్స్ వివరాలు

» విమానం కూలిపోతుందన్న భయంతో 'చివరి సందేశాలు' పంపిన ప్రయాణికులు.. సురక్షితంగా ల్యాండ్ చేసిన పైలట్

న్యూఢిల్లీ, జూలై 2: చైనాలోని షాంఘై నుంచి జపాన్‌లోని టోక్యోకు బయల్దేరిన జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్-737 విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అది నిమిషాల వ్యవధిలోనే 26వేల అడుగులు కిందకు దిగజారిపోయింది. 36వేల అడుగుల ఎత్తులో వెళ్తున్న విమానం కేవలం 10నిమిషాల్లోనే 10,500అడుగులకు పడిపోయింది. జూన్ 30న సాయంత్రం 6.53గంటలకు ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో విమానంలో సిబ్బందితో సహా 191 మంది ఉన్నారు. విమానం కుదుపునకు నిద్రలో ఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడి లేచారు. విమానం కిందికి పడిపోతున్న క్రమంలో ఆక్సిజన్ మాస్కులు బయటకు వచ్చాయి. దీంతో, విమానం తప్పక కూలిపోతుందని, తాము చనిపోవడం ఖాయమని భయపడ్డ చాలా మంది ప్రయాణికులు వీలునామాలు రాశారు. ప్రియమైన వారికి సందేశాలు పంపించారు. బ్యాంకు పిన్ నంబర్లు, ఇన్సూరెన్స్ లాంటి వివరాలను కుటుంబసభ్యులకు షేర్ చేశారు. అయితే, విమానం పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. విమానం పడిపోతున్న క్రమంలో ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్ దాన్ని టోక్యోకు బదులుగా దగ్గర్లో ఒసాకాకు మళ్లించి కాన్సాయ్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండింగ్ చేశాడు.

12వ తరగతి బాలుడితో టీచరమ్మ బలవంతపు శృంగారం!

ముంబై, జూలై 2: విద్యార్థిని బలవంతంగా ఒప్పించి, అతడితో పలు మార్లు శృంగారంలో పాల్గొన్న ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు అదే పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థి. దేశంలోని ఐదు అత్యున్నత పాఠశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ముంబైలోని స్కూల్లో ఈ ఘటన వెలుగుచూసింది. బాధిత బాలుడిని సదరు ఉపాధ్యాయురాలు తన వెంట బెట్టుకొని ఫైవ్ స్టార్ హోటళ్లు, ఇతర చోట్లకు తీసుకెళ్లి అతడితో శృంగారంలో పాల్గొన్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఉపాధ్యాయురాలి వేధింపులు తాళలేక బాధిత బాలుడు ఎట్టకేలకు ఘోరాన్ని బయటపెట్టాడు. 12వ తరగతి పరీక్షలు పూర్తయ్యాక ఒకానొక రోజు.. బాలుడిని వెంటబెట్టుకొని తీసుకురావాలంటూ అతడి ఇంటికి ఆ ఉపాధ్యాయురాలు తన పనివాణ్ని పంపింది. వెళ్లడం ఇష్టంలేని బాధితుడు, మహిళా టీచర్ వేధింపుల గురించి తన తల్లిదండ్రులకు చెప్పుకొన్నాడు. ఈ ఘటనపై దాదర్ పోలీసులకు బాధితుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలుడి స్టేట్‌మెంట్‌ను పోలీసులు నమోదు చేశారు. ఉపాధ్యాయురాలి ప్రతిపాదనకు బాలుడు అంగీకరించకపోతే, మరో మహిళ ఆ బాలుడిని ఒప్పించిందని.. వయసులో తమకన్నా పెద్దవారైన మహిళలతో టీనేజర్లు లైంగిక సంబంధం పెట్టుకోవడం మామూలేనంటూ సదరు మహిళ బాధితుడితో అన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి సదరు ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్టు చేశారు. ఆమెపై పోక్సో, కౌమార న్యాయ చట్టాల కింద కేసు నమోదు చేశారు. మహిళా టీచర్ చెప్పినట్లుగా వినాలని బాలుడిని ఒప్పించిన సదరు మహిళపైనా ఎఫ్ఐఆర్ నమోదైంది.

గాజాలో కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఓకే: ట్రంప్

టెహ్రాన్/వాషింగ్టన్, జూలై 2: హమాస్ నాయకులు, క్యాడర్ లక్ష్యంగా గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్.. 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ సంస్థ 'ట్రూత్ సోషల్‌'లో ఓ పోస్టు చేశారు. "కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించింది. అన్ని వైపుల నుంచి సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ యుద్ధాన్ని ముగించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. అయితే.. కాల్పుల విరమణ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే విషయాన్ని చెప్పలేదు. శాంతి చర్చలకు సహకరించిన ఖతార్, ఈజిప్ట్ వర్గాలను ఆయన అభినందించారు. కాగా.. ఇజ్రాయెల్ ఈ అంశంపై స్పందించలేదని బీబీసీ న్యూస్ పేర్కొనగా.. యుద్ధాన్ని పూర్తిస్థాయిలో ముగిస్తామంటేనే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని హమాస్ ప్రకటించింది. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ) నుంచి ఇరాన్ అధికారికంగా వైదొలగింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో భాగంగా.. అమెరికా తన బీ2 బాంబర్లతో ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడులు చేసిన విషయం తెలిసిందే.! ఈ చర్యను నిరసిస్తూ ఐఏఈఏ నుంచి వైదొలగుతామని ప్రకటించిన ఇరాన్.. గత వారం పార్లమెంట్‌లో ఆ మేరకు బిల్లును ప్రవేశపెట్టింది. తాజాగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆ బిల్లును ఆమోదించారు.

రద్దీ వేళల్లో రెండింతల చార్జీ

ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి క్యాబ్ సేవల సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతి

» సరైన కారణం చెప్పకుండా రైడ్ రద్దు చేస్తే.. చార్జీ మొత్తంలో 10% జరిమానా

» యాప్‌లో సూచించిన మార్గంలోనే క్యాబ్ ప్రయాణం

» మార్గం మారితే కంట్రోల్ రూమ్‌కు ఆటోమేటిగ్గా సమాచారం అందే ఏర్పాట్లు

» మార్గదర్శకాలు విడుదల చేసిన కేంద్రం

» వ్యక్తిగత ద్విచక్ర వాహనాలను బైక్ ట్యాక్సీలుగా వాడేందుకు అనుమతి



న్యూఢిల్లీ, జూలై 2: ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి క్యాబ్ సేవల (అగ్రిగేటర్) సంస్థలు రద్దీ వేళల్లో రెట్టింపు చార్జీలు వసూలు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. అదే సమయంలో రద్దీ ఉండని సాధారణ వేళల్లో కనీస మొత్తం (బేస్ ఫేర్)లో 50శాతం కంటే తక్కువ చార్జీ తీసుకోవద్దని స్పష్టం చేసింది. దీనితోపాటు పలు కీలక అంశాలపై స్పష్టత ఇస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంగళవారం 'మోటారు వాహన సేవా సంస్థల (అగ్రిగేటర్) మార్గదర్శకాలు-2025'ను విడుదల చేసింది. ఆ మార్గదర్శకాల ప్రకారం..

» క్యాబ్ సంస్థలు కనీస చార్జీల్లో సగం (50శాతం తక్కువ) నుంచి గరిష్ఠంగా రెండింతల వరకు వసూలు చేసుకోవచ్చు. ఉదాహరణకు ఏదైనా నిర్ధారిత దూరం ప్రయాణానికి (రైడ్‌కు) రూ.100 బేస్ ఫేర్ అనుకుంటే.. డిమాండ్ ఉండని సమయాల్లో కనీసం రూ.50 కంటే తక్కువ చార్జీ చేయవద్దు. ఎక్కువ రద్దీ ఉండే సమయాల్లో గరిష్ఠంగా రూ.200కు మించి వసూలు చేయవద్దు. (ఇంతకు ముందు గరిష్ఠ చార్జీ ఒకటిన్నర రెట్ల వరకే ఉండేది).

» క్యాబ్ బుక్ అయిన తర్వాత డ్రైవర్ సరైన కారణం చెప్పకుండా ప్రయాణాన్ని రద్దు చేసుకుంటే.. ఆ రైడ్ చార్జీల్లో 10 శాతం (రూ.100కు మించకుండా) జరిమానాగా చెల్లించాలి. ప్రయాణికులు రద్దు చేసుకున్నా ఇదే నిబంధన వర్తిస్తుంది.

» బుక్ చేసుకున్న తర్వాత ప్రయాణికుడిని పికప్ చేసుకునేందుకు క్యాబ్ ప్రయాణించే దూరం 3 కిలోమీటర్లలోపు ఉన్నప్పుడు దానికి ఎలాంటి చార్జీ విధించకూడదు. పికప్ కోసం 3 కిలోమీటర్లకుపైగా ప్రయాణించాల్సి వస్తే.. నిర్ధారిత చార్జీ వసూలు చేసుకోవచ్చు.

» క్యాబ్ డ్రైవర్లు సంబంధిత సంస్థ యాప్‌లో సూచించిన మార్గంలో మాత్రమే ప్రయాణించేలా చర్యలు చేపట్టాలి. ఒకవేళ మార్గం మార్చితే వెంటనే ఆటోమేటిగ్గా కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేసే ఏర్పాట్లు ఉండాలి.

» క్యాబ్ సంస్థలు ప్రయాణికుల కోసం కనీసం రూ.5 లక్షలకు బీమా తీసుకోవాలి. డ్రైవర్లకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టెర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి.

» క్యాబ్ సంస్థలు ఎనిమిదేళ్లు దాటిన (రిజిస్ట్రేషన్ నాటి నుంచి) వాహనాలను సర్వీసులో ఉంచకూడదు. ప్రతి వాహనంలో లొకేషన్ ట్రాకింగ్ పరికరాలు తప్పనిసరిగా అమర్చాలి.

» వివిధ రకాల క్యాబ్ సేవల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు కనీస చార్జీ (బేస్ ఫేర్)ను నిర్ణయించాలి.

» వ్యక్తిగత ద్విచక్ర వాహనాలను క్యాబ్/ట్యాక్సీ సేవల కోసం వినియోగించేందుకు కేంద్రం అవకాశం ఇచ్చింది. దీనిపై రాష్ట్రాలు మార్గదర్శకాలు ఇవ్వాలని, ఆ సేవలు అందించే సంస్థల నుంచి చార్జీలు వసూలు చేసుకోవచ్చని సూచించింది.

» రాష్ట్రాలు మూడు నెలల్లోగా తమ మార్గదర్శకాలను అమలు చేసుకుంటూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది.

నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గుదల?

(మొదటిపేజీ తరువాయి)

పెంచేందుకే జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. వస్తువుల ధరలు తగ్గితే విక్రయాలు పెరుగుతాయని, ఫలితంగా జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జీఎస్టీ రేట్లలో మార్పులు చేస్తామన్న సంకేతాలు ఇచ్చారు. నిత్యావసర వస్తువులపై పన్నులను హేతుబద్ధీకరిస్తామని, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, జీఎస్టీ తగ్గింపుపై ఈనెలలో జరగబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

12 % జీఎస్టీ పరిధిలోని వస్తువులు ఇవే..

టూత్‌పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు (కొన్ని విభాగాలపై 18% ఉంది), నెయ్యి, టూత్‌పేస్ట్ (కొన్ని బ్రాండెడ్ రకాలపై 12%, ఇతర పేస్ట్‌లపై 18%),



గొడుగులు, కుట్టు మిషన్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు (నాన్ ఎలక్ట్రిక్), ప్రెషర్ కుక్కర్లు, అల్యూమినియం, స్టీల్‌తో చేసిన వంట పాత్రలు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, వ్యాక్యూమ్ క్లీనర్లు (తక్కువ సామర్థ్యం, వాణిజ్యేతర), వాషింగ్ మెషీన్లు (తక్కువ సామర్థ్యం), సైకిళ్లు, దివ్యాంగుల వాహనాలు, రెడీమేడ్ దుస్తులు (రూ.1000పైన ధర కలిగినవి), పాదరక్షలు (రూ.500-1000), టీకాలు, హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ డయాగ్నస్టిక్ కిట్లు, కొన్ని ఆయుర్వేద, యునానీ మందులు, ఎక్సర్‌సైజ్ పుస్తకాలు, జామెట్రీ బాక్సులు, డ్రాయింగ్, కలరింగ్ పుస్తకాలు, మ్యాపులు, గ్లోబులు, రెడీ మిక్స్ కాంక్రీట్, ప్రి-ఫ్యాబ్రికేటెడ్ భవనాలు, వ్యవసాయ పనిముట్లు, ప్యాకేజ్డ్ ఆహారం, సోలార్ వాటర్ హీటర్లు. కాగా, సిగరెట్లు, విలాసవంతమైన కార్లు, కార్బొనేటెడ్ డ్రింక్స్ తదితర వస్తువులపై జీఎస్టీని భారీగా పెంచనున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్రాలూ అంగీకరించాలి..

జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం మాత్రమే ముందుకు వస్తే సరిపోదు. ఆయా ప్రతిపాదనలపై రాష్ట్రాల మధ్య కూడా ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంటుంది. పన్ను తగ్గింపునకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. కౌన్సిల్‌లో ప్రతి రాష్ట్రానికీ ఓటు హక్కు ఉంటుంది. ప్రస్తుతం పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి కొంత వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తోంది. అయితే జీఎస్టీ కౌన్సిల్ చరిత్రలో ఇప్పటి వరకూ ఒక్కసారి మాత్రమే ఓటింగ్ జరిగింది.

లోకం తీరు



ఫోన్ ట్యాపింగ్ వ్యక్తి గోప్యతా హక్కు ఉల్లంఘనే

» మద్రాసు హైకోర్టు స్పష్టం

చెన్నై, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రజా అత్యవసర పరిస్థితి లేదా ప్రజా ప్రయోజనాల విషయంలో తప్ప ఇతరత్రా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం వ్యక్తి ప్రాథమిక గోప్యతా హక్కు ఉల్లంఘనేనని మద్రాస్ హైకోర్టు తేల్చి చెప్పింది. నేరాలు గుర్తించడానికి ఒక వ్యక్తి లేదా వ్యక్తుల ఫోన్ సంభాషణలు రహస్యంగా వినేందుకు అనుమతి లేదని స్పష్టం చేసింది. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రాష్ట్ర భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, తీవ్ర నేర ప్రేరేపణ వంటి వాటిని నిరోధించడం కోసం అథారిటీ సంతృప్తి చెందిన తర్వాతే ట్యాపింగ్ ఉత్తర్వులను జారీ చేయాల్సివుంటుందని స్పష్టం చేసింది. టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), టెలిగ్రాఫ్ రూల్స్ 1951లోని రూల్ 419-ఏ కింద ఒక అవినీతి కేసుకు సంబంధించి తన ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతి ఇస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఓ ప్రైవేటు కంపెనీ ఎండీ పి.కిశోర్ హైకోర్టులో వేశారు. దాని విచారణ సందర్భంగా బుధవారం న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 5(2) పరిధిని విస్తరించాలన్న కేంద్రం వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. అంతేగాక చట్టంలోని సెక్షన్ 5(2) కింద నిర్దేశించిన లక్ష్మణ రేఖను దాటలేరని తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో అధికారులు ట్యాపింగ్ విషయాన్ని సమీక్ష కమిటీ ముందు ఉంచలేదని, అందువల్ల నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. చట్టంలోని సెక్షన్ 5(2), నిబంధనలలోని నిబంధన 419-ఎ(17)ని ఉల్లంఘించి ఈ విషయాన్ని సేకరించినందున, ఆ విషయాన్ని ఏ ఉద్దేశానికైనా ఉపయోగించరాదని ఆదేశించిన ధర్మాసనం.. పిటిషనర్ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కేంద్రం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది.

రష్యా చమురు కొంటే 500% సుంకం

» అమెరికాలో బిల్లు.. భారత్‌పై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్, జూలై 2 : ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత రష్యాకు మిగిలిన అతి పెద్ద ఆదాయ వనరు చమురు. రష్యాపై ఆర్థిక ఆంక్షలు మరింత కఠినతరం చేయాలంటే ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలపై భారీగా సుంకాలు విధించాలంటూ అమెరికా సెనేటర్ లిండ్సే గ్రహమ్ ఒక బిల్లు తయారుచేశారు. అధ్యక్షుడు ట్రంప్ సూచనతోనే ఈ బిల్లు తయారైందని వార్తలు వెలువడుతున్నాయి. రష్యా చమురులో 70 శాతం భారత్, చైనాలే కొంటున్నాయి. అంటే గ్రహమ్ బిల్లు ప్రధానంగా ఈ రెండు దేశాలనే లక్ష్యంగా చేసుకున్నట్లు స్పష్టమవుతోంది. ఇటువంటి దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే సరుకులపై 500 శాతం సుంకం విధించాలని తన బిల్లులో ఆయన ప్రతిపాదించారు. రష్యా దగ్గర చమురు కొనడం అంటే ఉక్రెయిన్‌కు మద్దతు నిరాకరించినట్టే భావించాల్సి ఉంటుందని ఆ బిల్లులో పేర్కొన్నారు. తన బిల్లుకు ట్రంప్ మద్దతు ఇచ్చారని, దీనిపై ముందుకెళ్లడానికి ఇదే సరైన సమయమని ఆయన సూచించారని గ్రహమ్ తెలిపారు. తన బిల్లు సెనేట్‌కు ఆగస్టులో రావచ్చునని తెలిపారు. నిజానికి, 2022లో ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలవగానే ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. భారత్‌కు చౌకగా చమురు ఇవ్వడానికి ఈ సమయంలో రష్యా ముందుకొచ్చింది. యుద్ధానికి ముందు భారత్‌కు ప్రపంచ దేశాల నుంచి దిగుమతి అయిన చమురు ఉత్పత్తుల్లో ఒక శాతం కంటే తక్కువగానే రష్యా నుంచి అందేవి. ఇప్పుడు ఆ పరిమాణం 40-45 శాతానికి పెరిగిపోయింది.

డోజ్ ఓ రాకాసి.. మస్క్‌ను తినేస్తుంది: ట్రంప్

వాషింగ్టన్, జూలై 2: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు బెదిరింపు ధోరణిని ప్రదర్శించారు. మస్క్ ఇంతకాలం సేవలందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ(డోజ్)ను ఆయనపైనే ప్రయోగిస్తామని ట్రంప్ తన ఫ్లోరిడా పర్యటనలో హెచ్చరించారు. "ప్రపంచంలో ఎవరికీ దక్కనన్ని సబ్సిడీలు మస్క్‌కు అందుతున్నాయి. ఈ సబ్సిడీలు లేకపోతే.. ఆయన దుకాణం మూసుకుని, వెళ్లిపోవాల్సిందే" అని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్.. తాజాగా డోజ్ అనే రాకాసి ఇప్పుడు మస్క్‌ను తినేసేలా చేస్తామని పేర్కొన్నారు. "రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్లు, విద్యుత్తు కార్ల ఉత్పత్తి విషయంలో ఎన్నో సబ్సిడీలు ఇస్తున్నాం. ఈ సబ్సిడీలను ఆపేస్తే.. దేశానికి ఎంతో మిగులుతుంది. దీనిపై చర్యలకు డోజ్ సిద్ధంగా ఉంది. డోజ్ మస్క్ వైపు చూస్తే.. మనం చాలా డబ్బును ఆదా చేసుకోవచ్చు. మస్క్‌పై డోజ్‌ను ప్రయోగించాల్సి రావొచ్చు. డోజ్ అంటే ఏంటో తెలుసా? ఓ రాకాసి. ఎంతో భయంకరమైనది. మస్క్‌ను తినేస్తుంది" అని ఫ్లోరిడాలో మీడియాతో అన్నారు. కాగా.. 'బిగ్ బ్యూటిఫుల్' బిల్లును మస్క్ వ్యతిరేకించినప్పటి నుంచి ట్రంప్‌తో విభేదాలు పెరిగిన విషయం తెలిసిందే.! తాజాగా ఈ బిల్లు సెనేట్‌లో ఆమోదం పొందడంతో.. మస్క్ వరుస ట్వీట్లు చేశారు. ఆ బిల్లుకు మద్దతిచ్చేవారిని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే ధ్యేయంగా తాను పనిచేస్తానని హెచ్చరించారు.

విద్యార్థి, హెల్త్‌కేర్ వీసాలకు బ్రేక్

(మొదటి పేజీ తరువాయి)



వెళ్లిన 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఇబ్బందులు పాలయ్యే అవకాశముంది. ప్రస్తుతం ఈ వీసాలతో వెళ్లేవారిపై కఠినమైన ఆంక్షలు లేవు. తామొచ్చిన కార్యక్రమాలు పూర్తయ్యేవరకు వారు అమెరికాలో ఉండే అవకాశం ఉంది. అయితే ఎక్స్ఛేంజ్ విజిటర్లుగా వచ్చేవారు ఉండేందుకు కాలవ్యవధి నిర్ధారించాలని ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2020లోనే ప్రతిపాదించారు. ఇప్పుడు అమెరికా హోంల్యాండ్ భద్రత విభాగం తాజాగా ఈ ప్రతిపాదన తెచ్చింది. ట్రంప్ యంత్రాంగం ప్రజాభిప్రాయం కోరకుండానే దీన్ని అమలు చేసే అవకాశం ఉంది. భారత్‌లోని అమెరికా ఎంబసీ ఇటీవల విదేశీ విద్యార్థులకు మే 14న ఓ హెచ్చరిక చేసింది. నిర్ణీత గడువును మించి అమెరికాలో అక్రమంగా నివసించే వారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని స్పష్టంచేసింది. వారిని స్వదేశాలకు పంపేయడం, భవిష్యత్‌లో అమెరికాకు రాకుండా శాశ్వత నిషేధం వంటివి జరుగుతాయని తెలిపింది. ఆ తర్వాత ట్రంప్ యంత్రాంగం ఎఫ్-1, జే-1, ఎం-1 వీసాలను రద్దుచేయడమే గాక, స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ (సెవిస్) రికార్డులను కూడా క్యాన్సిల్ చేయడంతో లక్షల సంఖ్యలో విదేశీ విద్యార్థులు అమెరికాను వీడాల్సి వచ్చింది. కాగా, జే-1 వీసా అంటే నాన్-ఇమిగ్రెంట్ వీసా. విద్య, సైన్స్, కళలు తదితర రంగాల్లో సాంస్కృతిక, మేధో సంబంధ మార్పిడిలో భాగంగా చేపట్టే విద్య, అధ్యయనం, పరిశోధన, ప్రత్యేక నైపుణ్యం, శిక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు అమెరికా వచ్చే వారికి ఈ వీసాలిస్తారు. ఈ కార్యక్రమాలు పూర్తయ్యేంతవరకు వారు అక్కడ నివసించవచ్చు. కాలపరిమితి లేదు. ఎఫ్-1 వీసా.. అమెరికాలో ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు ఇస్తారు. దీనికీ కాలపరిమితి లేదు. చదువు, పరిశోధనలు పూర్తయ్యేవరకు వారు ఉండొచ్చు. ఎం-1 వీసా.. గుర్తింపు పొందిన విద్యాసంస్థలు..జూనియర్ కాలేజీలు, పోస్ట్-సెకండరీ వొకేషనల్ స్కూళ్లు, పోస్ట్-సెకండరీ బిజినెస్ స్కూళ్ల వంటివాటిలో వొకేషనల్ లేదా సాంకేతిక శిక్షణ కోసం వచ్చేవారికి ఇస్తారు.

యూకేలో ఆంక్షలు కఠినతరం

కొత్త వీసా విధానంలో భాగంగా యూకేలో ఈ నెల 22 నుంచి విదేశాలకు చెందిన ఆరోగ్య సంరక్షణ సిబ్బంది నియామకాలను నిలిపివేయనున్నారు. అలాగే ఉద్యోగాల కోసం రాదలచుకున్నవారి వేతన పరిమితులను బాగా పెంచారు. ఆరోగ్య సంరక్షణతో పాటు మరికొన్ని రంగాల్లో ఉద్యోగం కోసం వచ్చే వారు మరిన్ని నైపుణ్యాలు కలిగి ఉండాలన్న నిబంధన విధించారు. ఈ మేరకు కఠినతర వీసా నిబంధనలను పార్లమెంటులో మూడ్రోజుల కిందట ప్రవేశపెట్టారు.

21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జూలై 2 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 21వ తేదీన మొదలై ఆగస్టు 21వ తేదీ దాకా కొనసాగుతాయని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఆగస్టు 13, 14 తేదీల్లో సమావేశాలు జరగవని వెల్లడించారు. గతంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12తో ముగిసేవి. కానీ, ఈ సారి సమావేశాలను వారం పొడిగించారు.

పాక్ ఛానెళ్లపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, జూలై 2: పాకిస్థాన్ న్యూస్ ఛానెళ్లు, యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ మీడియా అకౌంట్లపై విధించిన నిషేధాన్ని భారత్ ఎత్తేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో తప్పుడు సమాచారం ప్రసారం చేయడంతో పాటు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ వీటిని నిషేధించింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గిపోవడంతో నిషేధం తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే కేంద్రం నుంచి అధికారికంగా ప్రకటన వెలువడలేదు.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 2: పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. పటిష్ఠ భద్రత నడుమ మొదటి బ్యాచ్ ప్రయాణికులు బుధవారం ఉదయం తమ యాత్రను ప్రారంభించారు. భగవతీనగర్‌లోని యాత్రి నివాస్ బేస్ క్యాంపు నుంచి జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర కోసం కేంద్రం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం 581 పైగా సాయుధ పోలీసు దళాలను రంగంలోకి దించింది. అమర్‌నాథ్ యాత్ర 38 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 9న ముగుస్తుంది. ఈ ఏడాది యాత్ర కోసం ఇప్పటివరకు 3.31 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

అంతరిక్షానికి మరో భారత సంతతి వ్యోమగామి

» నాసా ఐఎస్ఎస్ మిషన్‌కు ఎంపికైన అనిల్ మీనన్

» 2026లో ఎస్ఎస్‌కు.. 8 నెలలపాటు అక్కడే పరిశోధన



న్యూఢిల్లీ, జూలై 2: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) యాత్రకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో సునీతా విలియమ్స్ తర్వాత ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టనున్న మరో ఇండో-అమెరికన్ వ్యోమగామిగా ఆయన రికార్డు సృష్టించనున్నారు. 2026 జూన్‌లో నాసా చేపట్టనున్న మిషన్‌లో భాగంగా అనిల్ మీనన్.. 'రోస్కోస్మోస్ సోయజ్ ఎంఎస్-29' అనే అంతరిక్ష నౌకలో ఫ్లైట్ ఇంజనీర్‌గా, ఎక్స్‌పెడిషన్ 75 సభ్యుడిగా ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. మీనన్‌ను వచ్చే ఏడాది తన మొదటి మిషన్ కోసం ఐఎస్ఎస్‌కు పంపుతున్నామని నాసా తెలిపింది. మీనన్‌తోపాటు రష్యాకు చెందిన ప్యోటర్ డుబ్రోవ్, అనా కికినా కూడా రోస్కోస్మోస్ సోయజ్ ఎంఎస్-29లో ప్రయాణించనున్నారని పేర్కొంది. ఈ ముగ్గురూ దాదాపు ఎనిమిది నెలలపాటు ఐఎస్ఎస్‌లో శాస్త్రీయ పరిశోధనలు చేపట్టనున్నారు. ఈ ప్రయోగం కజకిస్థాన్ నుంచి చేపట్టనున్నారు. అమెరికాలో స్థిరపడిన భారత్-ఉక్రెయిన్‌కు చెందిన శంకరన్ మీనన్, లీసా సమోలెంకో దంపతులకు అనిల్ మీనన్ జన్మించారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి న్యూరోబయాలజీ డిగ్రీ సాధించారు. మసాచుసెట్స్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎమర్జెన్సీ మెడిసిన్, ఏరోస్పేస్ మెడిసిన్ పూర్తిచేశారు. 2014లో ఫ్లైట్ సర్జన్‌గా నాసాలో చేరిన మీనన్.. 2021లో వ్యోమగామి కార్యక్రమానికి ఎంపికయ్యారు. మూడేళ్ల కఠిన శిక్షణ అనంతరం 2024లో వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. స్పేస్ ఎక్స్‌లో పనిచేసే అనా మీనన్‌ను ఆయన వివాహం చేసుకున్నారు.

కొవిడ్ టీకాలు పూర్తి సురక్షితం

» ఆకస్మిక మరణాలతో వాటికి సంబంధం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 2: వయసుతో సంబంధం లేకుండా ఉన్నట్టుండి గుండెపోటుతో పలువురు మృత్యువాత పడుతున్న ఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి. క్రికెట్ ఆడుతూ, పెళ్లి ఊరేగింపులో నృత్యం చేస్తూ, వేదికపై పాట పాడుతూ... ఇలా ఎక్కడి వాళ్లు అక్కడే కుప్పకూలిపోయి క్షణాల్లోనే ప్రాణాలు వదిలేస్తున్నారు. కరోనా తర్వాతే ఈ తరహా మరణాలు ఎక్కువ కావడంతో వారు తీసుకున్న కొవిడ్ టీకాలే దీనికి కారణమని ప్రచారం సాగుతోంది. మరోవైపు కర్ణాటకలోని హాసన్ జిల్లాలో గత 40 రోజుల్లోనే 24 మంది గుండె సంబంధిత సమస్యలతో హఠాత్తుగా మృతిచెందడంతో వ్యాక్సిన్ ప్రభావంపై ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. దేశంలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు, కొవిడ్-19 టీకాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పలు జాతీయ వైద్య సంస్థలు నిర్వహించిన పరిశోధనల్లో సైతం ఇదే విషయం నిర్ధారణ అయిందని తెలిపింది. 'కొవిడ్ అనంతరం ప్రత్యేకించి 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారిలో ఆకస్మిక మరణాలకు గల కారణాలపై ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీ పరిశోధనలు చేశాయి. కొవిడ్ టీకాకు, ఈ మరణాలకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని ఈ అధ్యయనాల్లో తేలింది. భారత్‌లోని కొవిడ్ టీకాలు సురక్షితమైనవని పరిశోధనలు ధ్రువీకరించాయి. కొవిడ్ తదనంతర ఇబ్బందులతో పాటు జన్యుపరమైన సమస్యలు, జీవనశైలి, గతంలో ఉన్న అనారోగ్యం వంటివి కూడా కార్డియాక్ అరెస్టుకు దారి తీసి ఉండొచ్చని అధ్యయనాల్లో వెల్లడైంది' అని కేంద్రం వివరించింది. కాగా, 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య కాలంలో ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ ఆకస్మికంగా మరణించిన వ్యక్తులకు సంబంధించిన డేటాను ఐసీఎంఆర్ విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది.

రేవంత్.. తెలంగాణకు పట్టిన అబద్ధాల వైరస్!

రాష్ట్ర ద్రోహుల జాబితాలో తొలి పేరు ఆయనదే.. చంద్రబాబు, రేవంత్ మధ్య చీకటి ఒప్పందం

- ప్రజాభవన్ వేదికగా బనకచర్ల ప్రాజెక్టుకు పునాది
- తెలంగాణ నీటి హక్కులకు సీఎం మరణ శాసనం
- 2016లో బనకచర్ల రాసిచ్చామంటూ మాపై అబద్ధాలు
- కేసీఆర్ వాటర్‌మ్యాన్.. రేవంత్ 'వాటా' మ్యాన్
- దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టు.. నీ బట్టలు విప్పుతాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ధ్వజమెత్తిన హరీశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్ రావు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రజాభవన్ వేదికగా చంద్రబాబు, రేవంత్‌రెడ్డి మధ్య చీకటి ఒప్పందం కుదిరిందని మాజీ మంత్రి హరీశ్ ఆరోపించారు. అప్పుడే బనకచర్లకు పునాది పడిందన్నారు. చంద్రబాబుకు గురుదక్షిణ చెల్లించడంలో భాగంగానే రేవంత్‌రెడ్డి తెలంగాణ నీటి ప్రయోజనాలకు మరణశాసనం రాసి.. ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ నీటి ప్రయోజనాల కోసం పాటుపడిన కేసీఆర్ వాటర్ మ్యాన్ అయితే.. రేవంత్‌రెడ్డి 'వాటా మ్యాన్' అని హరీశ్ విమర్శించారు. 'తెలంగాణ ద్రోహుల జాబితాలో మొదటి పేరు నీదే. అదృష్టం కలిసొచ్చి సీఎం అయ్యావు. ఐదేళ్లు మంచిగా పనిచెయ్యి. రాష్ట్ర ద్రోహిగా మిగలకు' అంటూ సీఎంకు హితవు పలికారు. రేవంత్‌రెడ్డి తెలంగాణకు పట్టిన అబద్ధాల వైరస్ అని.. ఆ వైరస్‌కు విరుగుడు బీఆర్ఎస్ అనే టీకా మాత్రమేనని చెప్పారు. బుధవారం తెలంగాణ భవన్‌లో హరీశ్ మీడియాతో మాట్లాడారు. విభజన హామీల ముసుగులో ప్రజాభవన్ వేదికగా 2024 జులై 6న జరిగిన సమావేశంలో చంద్రబాబు, రేవంత్‌రెడ్డి మధ్య చీకటి ఒప్పందం జరిగిందన్నారు. ఆ రోజే బనకచర్లకు పునాది పడిందని, రేవంత్ తన గురువు కోసం తెలంగాణ ప్రజలకు అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సతీసమేతంగా 2024 సెప్టెంబరు 13న విజయవాడలో ఏపీ సీఎంను కలిసి, బెజవాడ బజ్జీలు తిని, బనకచర్లకు మద్దతు తెలిపి వచ్చారని చెప్పారు. ఈ క్రమంలోనే నవంబరు 15న ఏపీ గోదావరి బేసిన్ లింక్‌కు సహకరించాలంటూ చంద్రబాబు కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారని పేర్కొన్నారు. ఆ వెంటనే రూ.80 వేల కోట్ల ప్రాజెక్టు కోసం ఆర్థిక సాయం అందించాలని డిసెంబరు 31న నిర్మలకు మరో లేఖ రాశారన్నారు. ఓవైపు గోదావరి నీళ్ల తరలింపునకు కుట్రలు జరుగుతుంటే తనకేం తెలియనట్లు సీఎం రేవంత్‌రెడ్డి మౌనం నటించారని ఆరోపించారు. ఏపీ చేస్తున్న కుట్రలు తమకు తెలియగానే నిలదీశామని హరీశ్ చెప్పారు. 2025 జనవరి 24న ప్రెస్‌మీట్ పెట్టి కాంగ్రెస్ నేతలు గడ్డి పీకుతున్నారా అని నిలదీస్తే.. అదే రోజు సాయంత్రం పాత తేదీతో అప్పటికే తాను కేంద్రానికి లేఖ రాశానని ఉత్తమ్ ప్రకటించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బనకర్లను ఆపే చిత్తశుద్ధి రేవంత్‌కు లేదని చెప్పారు. ప్రజాభవన్‌లో ఆయన ఇచ్చిన ప్రెజెంటేషన్ అమరావతిలో తయారు చేసినట్లుగా ఉందని ధ్వజమెత్తారు. అందులో బనకచర్ల అంశం లేదని, ఉద్దేశపూర్వకంగా 2016 గోదావరి-పెన్నా అనుసంధానం అనే హెడ్డింగ్ పెట్టి కేసీఆర్ మొత్తం నీళ్లు వదిలేశారంటూ అబద్ధాలు చెప్పారని దుయ్యబట్టారు. ఈ ప్రదర్శనకు కేవలం కాంగ్రెస్ ఎమ్మెల్యేలనే కాకుండా అందరినీ పిలిస్తే వాస్తవం బయటపడేదన్నారు. రాజ్యాంగ పదవిలో ఉన్న రేవంత్‌రెడ్డి తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని చెప్పారు. కాళేశ్వరంతో పాటు పాలమూరు, డిండి, భక్తరామదాసు వంటి ఎన్నో ప్రాజెక్టులను చంద్రబాబు ఆపే ప్రయత్నం చేశారని, ఆ విషయాలను ఎందుకు చూపించలేదని ప్రశ్నించారు. 2016లో బనకచర్ల రాసి ఇచ్చారంటూ తమపై అసత్య ప్రచారం చేస్తున్నారని.. అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇచ్చిన లేఖలో లేని విషయాలను చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఆ భేటీలో బనకచర్ల అనే పదం ఉందా? ఒక్క పేరా చదివిన సీఎం.. అజెండా 5లో చెప్పిన అంశాలను ఎందుకు చదివి వినిపించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. వరద జలాల వినియోగంలో రెండు రాష్ట్రాలకు ఉపయోగపడేలా, ఆమోదయోగ్యంగా వాడుకునేందుకు సంప్రదింపులు చేసుకోవాలని మాత్రమే అందులో ఉందని హరీశ్ స్పష్టం చేశారు. 'దమ్ముంటే అసెంబ్లీలో చర్చ పెట్టు. వాస్తవాలు బయట పెడతాం. సభ సాక్షిగా నీ బట్టలు విప్పుతాం' అని సీఎంకు సవాలు విసిరారు. '15 రోజులు కృష్ణా, 15 రోజులు గోదావరి మీద మొత్తం నెల రోజులు మాట్లాడదాం. రేపే అసెంబ్లీ పెట్టు. ఎంతసేపైనా మాట్లాడు. వాయిదా వేయొద్దు. పారిపోవద్దు. మాకూ ప్రెజెంటేషన్ చేసే అవకాశం ఇవ్వు' అని హరీశ్ కోరారు. చంద్రబాబు కోవర్టులున్నారని మీ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అంటున్నారని, ఆ కోవర్టులెవరో చెప్పాలని నిలదీశారు. తాను ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్లుగా రేవంత్ భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఏ విధంగా చూసినా గోదావరి-బనకచర్ల తెలంగాణకు మరణ శాసనం కానుందని అన్నారు.

రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి మధ్య లవ్వేంది?

సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మధ్య ఉన్న ఫెవికాల్ బంధమేంటో అర్థం కావడం లేదని హరీశ్ అన్నారు. మేడిగడ్డలో పిల్లర్ కుంగితే రెండ్రోజుల్లో కేంద్ర సంస్థల్ని పిలిపించారని.. ఎస్ఎల్‌బీసీ మొత్తానికే కూలిపోతే ఎన్డీఎస్ఏకు ఎందుకు లేఖ రాయలేదని నిలదీశారు. కిషన్ రెడ్డి, రేవంత్‌రెడ్డి కలిసి తెలంగాణ నీటి ప్రయోజనాలు దెబ్బతీశారని.. వారి మధ్య ఉన్న లవ్వేందని హరీశ్ ప్రశ్నించారు.

బాబు బంగారం.. బీఆర్ఎస్ చచ్చిన పామా?

బనకచర్ల కట్టి తెలంగాణకు నష్టం కలిగించే కుట్రలు చేస్తున్న చంద్రబాబు నీ దృష్టిలో బంగారం.. దాన్ని అడ్డుకోవడానికి పోరాడుతున్న బీఆర్ఎస్ చచ్చిన పామా? అని సీఎంను హరీశ్ ప్రశ్నించారు. ఒక్కసారి ఓడినంత మాత్రాన గులాబీ పార్టీ చచ్చిన పామైతే.. చాలా రాష్ట్రాల్లో అదేపనిగా ఓడిపోతున్న కాంగ్రె‌స్‌ను ఏమనాలని నిలదీశారు. నువ్వు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నపుడు జరిగిన ఉప ఎన్నికల్లో ఎన్నడూ గెలవలేదు కదా? దాన్నేమనాలి? అంటూ రేవంత్‌ను ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి టెక్నికల్‌గా కాంగ్రెస్ సీఎం అయినా.. ఆయన హృదయం టీడీపీలోనే ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పేరెత్తకుండా రేవంత్ ఒక్క సమావేశంలో కూడా మాట్లాడలేదని, అహంకారంతో ప్రవర్తిస్తే ప్రజలు పాతాళానికి తొక్కుతారని హెచ్చరించారు. బనకచర్లపై బొంకుడు రాజకీయాలు మాని.. రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలని సూచించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కూడా కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఎంతో కష్టపడి సీతారామకు అనుమతులు తెచ్చామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 2023లోనే బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ, సీతమ్మ సాగర్‌కు 25 అనుమతులు సాధించిందని చెప్పారు.

ఆ మాటంటే నాలుక చీరేస్తాం..!

కృష్ణా జలాల్లో 299 టీఎంసీలను తెలంగాణ వాటాగా బీఆర్ఎస్ అంగీకరించిందంటూ అబద్ధాలు చెబితే నాలుక చీరేస్తామని హరీశ్ హెచ్చరించారు. గోదావరిలో 968 టీఎంసీలు, కృష్ణాలో 299 టీఎంసీలు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని.. 2013 నవంబరు 18న శ్రీకృష్ణ కమిటీకి అప్పటి ప్రభుత్వం ఇచ్చిన నివేదికలో పేర్కొందని గుర్తుచేశారు. నివేదికను అసెంబ్లీలో కూడా పెట్టారని.. ఆ విషయం సీఎం తెలుసుకోవాలని సూచించారు. అవసరమైతే ఆ డాక్యుమెంట్లను విడుదల చేస్తానని చెప్పారు. 299 టీఎంసీల లెక్కకు ద్రోహి ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్ అని.. ఈ రాచపుండుకు ఆయనే కారణమని ఆరోపించారు. రెండో అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర మంత్రి షెకావత్ సూచన మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో వేసిన కేసును వాపస్ తీసుకొని.. సెక్షన్ 3ని సాధించిందని చెప్పారు. దానిపై తెలంగాణ వాదనలు ముగింపు దశలో ఉన్నాయని, ఈ ఏడాదిలోనే 763 టీఎంసీలు మనకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇది తెలియకుండానే అమాయక చక్రవర్తి 500 టీఎంసీలు చాలని గతంలో చెప్పారన్నారు. 2020 అక్టోబరు 2న కేసీఆర్ అప్పటికే కేంద్ర మంత్రి షెకావత్‌కు రాసిన లేఖలో సముద్రంలో వృథాగా కలుస్తున్న 3000 టీఎంసీల్లో 1950తో పాటు ప్రస్తుతం ఉన్న 968 టీఎంసీలను కలుపుకొని మొత్తం 2918 టీఎంసీలు తెలంగాణ హక్కుగా పేర్కొన్నారని తెలిపారు. కానీ, గోదావరిలో 1000, కృష్ణాలో 500 టీఎంసీలు ఇచ్చి ఏమైనా చేసుకో అని చెప్పిన రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు మాటమార్చి వరద జలాల్లోనూ వాటా కావాలని అంటున్నారని గుర్తుచేశారు. కృష్ణాలో గత పదేళ్లలో ఎప్పుడూ వాడనంత తక్కువ నీటిని (28 శాతం) వాడిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, ఉన్న తాత్కాలిక ఒప్పందం ప్రకారం కూడా నీళ్లు వాడని దద్దమ్మ ప్రభుత్వం రేవంత్‌రెడ్డిదని హరీశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

నాలుగేళ్ల వయసులో తప్పిపోయి.. 31 ఏళ్ల తర్వాత తిరిగొచ్చాడు!

ఆదోని, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బుడి బుడి అడుగుల నాలుగేళ్ల ప్రాయంలో కన్నవాళ్లకు, పుట్టిన ఊరికే కాదు.. రాష్ట్రం నుంచే దూరమై.. ఎక్కడో పెరిగి.. 31 ఏళ్ల తర్వాత తిరిగొస్తే? ఏపీలోని ఆదోనిలో ఇదే జరిగింది. తాను ఎప్పుడో తప్పిపోయిన మీ వీరేశ్‌ను అంటూ హిందీలో చెబుతున్న అతడిని చూసి అప్తులు ఆశ్చర్యపోయారు.. సంతోషం పట్టలేక ఆనందభాష్పాలు కార్చారు! అయితే.. మూడు దశాబ్దాల క్రితం తిరిగొచ్చిన తనను చూసేందుకు తల్లిదండ్రులు బతికి లేరని తెలుసుకొని అతడు భోరున విలపించాడు. వీరేశ్ తల్లిదండ్రులు జనార్దన్, పద్మ! నాలుగేళ్ల బుడతడుగా వీరేశ్‌ను కన్నవారు ఆస్పత్రికి తీసుకెళుతుండగా తప్పిపోయాడు. ఓ రైలు కనిపిస్తే ఎక్కేశాడు. ముంబైలో దిగాడు. అక్కడ ఒక వసతిగృహం నిర్వాహకులు వీరేశ్‌ను చేరదీసి చదివించారు. పదో తరగతి పూర్తయ్యాక వీరేశ్ ఓ హోటల్లో పనిచేస్తూ డిప్లొమా పూర్తి చేశాడు. ముంబైలో పరిచయమైన చెన్నైకి చెందిన క్రిస్టెన్ ఫ్రాన్సిస్ అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరేశ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. నాలుగేళ్ల వయసులో సొంతూరు, అక్కడ పెరిగిన జ్ఞాపకాలు గుర్తుకొస్తుండటంతో వెళ్లి కన్నవారిని కలవాలనుకున్నాడు. ఈనెల 26న ముంబై నుంచి ఆదోనికి చేరుకొని తన తల్లిదండ్రులను వెతికిపెట్టాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను వేడుకున్నాడు. తనకు తండ్రి జనార్దన్, నాన్నమ్మ అంజనమ్మ పేర్లే గుర్తున్నాయని ఆయనకు వీరేశ్ చెప్పాడు. తనకు కుడికాలు విరగడంతో చిన్నప్పుడే శస్త్రచికిత్స చేశారని, అలాగే కుడి కన్ను పై భాగంలో గాయం తాలూకు గుర్తు ఉందని చెప్పాడు. వీరేశ్ గురించి.. తెలియడంతో కర్నూలు సమీపంలోని సూదిరెడ్డి పల్లెలో ఉన్న మేనత్త లక్ష్మి, మామ జగదీశ్ ఆదోనికి వచ్చారు. తమ వద్ద ఉన్న ఫొటోలు, రేషన్ కార్డులో ఉన్న నాన్నమ్మ అంజనమ్మ ఫొటోను వారు చూపడంతో వీరేశ్ గుర్తుపట్టాడు. వీరేశ్ తప్పిపోయాడన్న బాధతోనే అతడి తల్లిదండ్రులు చనిపోయారని బంధువులు చెప్పారు. ఎట్టకేలకు 31ఏళ్ల తర్వాత వీరేశ్ తిరిగిరావడంతో బంధువులు సంతోషం వ్యక్తం చేశారు. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ వీరేశ్‌ను బంధువులకు అప్పజెప్పారు.

ఛత్తీస్‌గఢ్‌తో నిర్మల్ జిల్లాకు అనుసంధానం

- జాతీయ రహదారి 61 విస్తరణకు కేంద్రం అనుమతి
- రూ.750 కోట్లు కేటాయింపు

నిర్మల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ నుంచి జగిత్యాల జిల్లా చల్గల్ వరకు నిర్మించ తలపెట్టిన జాతీయ రహదారి 61 విస్తరణ పనులకు ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈమేరకు రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ(ఎంఓఆర్‌టీహెచ్) ఖానాపూర్ నుంచి బాదనకుర్తి మీదుగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు 54 కిలోమీటర్ల పొడవుతో నిర్మించనున్న హైవే విస్తరణ పనుల కోసం రూ.750 కోట్లను కేటాయించింది. మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి మొదలయ్యే జాతీయ రహదారి నెంబర్ 61 తెలంగాణ రాష్ట్రంలోని భైంసా, నిర్మల్, ఖానాపూర్ మీదుగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు కొనసాగనుంది. ఇక్కడ నిజామాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగదల్పూర్ వరకు గల జాతీయ రహదారి 63కు ఈ హైవే అనుసంధానం కానుంది. దీంతో మహారాష్ట్రలోని కల్యాణ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్పూర్ వరకు జాతీయ రహదారి మార్గం పూర్తిస్థాయిలో ఏర్పడనుంది. ప్రాథమిక సర్వే ద్వారా కేంద్రం ఈ నిధులను కేటాయించింది. దీంతో సంబంధిత అధికారులు డీపీఆర్ రూపకల్పనతో పాటు భూ సేకరణ, అటవీ, ఇతర అనుమతుల వంటి వాటిని సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. డీపీఆర్ రూపకల్పన పూర్తయితే భూ సేకరణకు సంబంధించిన గెజిట్‌ను కూడా జారీ చేయనున్నారు. కాగా ఇప్పటికే నిర్మల్ నుంచి ఖానాపూర్ వరకు దాదాపు 35 కిలోమీటర్ల పొడవుతో జాతీయ రహదారి 61 పనులను పూర్తిచేశారు. ఈ రోడ్డుపై ఏడు చోట్ల అండర్ పాస్ పనులు ప్రస్తుతం పూర్తయ్యే దశకు చేరుకున్నాయి. ఇదిలా ఉండగా జగిత్యాల జిల్లా చల్గల్ వరకు విస్తరించనున్న ఈ రోడ్డు కోసం ఖానాపూర్ నుంచి బాదనకుర్తి వరకు బైపాస్ రోడ్డును నిర్మించాలని ప్రతిపాదించారు. మొత్తం 7 కిలోమీటర్ల పొడవుతో ఈ బైపాస్ రోడ్డును నిర్మించనున్నారు. కల్యాణ్ నుంచి ఖానాపూర్ వరకు నిర్మించిన జాతీయ రహదారి నెంబర్ 61ని జగిత్యాల జిల్లా చల్గల్ వరకు విస్తరించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి జారీ చేసిందని జాతీయ రహదారుల డీఈ ఆర్ఆర్. సుభాష్ తెలిపారు.

అమర్‌నాథ్ యాత్రికులకు నేటి నుంచి అన్నదానం

- క్షేత్రంలో 3చోట్ల సిద్దిపేట 'అమర్‌నాథ్ సేవా సమితి' ఏర్పాట్లు

సిద్దిపేట కల్చరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అమర్‌నాథ్ యాత్రికులను గురువారం నుంచి సిద్దిపేటకు చెందిన అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాదం ఉచితంగా అందించనున్నారు. గత నెలలోనే సరుకుల లారీకి ప్రత్యేక పూజలు చేసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు జెండా ఊపి అమర్నాథ్‌కు వాహనాన్ని పంపించారు. అమర్‌నాథ్ క్షేత్రం దారిలోని బాల్తాల్ బేస్ క్యాంప్ (లంగర్ నం.8), పంచతరణి బేస్ క్యాంప్ (లంగర్ నంబర్ 2)తో పాటు అమర్‌నాథ్ గుహ వద్ద మరో లంగర్ సహా మొత్తం 3 లంగర్లు ఏర్పాటు చేశారు. ఇక యాత్రికులకు ఉదయం 7 గంటల వరకు టీ, కాఫీ, పాలు, వేడి నీరు, బిస్కెట్లు, టోస్ట్ అందిస్తారు. ఉదయం 7.30 నుంచి బ్రేక్‌ఫాస్ట్ కింద ఇడ్లీ, వడ, దోశ, మైసూర్ బజ్జీ.. ఇలా రోజుకు 3 రకాలు ఇవ్వనున్నారు. మధ్యాహ్నం 12 నుంచి 5 గంటల వరకు అన్నంతో పాటు పప్పు, కర్రీ, సాంబార్, పెరుగు, పచ్చడి, చపాతి ఇస్తారు. సాయంత్రం 5 గంటలకు పానీపూరి, పూరి, చాట్, ఆలు బోండా వంటివి స్నాక్స్ కింద అందిస్తారు. మళ్లీ రాత్రి 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తాజా కర్రీలతో అన్నప్రసాదం అందజేస్తారు. కాగా, 'అమర్‌నాథ్ యాత్రికుల కోసం ఎన్నో ఏళ్లుగా శివయ్య దయతో అన్నప్రసాద వితరణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం. యాత్రికులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి' అని అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి పీఆర్‌వో మంకాల నవీన్ కుమార్ తెలిపారు.

6న హైదరాబాద్‌కు జస్టిస్ ఘోష్

- మంత్రివర్గ ఆమోదం లేకుండానే బ్యారేజీల నిర్మాణం
- కమిషన్‌కు ఆధారాలు సమర్పించిన సర్కారు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ ఈ నెల 6న హైదరాబాద్‌కు రానున్నారు. నాలుగు రోజుల పాటు ఆయన నగరంలోనే ఉండనున్నారు. ఇదిలా ఉండగా కాళేశ్వరం ప్రాజెక్టులో బ్యారేజీల నిర్మాణాలకు మంత్రివర్గం ఆమోదం లేదని నిరూపించే పత్రాలను అధికారులు బుధవారం కమిషన్ కార్యాలయంలో అందజేశారు. బ్యారేజీల నిర్మాణం కోసం నిర్ణయం తీసుకున్న ఏడాది తర్వాత.., అది కూడా నిర్మాణం ప్రారంభించి, డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి సమర్పించిన తర్వాత మంత్రివర్గంలో బ్యారేజీల నిర్మాణ నిర్ణయాన్ని ధ్రువీకరించుకున్నట్లు ఆధారాలతో కూడిన పత్రాలను కమిషన్‌కు అందించినట్లు తెలిసింది. కాగా, జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ ముందు గత నెల 11న హాజరైన మాజీ సీఎం కేసీఆర్.. బ్యారేజీల నిర్మాణ నిర్ణయం తానొక్కడినే తీసుకోలేదని, మొత్తం మంత్రివర్గం కలిసి తీసుకున్నదని చెప్పిన విషయం తెలిసిందే. ఈటల, హరీశ్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. మరోవైపు బ్యారేజీలపై నిర్ణయం తీసుకోవడానికి అప్పటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ నేతృత్వంలో తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్ సభ్యులుగా వేసిన మంత్రివర్గ ఉపసంఘం బ్యారేజీల నిర్మాణాలపై సిఫారసు చేసిందని కూడా విచారణలో చెప్పారు. అవన్నీ అవాస్తవాలని తుమ్మల ఖండించారు. ఈ నేపథ్యంలో వారిచ్చిన సాక్ష్యాలు కాకుండా.. ప్రభుత్వం వద్ద ఉన్న ఇతర వివరాలను అందించాలని కోరుతూ కమిషన్ లేఖ రాసింది. దీంతో కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంపై నిర్ణయం తీసుకున్న కొన్ని నెలల తర్వాత మంత్రివర్గంలో ఆ నిర్ణయాన్ని ర్యాటిఫికేషన్ చేసుకున్నారని.. కేసీఆర్, హరీశ్, ఈటల చెప్పినవన్నీ అవాస్తవాలంటూ సంబంధిత ఆధారాలను ప్రభుత్వం కమిషన్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ పత్రాలను అధ్యయనం చేసి, నివేదిక సమర్పించడానికి కమిషన్ మరింత గడువు కోరుతుందా? లేక ఈ నెలాఖరులోగా నివేదికను ఇస్తుందా? అన్నది తేలాల్సి ఉంది. మరోవైపు ఈ నెలాఖరుతో కమిషన్ గడువు ముగియనుంది.

జైలు నుంచి వల్లభనేని వంశీ విడుదల



విజయవాడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో అరెస్టయిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్‌పై జైలు నుంచి బయటికి వచ్చారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు మంగళవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆ పత్రాలను ఆయన తరఫు న్యాయవాదులు బుధవారం జైలు అధికారులకు అందజేయడంతో ఆయనను విడుదల చేశారు. తొలుత ఈ ఏడాది ఫిబ్రవరి 13న ముదునూరి సత్యవర్ధన్ కేసులో పటమట పోలీసులు వంశీని అరెస్టు చేశారు. ఆ తర్వాత వంశీ నిందితుడిగా ఉన్న పాత కేసులకు సంబంధించి ఆయా స్టేషన్ల పోలీసులు వరుసగా పీటీ వారెంట్లు దాఖలు చేశారు. అప్పటి నుంచి వివిధ కేసుల్లో వంశీకి న్యాయస్థానాలు రిమాండ్ విధించి, పొడిగించాయి. మొత్తం 137 రోజులపాటు వంశీ కారాగార జీవితాన్ని గడిపారు.

యూరియా కోటాలో కోత!

- ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి రాష్ట్ర కోటా సగానికి తగ్గింపు
- 2024 ఏప్రిల్-జూన్ మధ్య 1.3 లక్షల టన్నుల సరఫరా
- ఈ ఏడాది మాత్రం 71 వేల టన్నులకే పరిమితం
- జూలై నెల కోటా... 30వేల టన్నులకు కుదింపు

కోల్‌సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎరువుల కర్మాగారం(ఆర్ఎఫ్‌సీఎల్) నుంచి రాష్ట్రానికి అందాల్సిన యూరియాలో కోత పడుతోంది. వర్షాకాలం సీజన్‌లో సాగు ఊపందుకోవడంతో రైతులు యూరియా కోసం బారులుదీరుతుండగా, రాష్ట్ర విజ్ఞప్తులను డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్(డీవోఎఫ్) పట్టించుకోని పరిస్థితి ఉంది. రామగుండం ఎరువుల కర్మాగారంలో రాష్ట్ర ప్రభుత్వానికి వాటా ఉన్నా.. మొండి చేయి తప్పడం లేదు. పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో మూసేసిన ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌సీఐ)యూనిట్‌ను కేంద్రం పునరుద్ధరించిన విషయం తెలిసిందే. 12లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నిర్మించిన ఫ్యాక్టరీలో మూడేళ్లుగా ఉత్పత్తి కొనసాగుతోంది. ఇందులో తెలంగాణకు సైతం 11శాతం వాటా ఉంది. ఆయా రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం, యూరియా అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రిత్వ శాఖ సారథ్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫెర్టిలైజర్స్(డీవోఎఫ్) కోటాలు కేటాయిస్తుంది. గత ఏడాది 11.94లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగితే.. రాష్ట్రానికి 4.68లక్షల టన్నులు(సుమారుగా 45శాతం) రవాణా చేశారు. మిగిలిన యూరియాను ఇతర రాష్ట్రాలకు సరఫరా చేశారు. కానీ, ఈసారి అందుకు విరుద్ధంగా పరిస్థితులు ఉన్నాయి. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి గత ఏడాది ఏప్రిల్- జూన్ మధ్య 1.3లక్షల టన్నుల యూరియాను రాష్ట్రానికి సరఫరా చేస్తే... ఈ ఏడాది అది 71,773 టన్నులకే పరిమితమైంది. గత ఏడాది జూలైలో 60వేల టన్నుల కోటాను కేటాయిస్తే... ఈ ఏడాది దాన్ని 30వేల టన్నులకు కుదిరించారు. సాధారణంగా తెలంగాణలో ఏటా 20లక్షల టన్నుల యూరియా వినియోగం ఉంటుంది. ఇందులో వర్షాకాల సీజన్‌లో 10-11లక్షల టన్నుల డిమాండ్ ఉంటుంది. అయితే, వ్యవసాయంలో యూరియా వినియోగాన్ని తగ్గించాలన్న కేంద్రం నిర్ణయం మేరకు అన్ని రాష్ట్రాల కోటాల్లో కోత విధించామని అధికారులు చెబుతున్నారు. కానీ, తెలంగాణ మాదిరిగా ఇతర రాష్ట్రాల కేటాయింపుల్లో పెద్దగా కోతలు విధించిన దాఖలాలు కనబడడం లేదు. గత ఏడాది జూలైలో ఉత్తరప్రదేశ్‌కు 3.5 లక్షల టన్నుల యూరియాను కేటాయించిన డీఎఫ్‌వో..ఈ ఏడాదీ అంతే మొత్తంలో కేటాయించింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ఉత్పత్తి అయ్యే యూరియాలో తెలంగాణ కోటాకు కోత పెట్టి, ఇతర దక్షిణాది రాష్ట్రాలకు కేటాయించినట్లు తెలిసింది.



కేంద్రం నుంచి రాష్ట్రానికి 12 లక్షల టన్నుల యూరియా: ఎంపీ డీకే అరుణ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతాంగ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి రబీ సీజన్‌కు సంబంధించి 12 లక్షల టన్నుల యూరియాను పంపిణీ చేసిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. అవసరమయితే ఇంకా అదనంగా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం ఎరువుల సబ్సిడీ రూపంలో 12 లక్షల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసిందని తెలిపారు.

యూరియా కొరత తీర్చండి

- నెలవారీ కేటాయింపుల మేరకు ఇవ్వండి
- కేంద్ర ప్రభుత్వానికి మంత్రి తుమ్మల లేఖ



హైదరాబాద్, జులై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, నెలవారీ కేటాయింపుల ప్రకా రం రాష్ట్రానికి సరఫరా చేయాలని కేంద్రా న్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. ఇప్పటికే పలుమార్లు లేఖలు రాసిన తుమ్మల... తాజాగా బుధవారం మరోసారి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డా, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కుమార్‌కు లేఖలు రాశారు. వానాకాలం సీజన్ ప్రారంభమై ఇప్పటికే నెల రోజులు పూర్తయిందని, యూరియా కొరత కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో కలిపి రాష్ట్రానికి 5 లక్షల టన్నుల యూరియా కేటాయించినా... కేవలం 3 లక్షల టన్నులు మాత్రమే రాష్ట్రానికి వచ్చిందని గుర్తు చేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో యూరియా వినియోగం అత్యధికంగా ఉంటుందని ఈ తరుణంలో.. కిషన్‌రెడ్డి, సంజయ్ చొరవ తీసుకొని రాష్ట్రానికి యూరియా కోటాను తెప్పించాలని విజ్ఞప్తి చేశారు. జూలై నెలలో కేటాయించిన 97 వేల టన్నుల యూరియాను ఓడరేవుల నుంచి రాష్ట్రానికి సరఫరా చేయాలని కోరారు. అదేక్రమంలో రామగుండం ఫెర్టిలైజర్స్ ఫ్యాక్టరీ నుంచి యూరియా కేటాయింపులను 30,800 టన్నుల నుంచి 60 వేల టన్నులకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత మూడు నెలల్లో వచ్చిన లోటును భర్తీ చేయటానికి అదనపు కేటాయింపులు చేయాలని కోరారు. కాగా, చేనేత కార్మికులకు లక్ష వరకు రుణమాఫీ చేయటానికి రూ.33 కోట్లకు పరిపాలన అనుమతులు జారీ చేసినట్లు మంత్రి తుమ్మల తెలిపారు. దీంతో 5,691 మంది చేనేత కార్మికులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

బెట్టింగ్‌లో రూ.2.5 లక్షలు పోగొట్టి.. నిలదీసిన తండ్రిని కత్తితో పొడిచి చంపాడు!

- కుమారుడి దుర్మార్గం.. గచ్చిబౌలిలో ఘటన

రాయదుర్గం,జూలై2(ఆంధ్రజ్యోతి): ఇంట్లో దాచిన డబ్బును పెద్దవాళ్లకు తెలియకుండా ఆన్‌లైన్ జూదంలో పెట్టి కోల్పోయిన యువకుడు, ఆ డబ్బు గురించి మందలించాడని పగ పెంచుకొని కన్నతండ్రిని కత్తితో పొడిచి చంపాడు. పైగా తానే పొడుచుకొని చనిపోయాడని అందర్నీ నమ్మించేందుకు విఫలయత్నం చేశాడు! గచ్చిబౌలిలో ఈ ఘటన జరిగింది. సీఐ హబీబ్‌బుల్లాఖాన్ వెల్లడించిన వివరాల ప్రకారం... గోపన్‌పల్లి ఎన్టీఆర్ నగర్‌లో హన్మంతు నాయక్ కుటుంబం నివసిస్తోంది. ఇటీవల వనపర్తిలోని స్థలాన్ని విక్రయించగా వచ్చిన రూ.6 లక్షలను హన్మంతు ఇంట్లో దాచాడు. ఇది గమనించిన హన్మంతు కుమారుడు రవీందర్ నాయక్, ఆ డబ్బులోంచి రూ.2.5 లక్షలు తీసుకొని ఆన్‌లైన్ జూదంలో పెట్టి పోగొట్టాడు. ఆ డబ్బు గురించి హన్మంతు నిలదీస్తే అవసరానికి ఓ స్నేహితుడు అడిగితే ఇచ్చానని, తొందర్లోనే తెచ్చి ఇస్తానని చెబుతూ వస్తున్నాడు. ఈ డబ్బుల విషయం గుర్తొచ్చినప్పుడల్లా హన్మంతు మందలిస్తుండటంతో తండ్రిపై రవీందర్ కోపం పెంచుకున్నాడు. తండ్రిని చంపాలని పథకం వేసుకున్నాడు. అప్పు తీసుకున్న తన స్నేహితుడు డబ్బులు తిరిగి ఇస్తానన్నాడని తండ్రిని నమ్మించిన రవీందర్ అతడిని ఓ నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ.. వెంట తెచ్చుకున్న కత్తితో హన్మంతు గొంతులో పొడిచి చంపాడు. అనంతరం తన మేనమామకు ఫోన్ చేసి.. తండ్రి కత్తితో పొడుచుకొని ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పాడు. బంధువులు అక్కడికి వెళ్లి చూడగా హన్మంతు రక్తపుమడుగులో చనిపోయి ఉన్నాడు. రవీందర్‌పై అనుమానం వచ్చిన హన్మంతు బావమరిది పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు రవీందర్‌ను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకొన్నాడు. డబ్బు గురించి నిలదీయడం, మందలించడంతోనే తండ్రిని హత్యచేసినట్లు చెప్పాడు.

కిడ్నీ రాకెట్ కేసులో ముఖ్య దళారి అరెస్టు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కిడ్నీ రాకెట్ కేసుకు సంబంధించి ముఖ్య దళారి విజయనగరం జిల్లాకు చెందిన మురళీ కృష్ణను అరెస్టు చేసి ఒక బీఎండబ్ల్యూ కారు స్వాధీనం చేసుకున్నామని సీఐడీ అదనపు డీజీ చారు సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసులో ఇప్పటి వరకు 16మందిని అరెస్టు చేశామని పేర్కొన్నారు. తమిళనాడుకు చెందిన నిరుపేదలకు వల వేసి.. అవసరమైన వారికి కిడ్నీలు మార్పిడి చేయించడం ద్వారా మురళీ కృష్ణకు పది లక్షలు రూపాయలు అందేవని, అందులో నాలుగు లక్షలు బాధితులకు ఇచ్చి మిగతాది వైద్యులు, ఆస్పత్రి యజమాన్యాలతో కలిసి పంచుకునేవారని ఆమె వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎవరు బాధ్యులు?

హైదరాబాద్‌కు కూతవేటుదూరంలో ఉన్న పాశమైలారంలోని సిగాచీ ఫార్మస్యూటికల్ పరిశ్రమలో సంభవించిన ప్రమాదం ఊహకు అందనిది. మృతుల సంఖ్య అతివేగంగా పెరగడం, గాయపడినవారు అధికంగా ఉండటం, ఆచూకీ తెలియనివారు అనేకులు మిగిలిపోవడం ఈ ప్రమాదం తీవ్రతకు నిదర్శనాలు. పేలుడు ధాటికి మూడంతస్థుల భవనం పేకమేడలా కూలిపోవడంతో శిథిలాల కింద కన్నుమూసినవారే అధికం. పేలుడు సంభవించిన సమయంలో ఎక్కువమంది కార్మికులు ఫ్యాక్టరీలో ఉన్నందున మరణాలు గణనీయంగా ఉన్నాయి. శరీరాలు ఛిద్రమై అక్కడికక్కడే మరణించినవారు, మంటల్లో కాలిపోయినవారితో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా మారిపోయాయి. ఖాకీబట్టలేసుకొని, లంచ్ బాక్సుతో ఫ్యాక్టరీకి వెళ్ళిన కార్మికుడు డీఎన్ఏ పరీక్షతో తప్ప పోల్చలేని విధంగా క్షణాల్లో మాంసపు ముద్ద అయిపోవడం అత్యంత విషాదం.

ప్రమాదం జరిగినవెంటనే ఉలకని కంపెనీ యాజమాన్యం ఇప్పుడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు రాసిన లేఖలో, మీడియా ప్రచారం చేస్తున్నట్టుగా రియాక్టర్ పేలలేదని, మృతులు నలభైమందేనని అంటోంది. ప్రమాద కారణాలేమిటన్నది దర్యాప్తులో తేలుతుందని అంటున్న సిగాచీ యజమాన్యానికి తమ లోభత్వమో, పేరాశో ఈ ప్రమాదానికి కారణమని తెలియకపోదు. నాలుగుదశాబ్దాల నాటి ఫ్యాక్టరీలో మిషనరీని ఆధునికీకరించడం కానీ, కనీస ప్రమాణాలు పాటించడం కానీ జరగనప్పుడు పట్టెడన్నం కోసం వచ్చే కార్మికుడు ఇలా ప్రాణాలు వదిలేయవలసి వస్తుంది. ఈ ప్రమాదం ఎందుకు జరిగింది, అన్ని భద్రతాప్రమాణాలకు, నిబంధనలకు లోబడి ఈ ఫ్యాక్టరీ నడుస్తున్నదా అన్న విషయాలు నిర్ధారించడానికి నలుగురు నిపుణులతో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటుచేసి, నెలరోజుల్లో నివేదిక ఇవ్వమన్నది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా ఈ నిపుణుల కమిటీ ప్రభుత్వానికి చెబుతుందట. కమిటీలో ఉన్నవారంతా ప్రతిభగల శాస్త్రవేత్తలు, భద్రతానిపుణులు. రాబోయే కాలంలో ఈ కమిటీ నివేదిక ఆధారంగా సిగాచీని ప్రభుత్వం ఎంత గట్టిగా శిక్షించగలదో చూడాలి. అలాగే, ఆ నివేదిక ఆధారంగా పాలకులు తీసుకొనే చర్యల దెబ్బకు ఇకపై ఏ ఒక్క ఫ్యాక్టరీలోనూ ఏ ప్రమాదమూ జరగకూడదు మరి. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అన్న సామెత ఇటువంటి సందర్భాల్లో గుర్తుకు వస్తుంది కానీ, చేతులు కాలూతూనే ఉంటాయి, పసరు మందు మాత్రం పనిచేయదు.

పాత మిషనరీతో పనిచేస్తున్న ఈ ఫ్యాక్టరీ నిబంధనలను పాటించే అవకాశం సహజంగానే తక్కువ. సంబంధిత అధికారులు ఈ ఫ్యాక్టరీని ఎప్పుడు సందర్శించారు, ఏ లోపాలు గుర్తించారు, వారు ఆదేశాలను అమలు చేయనిపక్షంలో యాజమాన్యానికి ఏ శిక్షలు వేశారన్నది ప్రధానం. అధికారులు ఏమాత్రం బాధ్యతగా ఉన్నా ఈ ప్రమాదం జరిగివుండేదికాదు. యాజమాన్యం పాత మిషనరీని మార్చకపోగా, దాని నిర్వహణలో సైతం రాజీపడింది.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహాలతో ఎర్రతివాచీ పరవటాన్ని ఎవరూ కాదనడం లేదు. కానీ, ఆ పరిశ్రమలు భద్రతాప్రమాణాలు పాటించకపోయినా పట్టించుకోని, ప్రశ్నించని వ్యవస్థ ఉండటమే ఆందోళన కలిగిస్తున్నది. పరిశ్రమల యజమానుల మాదిరిగానే ప్రభుత్వాలు కూడా అధికారుల పర్యవేక్షణను పెత్తనంగా చూడటంతో చట్టాలు బలహీనపడుతున్నాయి, నిబంధనలు సడలిపోతున్నాయి, నియంత్రణలు తొలగి, తనిఖీలు తగ్గుతున్నాయి. ఫ్యాక్టరీలోకి ఇనస్పెక్టర్ కాలూనకుండా, అంతసవ్యంగా ఉన్నదని యజమాని ఆన్‌లైన్‌లో ధృవీకరిస్తే చాలనే పాడుకాలం దాపురించింది. అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమల్లో సైతం నైపుణ్యం లేని కార్మికులతో యజమానులు నెట్టుకురాగలుగుతున్నారంటే ప్రభుత్వాల అలసత్వం, చేతగానితనమే కారణం. యాజమాన్యాలను కార్మికులు నిలదీసే కాలం గతించి, తమ ప్రాణాలకు కాస్తంత భద్రతనివ్వమని ప్రాధేయపడినా ఫలితం లేని రోజులు వచ్చాయి. ఎంతటి ఘోరప్రమాదం జరిగినా కాస్తంత పరిహారం విదిలిస్తే చాలనుకొనే దుస్థితికి దిగజారిపోయాం తప్ప, యాజమాన్యాలను న్యాయస్థానాలకు ఈడ్చి, జైళ్ళలోకి నెట్టే దృశ్యాలే లేకపోయాయి.

ఆత్మహత్యల్లో హంతకులెవరు?

ఆత్మహత్యలు చర్చనీయాంశంగా మారాయి అంటే, మన సమాజంలో ఆత్మహత్యల రేటు పెరిగిందని అర్థం. హతుడే హంతకుడైనప్పుడు దాన్ని ఆత్మహత్య అంటారు. హంతకుడు మరొకడైనప్పుడు దాన్ని హత్య అంటారు. మన కుటుంబ, దాంపత్య వ్యవస్థల్లో చెలరేగుతున్న సంక్షోభాలకు ఇవి సంకేతాలు. సమాజంలో ఏదైనా సరే, పాతది పోయి కొత్తది రాకతప్పదు. అయితే, మనం మరచిపోకూడని అంశం ఏమంటే– పాత దానితోపాటు పాత నిబంధనలు పోయినట్టే... కొత్త దానితోపాటు కొత్త నిబంధనలు వస్తాయి. వాటిని పాటించక తప్పదు. వివాహిత స్త్రీతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించే పురుషుల్ని గతంలో నేరస్తులుగా భావించి శిక్షించేవారు. ఇప్పుడు వాటిని న్యాయస్థానాలు శిక్షార్హమైన నేరంగా పరిగణించడం లేదు; కేవలం సామాజిక తప్పిదంగా మాత్రమే భావిస్తున్నాయి. వివాహేతర సంబంధంలోకి ప్రవేశించిన–వివాహిత స్త్రీకి ఆమె భర్త, వివాహిత పురుషుడికి అతని భార్య విడాకులు ఇవ్వవచ్చు. అయితే విడాకులు ఇవ్వడం కూడా అంత సులువుకాదు. దానికి అనేక ఆర్థిక పరిమితులుంటాయి.


akbar

> 'ప్రేమ భావోద్వేగ అంశం' అన్నంతవరకు పేచీ లేదుగానీ, వివాహాన్ని భావోద్వేగానికి పరిమితం చేయడం కుదరదు. వివాహం ఒక వ్యవస్థ. వివాహ బంధంలోకి ప్రవేశించాలన్నా, అందులో నుంచి బయటికి రావాలన్నా కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది.

ఆత్మహత్యల్లో ఒక అమూర్త(కనిపించని) హంతకురాలు ఉంటుంది; అది సమాజం. కటువుగా అనిపించవచ్చుగానీ, అదే నిజం. సామాజిక అనుబంధాలు, నియమాల కారణంగానే ఆత్మహత్యలు జరుగుతాయని 19వ శతాబ్దపు సమాజ శాస్త్రవేత్త డేవిడ్ ఎమిల్ డ్యూర్ఖైమ్ (David Émile Durkheim) తెలిపాడు. ఆయన 1897లో 'లా సూసైడ్' పేరిట ఆత్మహత్యలపై ఒక విస్తార సిద్ధాంత గ్రంథాన్ని రాశాడు. ఆ సిద్ధాంతాన్నే సమాజ విశ్లేషకులు, పరిశోధకులు ఇప్పటికీ ప్రామాణికంగా భావిస్తుంటారు.

డ్యూర్ఖైమ్ సిద్ధాంతం ప్రకారం ఆత్మహత్యలు నాలుగు రకాలు. మనుషులతో అనుబంధాలు ఎక్కువైనవారు వారికోసం చనిపోవడానికి సిద్ధమవుతారు. ప్రజల్ని విపరీతంగా ప్రేమించే విప్లవకారులు ప్రజలకోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడడాన్ని మనం ఇప్పటికీ చూడవచ్చు. ఇది బలిదానాల ఆత్మహత్య (Altruistic suicide). మనుషులను అతిగా ద్వేషించేవారు కూడా అనుబంధాలు పూర్తిగా లోపించి, ఒంటరివారైపోయి ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇది అహంభావ ఆత్మహత్య (Egoistic Suicide). అధిక నియంత్రణ, నిర్బంధాలను తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడతారు. ఇది బలవన్మరణం (Fatalistic Suicide). నియమ నిబంధనల్ని బంధనాలుగా భావించేవారు కూడా ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇది నిబంధనోల్లంఘన ఆత్మహత్య (Anomic Suicide). నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నప్పుడు మనకు అభ్యుదయకరంగా, విప్లవకరంగా అనిపిస్తుంటుంది. ఉల్లంఘించలేకపోతే.. ఓ సాలెగూడు బంధించేస్తున్నట్టు అనిపిస్తుంటుంది. పాత నిబంధనల్ని ఉల్లంఘించినప్పటికీ కొత్త నిబంధనల్ని రూపొందించుకుని పాటించేవారు బహు అరుదుగా ఉంటారు. వాళ్లు మార్గదర్శకులు అవుతారు.

ఆత్మహత్యల రేటు కొన్ని దేశాల్లో ఎక్కువగానూ, కొన్ని దేశాల్లో తక్కువగానూ ఉంటుంది. దానికి కారణం ఆయా సమాజాల్లోని సంఘీభావ స్థాయిల్లో వ్యక్తమయ్యే హెచ్చుతగ్గులే. మనం కల్లోల దేశాలుగా భావించే ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్‌లలో ఆత్మహత్యల రేటు చాలా తక్కువ. అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాల్లో ఆత్మహత్యల రేటు చాలా ఎక్కువ. సంఖ్యాపరంగా చూస్తే అత్యధిక ఆత్మహత్యలు మనదేశంలోనే జరుగుతున్నాయి. చారిత్రక దశలను బట్టి ఆత్మహత్యల రేటు మారుతూ ఉంటుంది. ఉద్యమాలు, విప్లవ పోరాటాలు, పొరుగుదేశాలతో యుద్ధాలు కొనసాగుతున్న కాలంలో మనుషుల మధ్య అనుబంధాలు, సంఘీభావం చాలా ఉన్నతస్థాయిల్లో ఉంటాయి. ఆ ఉద్యమాలు, యుద్ధాలు, పోరాటాలు ముగిశాక ఫలాల కోసం పోటీ పెరిగి సంఘీభావం అంతరించిపోతుంది. సామాజిక నైతికతను, న్యాయ నియమాలనూ ఉల్లంఘించే ఒక అరాచక సంస్కృతి విజృంభిస్తుంది. అలాంటి దశల్లోనే ఆత్మహత్యల రేటు పెరుగుతుంది. ప్రేమైక సంఘీభావ సమాజాల్లో (Altruistic Society) ఆత్మహత్యల రేటు తక్కువగా ఉంటుందని, విద్వేష సమాజాల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుందని పదేళ్లక్రితం సోషల్ మీడియాలో నేనొక పోస్టు పెట్టాను. ఉత్తరాంధ్రకు చెందిన ఓ మహిళా లెక్చరర్ నా వాదనను గట్టిగా వ్యతిరేకించారు. ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు తదితర మానసిక దౌర్బల్యాల కారణంగానే ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటారని ఆమె వాదించారు. కొన్ని రోజుల పాటు మా మధ్య వాదన కొనసాగింది. నేను సమాజశాస్త్ర విద్యార్థిని, ఆమె మనస్తత్వశాస్త్ర ఉపన్యాసకురాలు. మా మధ్య ఎక్కడా రాజీ కుదరలేదు. విషాదకర విషయం ఏమిటంటే... సదరు అధ్యాపకురాలు ఓ మూడు నాలుగేళ్ల తర్వాత ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు పెళ్లయింది; భర్త ఉన్నాడు. విడాకులు తీసుకోకుండా మరో వ్యక్తితో సహజీవనం ఆరంభించారట. అతనూ వివాహితుడు, భార్యా, పిల్లలు ఉన్నారు. అతను కూడా విడాకులు తీసుకోలేదు. కనీసం భార్య నుంచి నిరభ్యంతర పత్రం (NOC) కూడా తీసుకోలేదు.

విడాకులు తీసుకోని వివాహిత స్త్రీ పురుషులు సహజీవనాన్ని కొనసాగించడం సామాజిక తప్పిదం. వాళ్ల శాసనోల్లంఘనం అక్కడితో ఆగలేదు. ప్రభుత్వ పత్రాలు వేటిల్లోనూ తాము సహజీవనం చేస్తున్నట్టు నమోదు చేసుకోలేదు. పెన్షన్ పత్రాల్లో నామినీగా చేర్చుకోలేదు. సదరు సహజీవన పురుషుని సమీప బంధువు పేరిట ఉన్న స్థలంలో ఈమె ఒక ఇల్లు కట్టారు. ఇంటి డాక్యుమెంట్స్‌ను తన పేరిట మార్పించుకోలేదు. భావోద్వేగాల ప్రేమ ఉన్నప్పుడు ఇవన్నీ అక్కరలేదు అనుకుని ఉండవచ్చు. కొన్నాళ్లకు ఆ సహజీవన పురుషుడు చనిపోయాడు. శవాన్ని అతని భార్యా పిల్లలు తీసుకునిపోయారు. శవాన్ని స్వాధీనం చేసుకోవడం అంటే.. ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్టే (మళ్ళీ మార్క్స్ గుర్తుకు వస్తున్నాడు). మరికొన్నాళ్లకు ఆ స్థల యజమాని వచ్చి ఇంటిని స్వాధీనం చేసుకున్నాడు. ఆ లేడీ లెక్చరర్ అన్నింటినీ కోల్పోయారు. విషాదం ఏమంటే ఆమె క్లెయిమ్ చేసుకోవడానికి కూడా ఏ ఒక్కటీ మిగలలేదు. నిబంధనోల్లంఘనల ఫలితం ఆమె ఆత్మహత్య.

సామాజిక అంశాలను మాత్రమే పట్టించుకుని వ్యక్తిత్వ, మనస్తత్వ అంశాలను నిర్లక్ష్యం చేశాడని డ్యూర్ఖైమ్ మీద ఒక విమర్శ ఉంది. తరచి చూస్తే.. ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, నైతికత మొదలైన వ్యక్తిత్వ, మనస్తత్వ అంశాలు కూడా ఆధునిక సమాజ ఉత్పత్తులే. భర్త వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడని తెలిసిన ఏ భార్య అయినా ముందుగా భావోద్వేగంతో తీవ్ర అభ్యంతరం చెప్తుంది. ఆ వెనుక ఆమెకు తన భయానికి అసలు కారణం తెలుస్తుంది. తనదీ, తన పిల్లలది అనుకుంటున్న ఆస్తికి మరొకరు వాటాదారులుగా వస్తుంటే తాము నిరాశ్రయులమైపోతామనేది ఏ భార్యకయినా సమంజసమైన ఆందోళనే. భావోద్వేగాలకు మాత్రమే పరిమితమయ్యేవారు అక్కడే ఆగిపోతారు. కొంచెం లౌక్యం తెలిసినవారు దానికో ఆర్థిక పరిష్కారాన్ని వెతుకుతారు.

వివాహేతర సంబంధాల్లో పురుషులకు ఉన్నంత అనుకూలత స్త్రీలకు లేదు. అయితే, స్త్రీలు కొంచెం తెలివిని ఉపయోగించి పరిస్థితిని తమకు అనుకూలంగా కాకపోయినా, ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు. 'కొత్తగా వచ్చే ఆమెకు భర్త ఆస్తిలో వాటా ఇవ్వరాదు, కొత్తామెతో పిల్లల్ని కనరాదు' వంటి కొన్ని షరతులు పెట్టి రెండు కుటుంబాలు అన్యోన్యంగానే కొనసాగిన సెలబ్రిటీల ఉదాహరణలు మన ముందు కొన్ని ఉన్నాయి. ఒక వివాహిత పురుషునితో సహజీవనం చేయాలనుకున్న స్త్రీ ముందుగా మొదటి భార్య నుంచి అతను విడాకులో, కనీసం నిరభ్యంతర పత్రమో పొందేలా జాగ్రత్తపడాలి. ఈ సంప్రదాయం కూడా ఇప్పుడు మన సమాజంలో ఉంది. విడాకులో, నిరభ్యంతర పత్రమో పొందడం వేరు; పొందుతామనే నమ్మకంతో ముందుగానే సహజీవనం మొదలు పెట్టేయడం వేరు. ఇలాంటి తప్పులు ఒక్కోసారి మరణానికి కూడా దారితీయవచ్చు.

ఆర్థిక నియమాల ఆధారంగా ఇప్పుడు సమాజంలో సంక్లిష్ట కుటుంబాలు, మిశ్రమ కుటుంబాలు, సవతి కుటుంబాల (complex family, blended family and step family) పేరిట కొత్త దాంపత్య బంధాలు ఏర్పడుతున్నాయి. ఈ ధోరణి పెరుగుతోంది కూడా. ఇప్పటికీ చాలామంది దాంపత్యానికి ఉన్న ఆర్థిక పునాదిని గుర్తించక, నివారించదగ్గ ఇబ్బందుల్ని కూడా విస్మరించి కొత్త చిక్కులు కొని తెచ్చుకుంటున్నారు. 'ప్రేమ భావోద్వేగ అంశం' అన్నంత వరకు పేచీ లేదుగానీ, వివాహాన్ని భావోద్వేగానికి పరిమితం చేయడం కుదరదు. వివాహం ఒక వ్యవస్థ. వివాహ బంధంలోకి ప్రవేశించాలన్నా, అందులో నుంచి బయటికి రావాలన్నా కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది.




■ డానీ
సమాజ విశ్లేషకుడు

భారత్ పాక్‌లను ఒకే గాటన కడతారా!?

'ఉగ్రవాదం ఒక మతాన్ని మించినది' అంటూ జూన్ 17న సిహెచ్.ఎస్.ఎన్.మూర్తి రాసిన వ్యాసం అసంబద్ధంగా ఉంది. ఆయన హిందూ వ్యతిరేకత, ముస్లిం సంతుష్టీకరణ ఈ వ్యాసంలో స్పష్టంగా కనపడింది. భారత్ ఉగ్రవాద పీడిత దేశం కాదని, ఇది ఒక తప్పుడు ప్రచారం అని, ఉగ్రవాద నిర్మూలన పేరుతో ఈ దేశంలో ప్రభుత్వాలు ముస్లింలను టార్గెట్ చేసి, చంపి వేస్తున్నాయని వ్యాసంలో చెప్పడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.

బెలూచిస్థాన్ ప్రాంతంలోని ముస్లిం ఉగ్రవాదుల వల్ల పాకిస్థాన్ ప్రభుత్వం చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొంటుందని, అందువల్లనే భారతదేశం కంటే పాకిస్థాన్‌లో ఎక్కువమంది ముస్లింలు చనిపోతున్నారని రచయిత వాపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కశ్మీర్ వేర్పాటువాదులకు వంతపాడి, బెలూచిస్థాన్ వేర్పాటువాదులను దెప్పిపొడవడం ఎందుకు? కశ్మీర్ 370 ఆర్టికల్‌ను అడ్డుపెట్టుకొని కశ్మీర్ వేర్పాటువాదులు జరిపిన నరమేధాన్ని ప్రజా పోరాటం అంటారా? ఈ వేర్పాటువాదుల దుశ్చర్యల వల్ల మూడు లక్షల మంది హిందువులు సర్వస్వాన్ని వదులుకొని, లోయ నుంచి పారిపోయి వచ్చారు. మైనారిటీలకు భయపడి మెజారిటీ మతస్థులు పారిపోయి రావడం ఈ భూమండలంపై ఎక్కడా జరగదు.



> పాకిస్థాన్, భారతదేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్ని మతాన్ని మేళవించి పాలన చేస్తున్నారని చెప్పడం అత్యంత వివాదాస్పదం. భారత్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను ఎన్నుకున్నది. పాకిస్థాన్‌లో మతవాదులు, సైన్యం కలిసి ప్రజలను పీక్కు తింటున్నారు. ఇస్లామిక్ తీవ్రవాదానికి ఆ దేశం అడ్డాగా ఉంది. ఈ దేశం నాది అని భావించే వారెవరూ భారత్‌ను పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టి ఇలాంటి విశ్లేషణలు చేయరు.

భారతదేశంలో 562 సంస్థానాలు విలీనమైనట్లే కశ్మీరు సంస్థానం కూడా విలీనమైంది. ఆనాటి కశ్మీర్ సంస్థానం రాజు రాజా హరిసింగ్‌ను ఒప్పందానికి ఒప్పించిన ఆరెస్సెస్ రెండవ అధ్యక్షులు గురూజీ ఇదే విషయాన్ని స్పష్టీకరించారు. ఒక ప్రాంతంలో ముస్లింలు ఎక్కువగా ఉన్నంత మాత్రాన ప్రత్యేక హక్కులు ఇవ్వబడతాయా? మరి హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి వాదనలు తలెత్తవా? కశ్మీర్ వేర్పాటు ఉద్యమాన్ని సమర్థించే వాళ్ళందరూ కూడా ఈ దేశానికి వ్యతిరేకులే. కశ్మీరీల స్వయం నిర్ణయాధికారం కోసం నడిపిన ఉద్యమంలో కశ్మీరీ పండిట్లు పాల్గొన్నారని చెప్పడం పచ్చి అబద్ధం!

ఇక దేశ విభజన మతం ఆధారంగా ఎందుకు జరిగింది? విభజనను కోరింది ఎవరు? ఇందుకు పునాది ఏమిటి? ఈ విషయంలో హిందువుల పాత్ర ఎంత? ఇత్యాది విషయాలను కూలంకషంగా చర్చిస్తే వాస్తవాలు బోధపడతాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచే స్వాతంత్ర్య ఉద్యమాన్ని అడ్డుకోవడానికి 1906లో బ్రిటిష్ నాయకుల సలహా మేరకు ముస్లిం లీగ్ సంస్థ ఏర్పాటు చేయబడిందనే విషయం అర్థమైతే వాస్తవ విషయాలు స్ఫురణకు వస్తాయి. ఇస్లాం సమాజంలో సంస్కరణలు కావాలని కోరిన సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఈ దేశంలో ద్విజాతి సిద్ధాంతాన్ని ముస్లిం సమాజం ముందు ఉంచిన విషయంపై వ్యాసకర్తకు అవగాహన లేదనిపిస్తుంది. 1946లో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికలలో 80 సీట్లకు పోటీ చేసిన ముస్లిం లీగ్ ముస్లింలు మెజారిటీగా ఉండే ప్రాంతాల్లో 73 సీట్లు గెలిచింది. అఖండ భారత్ నిర్మాణమే లక్ష్యంగా జాతీయ కాంగ్రెస్ 1585 సీట్లకు పోటీ చేస్తే కేవలం 925 సీట్లు మాత్రమే గెలిచింది. హిందువులు ముస్లింలు కలిసి ఉండాలనే భావనకు మద్దతు లభించలేదనే విషయం స్పష్టమైంది. మతం ఆధారంగా దేశ విభజన జరగాలని ఈ దేశంలో ముస్లిలందరూ కోరుకున్నారు. అందుకు అనుకూలంగా ఓటు వేశారు. ఈ ఎన్నికల విజయంతో చెలరేగిపోయిన ముస్లిం లీగ్ నాయకులు 1946 ఆగస్టులో డైరెక్ట్ యాక్షన్‌కు పిలుపునిచ్చి, హిందువులపై నరమేధానికి కారణమయ్యారు. ఈ నరమేధాన్ని కళ్ళారా చూసిన కాంగ్రెస్ నాయకులు భయపడి దేశ విభజనకు ఒప్పుకున్నారనేది వాస్తవం. ఈ చారిత్రక సత్యాన్ని దేశ ప్రజలకు తెలియనీయకుండా లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ వ్యతిరేక హిందువులు, స్వయం ప్రకటిత మేధావులు తమకు తోచిన రీతిలో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

అమెరికా, రష్యా మధ్య ఏర్పడిన ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు బంగ్లాదేశ్ ఏర్పాటుకు, భారత్ పాకిస్థాన్ యుద్ధానికి కారణమని వ్యాస రచయిత చెప్పడం చారిత్రక అవగాహన లేకపోవడమే! 1970లో షేక్ ముజిబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో నేషనల్ అవామీ లీగ్ పార్టీ బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజయం సాధించడంతో ఉర్దూ మాట్లాడే పశ్చిమ పాకిస్థాన్ నాయకులకు ఒళ్ళు మండింది. సైన్యాన్ని ఉసిగొలిపి, బెంగాలీ ముస్లింలను ఊచకోత కోయించారు. అనేక లక్షలమంది హిందువులు, ముస్లింలు భారతదేశంలోకి పారిపోయి వచ్చారు. ఈ భయంకర పరిస్థితుల్లో తూర్పు పాకిస్థాన్‌లోని ప్రజల రక్షణార్థం భారత సైన్యం జోక్యం చేసుకోవలసి వచ్చింది. దీన్ని విస్తరణవాదం అని ఎలా సూత్రీకరిస్తారు.


పాకిస్థాన్, భారతదేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్ని మతాన్ని మేళవించి పాలన చేస్తున్నారని చెప్పడం అత్యంత వివాదాస్పదం. భారత్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను ఎన్నుకున్నది. ఇక్కడ రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వాలు ఎన్నుకోబడుతున్నాయి. ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగుతుంది. ఇక పాకిస్థాన్‌లో మతవాదులు, సైన్యం కలిసి ప్రజలను పీక్కు తింటున్నారు. ఎన్నుకున్న ప్రభుత్వాలు ఎంత కాలం పరిపాలనలో ఉంటాయో తెలియదు. ఇస్లామిక్ తీవ్రవాదానికి ఆ దేశం అడ్డాగా ఉంది.

నాగాలాండ్, అస్సాం, మణిపూర్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో తీవ్రవాద కార్యక్రమాలకు హిందువులు కారణమని చెప్పడంలో రచయిత హిందూ వ్యతిరేకత పరాకాష్ఠకు చేరింది. నాగాలాండ్, అస్సాం మణిపూర్‌లలో తీవ్రవాదం పెరగడానికి దేశ వ్యతిరేక అంతర్జాతీయ శక్తులు కారణం. తమిళ ప్రత్యేక రాజ్యం కోసం ఎల్‌టీటీఈ, సిక్కుల ప్రత్యేక రాజ్యం కోసం ఖలిస్థాన్ ఉగ్రవాదుల చర్యలకు ఈ దేశ ప్రజలు మద్దతు ఇవ్వలేదన్న విషయం వాస్తవమే కదా? వాస్తవంగా తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా హిందూ సమాజం అంగీకరించదు. హిందూమత పెద్దలు, మతాచార్యులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఆధ్యాత్మిక విషయాలు మాత్రమే బోధిస్తారు. మత విషయాలు ఎన్నటికీ బోధించరు. ఈ కారణం వల్లనే హిందువులు మెజారిటీగా ఉండే భారత దేశంలో అన్ని మతాలవాళ్ళు శాంతియుత సహజీవనం చేస్తున్నారు. ఈ దేశం నాది, ఈ దేశానికి నేను వారసుడ్ని, ఈ దేశానికి గొప్ప సాంస్కృతిక, చారిత్రిక, ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది అని భావించే వారెవరూ భారత్‌ను పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టి ఇలాంటి విశ్లేషణలు చేయరు.

○ ఉల్లి బాలరంగయ్య
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

వృద్ధులందరికీ ఒకే పింఛన్ అవసరం

మలి వయసులో జీవితం సాఫీగా గడవాలంటే పింఛన్ చాలా ముఖ్యం. మన దేశ పింఛన్ ఆస్తులు చాలా స్వల్పంగా ఉన్నాయని 2025–26 ఆర్థిక సర్వే పేర్కొంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఆయా దేశాల జీడీపీల్లో 80 శాతంగా పింఛన్ ఆస్తులు ఉన్నాయి. కానీ మన దేశ జీడీపీలో 17 శాతం మాత్రమే ఉన్నాయని తాజా ఆర్థిక సర్వే తెలిపింది. నేడు 12 శాతం ఉద్యోగులకు మాత్రమే ఫార్మల్ పింఛన్ కవరేజీ ఉంది, అది కూడా అసమతుల్యంగా. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంఘటిత రంగ ఉద్యోగులకు పలు రకాల పింఛన్ స్కీంలు అందుబాటులో ఉన్నాయి. అసంఘటిత రంగానికి వస్తే జాతీయ పింఛన్ విధానం, అటల్ పెన్షన్ యోజనలు మాత్రమే ఉన్నాయి. వీటిలో కూడా స్వచ్ఛందంగా చేరే వారికే పింఛన్ లభిస్తుంది. ఈ రెండు స్కీంల ద్వారా దేశ జనాభాలోని కేవలం 5.3 శాతం మందే లబ్ధి పొందుతున్నారు.



అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో పింఛన్ సార్వత్రికంగా అమలవుతున్నది. జపాన్‌లో 20–59 మధ్య వయసు పౌరులందరూ పింఛన్ కోసం ఫ్లాట్ రేట్ కంట్రిబ్యూషన్ స్కీములో తప్పనిసరిగా చేరాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, వారిపై ఆధారపడ్డ వారికి ఒకటే స్కీం అమలుపరుస్తున్నారు. న్యూజిలాండ్‌లో కూడా పింఛన్ సార్వత్రికం. స్వీడన్, నార్వే, నెదర్లాండ్ దేశాలు సార్వత్రిక పెన్షన్ అమలు చేస్తున్నాయి. ఇండియాలో అసంఘటిత ప్రజల కోసం అమలులో ఉన్న పెన్షన్ స్కీంలు పూర్తిగా స్వచ్ఛందం. అర్హులందరికీ పింఛన్ అందకపోవడానికి ఇదొక అవరోధం. జనసామాన్యంలో పింఛన్ పట్ల సరైన అవగాహన లేదు. ప్రభుత్వం, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు, విద్యాధికులు... ప్రజలకు పింఛన్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. పింఛన్‌దారులకు సులువుగా డబ్బులు పొందే వీలు కల్పించటం, పింఛన్ వ్యవహారాలు చూసే సంస్థ ఆర్థిక ఆరోగ్యం కాపాడటం చాలా ముఖ్యం. పింఛన్ సంస్థ ఈ రెండు పనులు సమర్థవంతంగా నిర్వహిస్తే, ఆ సంస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది.

మెర్సర్ గ్లోబల్ పెన్షన్ ఇండెక్స్ ప్రపంచ దేశాల పింఛన్ తీరుతెన్నులు గమనిస్తుంది. ర్యాంకింగ్ ఇస్తుంది. పెన్షన్ ఇండెక్స్ 2024లో 48 దేశాలలో పింఛన్ అమలుపై అధ్యయనం చేసింది. ఇందులో భారత్‌కు 44వ స్థానం దక్కింది. చైనాది 31వ స్థానం. అయినా పబ్లిక్ పెన్షన్ విధానంలో సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రైవేట్ నిధుల సాయం తీసుకోకుంటే పబ్లిక్ పింఛన్ సేవలు కుంటుపడవచ్చు అంటోంది. కనుక బలమైన మార్కెట్ అభివృద్ధికి ప్రైవేట్ నిధుల మద్దతు అవసరం. నెదర్లాండ్స్, డెన్మార్క్, ఆస్ట్రేలియాలు ప్రజా పెన్షన్ సక్రమ నిర్వహణకు ప్రైవేట్ నిధులు స్వీకరిస్తున్నాయి. నమ్మకమైన రాబడి కోసం అమెరికా పెన్షన్ నిధులను ఎంపిక చేసిన ఋణ నిధులలో పెట్టుబడులు పెడుతోంది.

దేశంలో పలురకాల పెన్షన్ స్కీములు ఉన్నాయి. స్థూలంగా వీటిని ప్రభుత్వ స్కీములు, ప్రైవేటువి, వార్షిక ప్లానులుగా వర్గీకరించవచ్చు. వీటిలోనే జాతీయ పింఛన్ పథకం, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, ప్రభుత్వ ప్రావిడెంట్, మరెన్నో ఉన్నాయి. ముక్కలు ముక్కలుగా వున్న పెన్షన్ స్కీములను సమన్వయపరచి, ఆదర్శవంతమైన మూడు అంచెల పెన్షన్ స్కీంగా రూపొందించాలని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. పని, హోదాలతో నిమిత్తం లేకుండా అర్హులందరికీ ఒకే ఫ్లాట్ రేట్ కాంట్రిబ్యూషన్ తప్పనిసరి చేసి, కనీస పింఛన్ గ్యారంటీ చేయాలి. ఉద్యోగుల కోసం కంపెనీ చెల్లించే ఆక్యుపేషనల్ పెన్షన్‌ను క్రమబద్ధీకరించాలి. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు కనీస చందా నియమానికి కట్టుబడి ఈ స్కీముని నిర్వహించాలి. స్వచ్ఛంద పెన్షన్ సేవింగ్స్ ప్రోత్సహించాలి. రిటైర్మెంట్ కాలానికి మంచి రిటర్న్ రావాలంటే ఈ రకమైన పొదుపులకు పన్ను రాయితీ ఇవ్వాలి. స్త్రీ, పురుష, పని భేదం లేకుండా వృద్ధులందరికీ పింఛన్ అందితే వారి జీవిత చివరి మజిలీకి కనీస ఆర్థిక భద్రత లభిస్తుంది.

– వి. వరదరాజు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన ఈ–మెయిల్
editpage@andhrajyothy.com
వ్యాసాలు యూనికోడ్‌లో ఉండాలి, 800 పదాలకు మించకూడదు.

తెలంగాణకు కాళేశ్వరమే శ్రీరామరక్ష

తెలంగాణకు కాళేశ్వరమే శ్రీరామరక్ష. ఈ ప్రాజెక్టుపై జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అక్కసు వెళ్లగక్కారు. 'ఏ కోణంలోనూ కాళేశ్వరాన్ని సమర్థించలేం' పేరుతో జూలై 2న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వ్యాసంలో ప్రాజెక్టు గురించి ఆయన అనేక అసత్యాలు రాశారు. జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఓ రాజకీయ పునరావాస కేంద్రంగా మారడం దురదృష్టకరం.

తెలంగాణ రాష్ట్రం కృష్ణా, గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలంటే ఎత్తిపోతలు తప్ప మరో మార్గం లేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల వరకు గోదావరి జలాలను తరలిస్తా'మని చెబుతూ 'ప్రాణహిత–చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టు'ను ప్రతిపాదించింది. 2014 వరకు కేంద్రంలో, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీయే అధికారంలో ఉన్నా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు. ప్రధానమైన హెడ్ వర్క్స్ పనుల్లో తట్ట మట్టి కూడా తీయకుండానే కాంట్రాక్టర్లకు రూ. వేల కోట్ల మొబిలైజేషన్ అడ్వాన్స్‌లు ఇచ్చి పక్క కమీషన్ల ప్రాజెక్టుగా మార్చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ 152 మీటర్ల ఎత్తులో తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి అనేక ప్రయత్నాలు చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. 148 మీటర్ల ఎత్తులో మాత్రమే బ్యారేజీ నిర్మాణానికి ఒప్పుకుంటామని మహారాష్ట్ర స్పష్టం చేసింది. తుమ్మిడిహెట్టి వద్ద 165 టీఎంసీల నికర జలాల లభ్యత ఉన్నా అందులో ఛత్తీస్‌గఢ్ వినియోగించుకొని 63 టీఎంసీలు కూడా ఉన్నాయనే విషయాన్ని సీడబ్ల్యూసీ ఎత్తి చూపింది. 165 టీఎంసీల నీటిని వినియోగించే ప్రాజెక్టులో కేవలం 16 టీఎంసీల రిజర్వాయర్లు మాత్రమే ప్రతిపాదించడాన్ని కూడా తప్పుబట్టింది. వీటన్నింటికీ మించి వైన్‌గంగా, వార్ధ నదుల సంగమం తర్వాత ప్రాణహిత నది ప్రవాహం మొదలవుతుంది. అదే ప్రాంతంలో తుమ్మిడిహెట్టి బ్యారేజీని ప్రతిపాదించారు. తుమ్మిడిహెట్టి వద్ద మహారాష్ట్ర వైపున నదీ ప్రవాహం 40 డిగ్రీల కోణంలో వంపు తిరిగి ఉంటుంది. ఆ ప్రదేశంలో బ్యారేజీ నిర్మాణానికి సాంకేతికంగా ఎన్నో అవాంతరాలు ఉన్నాయి. ఫలితంగానే కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యామ్నాయాల వైపు చూడాల్సి వచ్చింది.

> కాళేశ్వరం ప్రాజెక్టుపై 100 రూపాయలు ఖర్చు చేస్తే 52 రూపాయల ఆదాయం మాత్రమే వస్తుంది కాబట్టి ఈ ప్రాజెక్టు లాభసాటి కాదు అని వ్యాసకర్త తెలిపారు. విద్య, వైద్యం, రైతులు, మహిళల సంక్షేమం కోసం చేసే ఖర్చును లాభనష్టాల కోణంలో చూడటమే తప్పు. ప్రజా సంక్షేమం ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం. రాష్ట్రానికి హక్కుగా దక్కే నదీజలాలను ఒడిసిపట్టేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడొద్దు.



నిపుణుల కమిటీ మేడిగడ్డను వ్యతిరేకించింది అనేది పచ్చి అబద్ధం. మేడిగడ్డ నుంచి నేరుగా మిడ్ మానేరుకు నీటిని తరలించాలన్న ప్రతిపాదనను మాత్రమే నిపుణుల కమిటీ వద్దని చెప్పింది. మేడిగడ్డ వద్ద 240 టీఎంసీలకు పైగా నికర జలాల లభ్యత ఉందని సీడబ్ల్యూసీ నిర్ధారించింది. అందుకే ప్రాజెక్టు సోర్స్ పాయింట్‌ను తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కేసీఆర్ ప్రభుత్వం మార్చాల్సి వచ్చింది. ప్రాణహిత–చేవెళ్లకు అన్ని అనుమతులు వచ్చినట్టు వ్యాసకర్త రాశారు. అది కూడా తప్పే. ప్రాణహిత ప్రాజెక్టుకు కొన్ని అనుమతులు వచ్చిన మాట నిజమే అయినా కాళేశ్వరం ప్రాజెక్టుగా రీ డిజైన్ చేసిన తర్వాతనే కేంద్రం నుంచి అన్ని అనుమతులు సాధించారనేది వాస్తవం. కాళేశ్వరం ప్రాజెక్టుతో ప్రయోజనమే లేదని చెప్పడానికి వ్యాసకర్త ప్రయత్నించారు. 20 లక్షల ఎకరాలకు పైగా భూములకు ఈ ప్రాజెక్టు ద్వారా నీళ్లిచ్చారని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారికంగా ప్రకటించింది. ఈ వాస్తవాన్ని తొక్కిపెట్టి కాళేశ్వరంపై వ్యాసకర్త విషం చిమ్మారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై 100 రూపాయలు ఖర్చు చేస్తే 52 రూపాయల ఆదాయం మాత్రమే వస్తుంది కాబట్టి ఈ ప్రాజెక్టు లాభసాటి కాదు అని వ్యాసకర్త తెలిపారు. విద్య, వైద్యం, రైతులు, మహిళల సంక్షేమం కోసం చేసే ఖర్చును లాభనష్టాల కోణంలో చూడటమే తప్పు. ప్రజా సంక్షేమం ప్రభుత్వాల విధ్యుక్త ధర్మం. రాష్ట్రానికి హక్కుగా దక్కే నదీజలాలను ఒడిసిపట్టేందుకు ఎంత ఖర్చుకైనా వెనుకాడొద్దు అనే వాస్తవాన్ని గుర్తించాలి. ఏపీ ప్రభుత్వం రూ.82 వేల కోట్లతో తలపెట్టిన గోదావరి–బనకచర్ల లింక్ ప్రాజెక్టు కింద ఒక్క ఎకరా అయినా కొత్త ఆయకట్టు ఉందా అన్న విషయం కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకించే వాళ్లు గుర్తించాలి. 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరు ఇచ్చే, మరో 20 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే కాళేశ్వరం ప్రాజెక్టును సమర్థించలేమని వ్యాసకర్త అంటున్నారు. అంటే ఏపీ ప్రభుత్వం జలదోపిడీ కోసం ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుకు ఆయన వంత పాడుతున్నట్లుగా భావించాల్సి ఉంటుంది. వ్యాసకర్త తన రాజకీయ బాస్‌ను మెప్పించడానికి ఈ ప్రయత్నం చేసినట్టుగా అనిపిస్తోంది. ప్రపంచ దేశాల్లో నిర్మించిన భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ లాభాల సాధన కోసం మాత్రమే కాదు. ఆయా దేశాలు, రాష్ట్రాల నీటి హక్కులు కాపాడుకోవడంతో పాటు అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించుకోవడానికి అన్న వాస్తవాన్ని అంగీకరించాలి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం ఇకపై నిధులు వినియోగిస్తే ఆ వ్యయం కూడా వృథా అనే తప్పుడు సూత్రీకరణలకు ఇకనైనా ఫుల్‌స్టాప్ పెట్టాలి. గోదావరి నదిలో మనకు హక్కుగా దక్కే నీటిలో అతి ఎక్కువ నీటిని వినియోగించుకునే అవకాశం ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుతోనే ఉన్నది. ఈ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలి. కాళేశ్వరమే తెలంగాణకు శ్రీరామరక్ష. కాళేశ్వరమే తెలంగాణకు లైఫ్ లైన్.



• కల్వకుంట్ల కవిత
శాసనమండలి సభ్యురాలు

ముహూర్తం ఖరారు



- జనవరి 28 నుంచి 31వరకు మేడారం మహా జాతర
- దేవస్థానం అధికారులు, పూజారులు వెల్లడి



మహా జాతరకు ముహూర్తం ఖరారు చేస్తున్న పూజారులు

తాడ్వాయి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహాజాతర ముహూర్తం ఖరారైంది. 2026 జనవరి 28 నుంచి 31 వరకుజాతర జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వాహక అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు బుధవారం ప్రకటించారు. వనదేవతలు సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహా జాతర నాలుగు రోజుల పాటు జరగనుందని తెలిపారు.

జనవరి 21 మండెమెలుగు

మహాజాతర ప్రారంభానికి ముందు జనవరి 21(బుధవారం) మండే మెలుగు (శుద్ధి పండుగ) కార్యక్రమం జరుగుతుందని ఈవో వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు తెలిపారు. జాతర ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4(బుధవారం) తిరుగువారం పండుగ జరుగుతుందని పేర్కొన్నారు. తిరుగువారం తర్వాత వచ్చే మొదటి ఆదివారం పూజారుల వనభోజనాలతో జాతర తంతు పూర్తిగా ముగుస్తుందని జగ్గారావు తెలిపారు.

షెడ్యూల్ ఇలా..

- జనవరి 28 (బుధవారం) సాయంత్రం 6 గంటలకు సారలమ్మ అమ్మవారు మేడారంలోని గద్దెను చేరుతుంది. అలాగే పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు రావడంతో మహా జాతర మొదటి ఘట్టం ప్రారంభమవుతుంది.
- జనవరి 29 (గురువారం) సాయంత్రం 6 గంటలకు వనదేవత సమ్మక్క గద్దెకు చేరుతుంది. దీంతో ప్రధాన ఘట్టం పూర్తవుతుందన్నారు.
- జనవరి 30 (శుక్రవారం) భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు.
- జనవరి 31 (శనివారం) సాయంత్రం 6 గంటలకు వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేస్తారు. దీంతో నాలుగు రోజుల ఈ మహా జాతర ముగుస్తుంది.

మేడిగడ్డ బ్యారేజీకి వరద జోరు

37వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో.. అంతే నీరుకు దిగువకు



మేడిగడ్డ బ్యారేజీ వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్ రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద నీరు క్రమంగా పెరుగుతోంది. బ్యారేజీలోకి బుధవారం 36,900 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 1.40 మీటర్ల ఎత్తులో గోదావరి ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కొత్త కొత్తగా ఉంటదా!?



అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ

అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన... కొందరికి మోదాన్ని, మరి కొందరికి ఖేదాన్ని మిగల్చనుందా? కొత్త తరం నేతలను చట్టసభలకు పంపనుందా? రాజకీయ సమీకరణాలను, ముఖచిత్రాన్ని మార్చివేయనుందా? ప్రస్తుతం వున్న నియోజకవర్గాల్లో గల్లంతయ్యేమి ఏమిటి? కొత్తగా అవతరించనున్నవి ఏమిటి?... రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతున్న చర్చ ఇది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోందనే వార్తలు.. ఉత్కంఠను రేపుతున్నాయి. పునర్విభజన అనివార్యం కావడంతో ఉమ్మడి జిల్లాలో పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి. నియోజకవర్గాల సరిహద్దులతో పాటు రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉంది. వీటితోపాటు ఏపీ విభజన చట్టంలో పేర్కొన్నట్లుగా తెలంగాణలో కొత్తగా అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. 2011 జనాభాతో పాటు, కొత్తగా 12 మండలాలు కరీంనగర్, ఖమ్మం జిల్లాల నుంచి ఉమ్మడి వరంగల్‌లో విలీనం కావటంతో, 3 లేదా 4 కొత్త అసెంబ్లీ స్థానాలు పెరుగుతాయనే భావిస్తున్నారు. 2028, 2029లో ఎన్నికలు పునర్విభజన అనంతర నియోజకవర్గాల్లో జరగనుండటంతో ఆయా నియోజకవర్గాల్లో అప్పుడే రాజకీయ సందడి కనిపిస్తోంది.

- మార్పులు చేర్పులకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12అసెంబ్లీ, 2పార్లమెంట్ స్థానాలు
- జనాభా ప్రాతిపదికన కొత్తగా మూడు లేదా నాలుగు స్థానాలు పెరిగే ఛాన్స్
- కొత్త జిల్లాల ఏర్పాటుతో పొరుగు జిల్లాల నుంచి విలీనమైన 12 మండలాలు
- ఒకే జిల్లా పరిధిలో అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఉండటం సాధ్యమేనా
- వరంగల్ జిల్లా ఆరు ముక్కలుగా విడిపోవటంతో డీలిమిటేషన్‌పై ప్రభావం
- రిజర్వేషన్లు కూడా మారే అవకాశం ఉండటంతో ఆశావహుల్లో ఉత్కంఠ

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

రాజ్యాంగం ప్రకారం ప్రతి 20 ఏళ్లకు ఒకసారి పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. 2007-08లో జరిగిన పునర్విభజనలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 13 నుంచి 12కు పడిపోయింది. శాయంపేట, చెన్నూరు, చేర్యాల, హనుమకొండ, వరంగల్ అసెంబ్లీ నియోజకవర్గాలు కనుమరుగయ్యాయి. వీటి స్థానంలో కొత్తగా పాలకుర్తి, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, వరంగల్‌తూర్పు పేరుతో నియోజకవర్గాలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం 2011 జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాల పునర్విభజన చేయాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణలో నియోజకవర్గాలను పెంచాలనే ప్రతిపాదన ఉంది. రాష్ట్రంలోని ప్రతి ఎంపీ స్థానంలో రెండు అసెంబ్లీ స్థానాలను పెంచాలని అప్పట్లో నిర్ణయించారు. ఈ లెక్కన తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలు ఉండటంతో కొత్తగా 34 అసెంబ్లీ నియోజకవర్గాలు పెరగనున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో రెండు పార్లమెంట్ స్థానాలు ఉన్నాయి. ఈ లెక్కన నాలుగు ఎమ్మెల్యే స్థానాలు పెరగాల్సి ఉంది.

మహబూబాబాద్ ఎంపీ స్థానంలో ఖమ్మం జిల్లాకు చెందిన భద్రాచలం, పినపాక, ఇల్లందు నియోజకవర్గాలు ఉన్నాయి. అయితే జనగామ అసెంబ్లీ నియోజకవర్గం భువనగిరి ఎంపీ పరిధిలో ఉండగా, కరీంనగర్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాల పరిధిలోని కొన్ని మండలాలు హనుమకొండ, భూపాలపల్లి జిల్లాలో విలీనమయ్యాయి. వీటన్నింటిని కూడా ఒకే పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లోకి తీసుకరానున్నారు. పార్లమెంట్ పరంగా చూస్తే నాలుగైదు అసెంబ్లీ స్థానాలు పెరిగే ఛాన్స్ ఉంది. ఇక జనాభా పరంగా ఉమ్మడి వరంగల్

(మిగతా 7వ పేజీలో...)

నగరంలో మరొకటి..

గ్రేటర్ వరంగల్ పరిధిలో ప్రస్తుతం వరంగల్ తూర్పు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలు పూర్తిగా ఉండగా, వర్ధన్నపేట, పరకాల, స్టేషన్‌ఘనపూర్ నియోజకవర్గాల పరిధిలోని కొన్ని డివిజన్‌లు ఉన్నాయి. నగర జనాభా భారీగా పెరగటంతో పాటు గ్రామీణ ప్రాంతాలు మునిసిపల్ కార్పొరేషన్‌లో విలీనంతో పట్టణీకరణ పెరిగింది. దీంతో డీలిమిటేషన్‌లో పట్టణ అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెరుగనుంది. గ్రేటర్ వరంగల్ పరిధిలో 10లక్షలకు పైగా జనాభా ఉంది. ఈ లెక్కన మూడు పట్టణ అసెంబ్లీ స్థానాలతో పాటు మరో అర్బన్, రూరల్ కలిపి మరో అసెంబ్లీ నియోజకవర్గం కూడా ఇక్కడే ఏర్పడే అవకాశముందనే చర్చ జరుగుతోంది. ప్రధానంగా ప్రస్తుతం ఉన్న వరంగల్ ఈస్ట్, వరంగల్ వెస్ట్‌తో పాటు వరంగల్ సెంట్రల్ అసెంబ్లీ స్థానం ఏర్పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. వీటితో పాటు హసన్‌పర్తి లేదా కమలాపూర్‌ను కేంద్రంగా చేసుకుని ధర్మసాగర్, వేలేరు, ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, హసన్‌పర్తి, కమలాపూర్ మండలాలతో మరో అసెంబ్లీ స్థానం ఏర్పడుతుందనే టాక్ వినబడుతోంది. వరంగల్ మహానగరంలోనే ఒకటి లేదా రెండు అసెంబ్లీ స్థానాలు కొత్తగా ఏర్పడే అవకాశం ఉండటంతో అందరి దృష్టి కొత్తస్థానాలపై పడిందనే టాక్ ఉంది.



గవర్నర్‌ను కలిసిన వీసీ ప్రతాప్‌రెడ్డి

7న స్నాతకోత్సవానికి రావాలని ఆహ్వానం



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు పుష్పగుచ్ఛం ఇస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్

కేయూ క్యాంపస్ జూలై 2, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి రెడ్డి, ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్‌లు కలిసారు. ఈ నెల 7న కేయూ ఆడిటోరియంలో జరిగే 23వ స్నాతకోత్సవానికి లాంఛనంగా ఆహ్వానించి పత్రికను అందచేశారు. స్నాతకోత్సవ నిర్వహణ, సమయం, బంగారు పతకాల వివరాలు, పీహెచ్‌డీ డాక్టరేట్ పట్టాలు అందుకునే అభ్యర్థుల వివరాలను గవర్నర్‌కు అందచేశారు. అలాగే స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా రానున్న డి.శ్రీనివాసరెడ్డిని కలిసి ఆహ్వానం అందచేసినట్లు వర్సిటీ అధికారులు వెల్లడించారు.



బాలికపై అత్యాచారం

యువకుడిపై పోక్సో కేసు

ఐనవోలు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో, రేప్ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. హనుమకొండ జిల్లా ఐనవోలు మండలంలోని పంథిని గ్రామానికి చెందిన జన్ను సురేశ్.. కొన్ని రోజులుగా ఒక బాలిక (15)ను నమ్మించి పలుమార్లు అత్యాచారం చేశాడు. దీంతో ఆ బాలిక ఐదు మాసాల గర్భం దాల్చింది. ఈ క్రమంలో ఆమె గర్భాన్ని తొలగించేందుకు కొన్ని మాత్రలను తీసుకవచ్చి మింగించాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో బాలిక వరంగల్ సీకేఎం ఆస్పత్రికి వెళ్లింది. వైద్యులు వెంటనే శిశువును తొలగించి ప్రాణాపాయం నుంచి కాపాడి పోలీసులకు సమాచారం అందించారు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సురేశ్‌పై పోక్సో, రేప్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపారు. బాలిక తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులు చేస్తూ జీవిస్తున్నారు. డిగ్రీ పూర్తి చేసిన సురేశ్ ఏ పనీ చేయకుండా జులాయిగా తిరుగుతుంటాడని తెలిసింది.

క్లీన్ సిటీయే లక్ష్యంగా..

100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలులో జీడబ్ల్యూఎంసీ

- పచ్చదనం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి
- ప్రతీ రోజు ఒక కార్యక్రమంతో ప్రజల్లోకి...
- కొత్త కమిషనర్ రాకతో ఊపందుకున్న కార్యాచరణ
- సెప్టెంబర్ 10 వరకు కొనసాగనున్న యాక్షన్‌ప్లాన్

వరంగల్ కార్పొరేషన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్(ప్రణాళిక) నగర పాలక సంస్థ పరిధిలో సక్సెస్ ఫుల్‌గా సాగుతోంది. గతంలో కొంత మందకొడిగా ముందుకు సాగినా.. కొత్త కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత వంద రోజుల ప్రణాళిక ఊపందుకుంది. నగర పాలక సంస్థ పరిధిలోని 66 డివిజన్లను సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు ఒక్కో రోజు ఒక కార్యక్రమంతో ముందుకు సాగుతున్నారు. జూన్ 2 రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు గ్రేటర్‌లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ ప్రక్రియ సెప్టెంబరు 10 వరకు కొనసాగనుంది.

ఇప్పటికే నగరంలో చాలా సమస్యలు ప్రజలు చవిచూస్తుండగా 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో చాలా ప్రాంతాల్లో పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పౌర సేవలకు ప్రాధాన్యం ఇస్తూ సక్సెస్ బాటలో నడుస్తున్నామని నగర పాలక సంస్థ అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇంకా నగరంలో కాల్వలలో డిసిల్టేషన్, వ్యర్థ విభజన, రిసైక్లింగ్, కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు వైద్య పరీక్షలు, వీధి వ్యాపారులను ప్రోత్సహించేందుకు ఫుడ్‌ఫెస్టివల్, శానిటేషన్, వాటర్ సప్లై, ఎలక్ట్రికల్, దోమల నివారణ, హరితహారం ద్వారా ప్లాంటేషన్, జంక్షన్ల అభివృద్ధి, కాలనీలలో సీసీ, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతూ ప్రజల ఆదరణ పొందుతున్నారు.



వరంగల్‌లో డ్రైనేజీలను పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి

వివిధ ప్రాంతాల్లో...

తడి, పొడి చెత్త వేరు చేసి అప్పగించడంపై ప్రజలకు కాలనీల వారీగా సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా మునిసిపాలిటీతో పాటు మహిళాశక్తి గ్రూపులు, ఎన్‌జీవోస్, సోషల్ యాక్టర్స్‌ను సమన్వయం చేసుకుని డివిజన్లు, ప్రాంతాల వారీగా పనుల విభజనకు రూపకల్పన చేశారు. ఈ మేరకు మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ఆదేశాల మేరకు ఎంచుకున్న ప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీలు, జంక్షన్ల అభివృద్ధి, ఐసీసీసీ, సీసీ కెమెరాల ఏర్పాటు చేస్తున్నారు. వరంగల్ ట్రైసిటీస్‌లో ఇప్పటికే 189 కాలనీలలో

(మిగతా 6వ పేజీలో...)



చింతగట్టులో ఎబీసీ సెంటర్ తనిఖీ చేస్తున్న కమిషనర్

విద్యుత్ ఉద్యోగులకు భరోసా

- అందుబాటులోకి వచ్చిన బీమా పథకం
- విధినిర్వహణలో మృతి చెందితే రూ. కోటి పరిహారం
- తీవ్రంగా గాయపడితే రూ. 80 లక్షలు
- సహజ మరణం చెందితే రూ. 10 లక్షలు
- 13 వేల మంది ఉద్యోగులకు లబ్ధి
- ఎస్‌బీఐ, యూబీఐలతో ఒప్పందం



7

గుడిసెవాసులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- భద్రకాళి చెరువు పూడికతీత అక్రమాలపై విచారణ చేపట్టాలి
- శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి
- హనుమకొండ కలెక్టర్‌కు వినతి పత్రం



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్

హనుమకొండ టౌన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): హనుమకొండ, బాలసముద్రంలోని జితేందర్‌సింగ్ నగర్, అంబేద్కర్ కాలనీలో గుడిసెల్లో నివాసం ఉంటున్న వారికే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌ను బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. జితేందర్‌సింగ్ కాలనీ, అంబేద్కర్‌నగర్‌లో 40 ఏళ్లకు పైగా గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్న పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు పంపిణీ చేయాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఎంతో మంది ఇళ్లు కోల్పోయారని, వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో అవకాశం కల్పించాలన్నారు.

అలాగే ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన భద్రకాళి చెరువు పూడికతీత పనులలో నాణ్యత ప్రమాణాలు లోపించాయని అన్నారు. వాటి అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. భద్రకాళి చెరువు పూడికతీత కారణంగా ఉపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, వరంగల్ పశ్చిమ నియోజక వర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ నగర్, జితేందర్ సింగ్ కాలనీ కమిటీ సభ్యులు ఎర్ర చంద్రమౌళి, సౌరం రఘు, రమేష్, సాయికుమార్, రూప తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర, శివదూతీ మాతగా అమ్మవారు

ఏడో రోజుకు చేరిన శాకంబరీ ఉత్సవాలు


శివదూతీ మాత అలంకారంలో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వరంగల్ కల్చరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ భద్రకాళి దేవస్థానంలో శాకంబరీ ఉత్సవాలు బుధవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఉదయం 4 గంటలకు నిత్యపూజ అనంతరం అర్చకులు అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్ఛాశక్తి కాళీ క్రమాన్ని అనుసరించి ఉగ్రమాతగా శోడషీ క్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని శివదూతీమాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తమి తిథికి ఆది దేవత అయిన ఉగ్రమాతను ఆరాధించిన వారికి సమస్యలన్నీ తొలగిపోయి శివానుగ్రహం కలుగుతుందని అర్చకుడు భద్రకాళి శేషు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఈవో శేషు భారతి, ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ప్రవంతి, అనంతుల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జోరుగా వర్షాలు

మహబూబాబాద్ జిల్లాలో 86.8 మి.మీ. వర్షం

హనుమకొండ, జులై 02 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో బుధవారం తెలికపాటి నుంచి మోస్తరు భారీ వర్షాలు కురిశాయి. మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో 86.8 మి.మీ. వర్షం కురిసింది. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలో 57.1 మి.మీ, వరంగల్ జిల్లాలో 55.5 మి.మీ, హనుమకొండ జిల్లాలో 44.2 మి.మీ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌లో 45 మి.మీ, జనగామ జిల్లాలో చిల్పూర్‌లో 28.8 మి.మీ వర్షపాతం నమోదైంది. మంగళవారం రాత్రి నుంచి మొదలైన ముసురు బుధవారం ఉదయం వరకు కురుస్తూనే ఉంది. వచ్చే మూడురోజులు ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

6న విరసం ఆవిర్భావ సభ

జనగామ కల్చరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విప్లవ రచయితల సంఘం (విరసం) ఆవిర్భావ సభ జూలై 6న నిర్వహిస్తున్నట్లు విరసం ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ కోడం కుమారస్వామి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.నాగేశ్వర్, జి.కళావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సభ నిర్వహిస్తామన్నారు. ఆదివారం ఉదయం సెషన్‌లో 'కాల్పుల విరమణ ఒప్పందాలు - మార్క్సిస్టు దృక్పథం', మధ్యాహ్నం 'ఫాసిస్టు చుట్టివేత దాడి - విప్లవోద్యమ పంథా', సాయంత్రం 3 గంటలకు 'తెలంగాణలో శాంతి చర్చల ఆవశ్యకత' అంశాలపై ప్రసంగాలు ఉంటాయన్నారు. కవులు, రచయితలు, మేధావులు, విద్యార్థులు, టీచర్లు, ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని వారు కోరారు.

6న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

కేసముద్రం, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండలంలోని పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఈనెల 6న వస్తున్నారని ఎమ్మెల్యే మురళీనాయక్ తెలిపారు. ఉపముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నిర్వహించే బహిరంగ సభ స్థలాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక గణపతిఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలోనే కేసముద్రం అభివృద్ధిలో ముందుందని తెలిపారు. 15వేల మందితో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.స్థానిక సంస్థల ఎన్నికలకు ఏ సమయంలోనైనా నోటిఫికేషన్ విడుదలవుతుందని, దీనికి కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు భరత్‌చంద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీడబ్ల్యూఎంసీకి ఉద్యోగులు కావలెను

- వివిధ విభాగాల్లో భర్తీకాని పోస్టులు
- ఇన్‌చార్జులపై పెరుగుతున్న పని భారం
- చాలా శాఖలకు ఇన్‌చార్జులే బాస్‌లు
- వెనకబడిపోతున్న గ్రేటర్ ప్రజాపాలన


బయాలజిస్ట్ లేకపోవడంతో కనిపిస్తున్న ఖాళీ కుర్చీ

వరంగల్ కార్పొరేషన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ)లో అధికారులు లేక సీట్లు వెలవెలబోతున్నాయి. దీంతో నగర ప్రజలకు అందించాల్సిన పౌరసేవలు స్తంభించిపోతున్నాయి. ఇప్పటికే టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, మలేరియా, వెటర్నరీ, శానిటేషన్, పన్నులు, రెవెన్యూ శాఖలకు పూర్తిస్థాయి అధికారులు, సిబ్బంది లేకపోవడంతో ప్రజలకు సేవలందించలేక కింది స్థాయి సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన స్థానాలలో ఇంకా ఎవరినీ నియమించకపోవడం, వచ్చిన అధికారులు కూడా ఇక్కడి పాలకవర్గం ఒత్తిడి అధిగమించలేక సెలవులపై వెళ్లిపోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది.

కీలక విభాగాలకు అధికారులు కరువు

పరిపాలన విభాగం డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్ స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. సెక్రెటరీ అలివేలు బదిలీపై వెళ్లగా ఆమె స్థానం ఖాళీగా ఉంది. ఏడుగురు సీనియర్ అసిస్టెంట్లు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, నలుగురు మాత్రమే పని చేస్తున్నారు. ఖాళీ అయిన సెక్షన్లకు వీరే అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జీడబ్ల్యూఎంసీకి గుండెకాయ వంటి టౌన్‌ప్లానింగ్ విభాగానికి 15 మాసాలుగా సిటీ ప్లానర్ లేక పోవడంతో ఏసీపీ కేడర్‌లో ఉన్న రవీంద్ర రాడేకర్ ఇన్‌చార్జి సీపీగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. ఇంజనీరింగ్ విభాగానికి ఎస్ఈ లేకపోవడంతో ఈఈగా పనిచేస్తున్న బి.మహేందర్ అదనపు బాధ్యతలలో ఎస్ఈగా పని చేస్తున్నారు. నగరంలో కోతులు, కుక్కలను నియంత్రించాల్సిన వెటర్నరీ అధికారి చాలాకాలంగా లేక పోవడంతో విశ్రాంత ఉద్యోగి చాలా కాలంగా పని చేస్తున్నాడు. అకౌంట్స్ విభాగానికి చీఫ్ అకౌంట్స్ అధికారి లేక పోవడంతో ఏవో ఆ విధులను నిర్వర్తిస్తున్నాడు. మలేరియా విభాగం (బయాలజిస్ట్) అధికారి బదిలీ అయి 5 నెలలు గడుస్తున్నా ఇంకా ఎవరిని నియమించక పోవడంతో సీఎంహెచ్‌వో రాజారెడ్డి అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

ఐటీ విభాగానికి పూర్తిస్థాయి అధికారి లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రమేష్ చీఫ్ హోదాలో పని చేస్తున్నాడు. గ్రేటర్ అగ్నిమాపక, డీఆర్ఎఫ్ శాఖలకు ఆర్ఎఫ్‌వో లేక పోవడంతో డీఎఫ్‌వోగా పని చేస్తున్న శంకర్‌లింగం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. డెత్, బర్త్ సెక్షన్‌లో డీఎస్‌వో ఉండాల్సి ఉండగా కిందిస్థాయి ఎస్‌వో ఇనోక్ ఇన్‌చార్జిగా పని చేస్తున్నారు. ఇటీవల ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి బదిలీ చేయగా వారి స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు. ఇక శానిటేషన్ విభాగంలో ఇద్దరు ఎంహెచ్‌వోలు ఒక సీఎంహెచ్‌వో ఉండాల్సింది పోయి ఇద్దరే నగరాన్ని చెరి సగం పంచుకుని పని చేస్తున్నారు. 66 డివిజన్‌లకు కనీసం 30 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పని చేయాల్సి ఉండగా, 10 మంది మాత్రమే పని చేస్తున్నారు. నగరాన్ని శుభ్రం చేయాల్సిన సుమారు 2890 మంది పీహెచ్ (పబ్లిక్ హెల్త్ వర్కర్లు) నగానికిపైగా పని చేయకుండా తప్పించుకుని తిరుగుతూ జవాన్‌లను మేనేజ్ చేస్తూ జీతాలు తీసుకుంటున్నారు. 30 మంది ఆర్‌ఐ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు) పని చేయాల్సి ఉండగా 11 మంది పని చేస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. ప్రస్తుతం వరంగల్ కలెక్టర్ పీఆర్‌వోగా పని చేస్తున్న అయూబ్ గ్రేటర్ మునిసిపల్ కమిషనర్, మేయర్, కుడాకు ఇన్‌చార్జి పీఆర్‌వోగా పని చేస్తున్నాడు. ఇంకాచాలా వింగ్‌లలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో అక్కడి సిబ్బంది ఇన్‌చార్జుగా పని చేస్తున్నారు.

అలాగే నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంతో పాటు కాజీపేట, కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయాలతో పాటు వార్డు కార్యాలయాల వద్ద సరిపడా సిబ్బంది లేరు. ఒక్కో అధికారికి రెండు, మూడు శాఖలకు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పనిభారం పెరిగిపోయి నగర ప్రజలకు అందించాల్సిన సేవలకు దూరమవుతున్నట్లు చెప్పుకొస్తున్నారు. నగరంలో చేపట్టే అభివృద్ధి పనులు, శానిటేషన్, మలేరియా దోమల మందు పిచికారీ, స్వచ్ఛ సర్వేక్షణ్, హరితహారం, స్మార్ట్‌సిటీ పనులు, ఇంజనీరింగ్ పనులు కుంటు పడుతున్నాయి. ఇంకా కార్యాలయాల్లో పని చేసే కొందరు సిబ్బందిని ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువకిరణాలు వంటి సంక్షేమ పథకాల సర్వేకు నియమించడంతో పౌరసేవలు ఇబ్బందిగా మారుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు చేయాల్సిన పనులను కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేయవలసి వస్తుంది. గ్రేటర్‌లో పౌర సేవలు నిర్లక్ష్యం వల్ల అధికారుల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే అదునుగా భావించి కొందరు పనుల కోసం వచ్చే ప్రజల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తూ పనులు పూర్తిచేస్తున్నట్టు తెలిసింది. 14 లక్షలకు పైగా జనాభా కలిగిన గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు సరిపడా ఉద్యోగులను నియమించి సత్వర సేవలు అందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తప్పుల తడకగా అతిథి అధ్యాపకుల నియామకం

● నిబంధనలకు తిలోదకాలు ● డీఈవో లేకుండానే ఇంటర్వ్యూలు ● డైట్, బీఈడీ కళాశాలల్లో ఎంపికలపై ఆరోపణలు

హనుమకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని ప్రభుత్వ డైట్, బీఈడీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల నియామకాలు పారదర్శకంగా జరగలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బీఈడీ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకులను కాదని, ప్రైవేటు కళాశాలల్లో పని చేస్తున్న వారి చేత దరఖాస్తులు దాఖలు చేయించుకున్నారని, దీంతో 140కిపైగా దరఖాస్తులు వచ్చాయని, తీరా ఇంటర్వ్యూ సమయానికి సాంఘిక సంక్షేమ శాస్త్రానికి ఇద్దరు, ఫిలాసఫీకి ఒక్కరే హాజరు కావడంలోని మతలబేమిటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఇందులో కూడా బీఎడ్ కళాశాలలో అనుభవం ఉన్న అధ్యాపకుడు నాగరాజును ఆ కళాశాలలో కాకుండా డైట్‌కు పంపడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక వేళ సరిపోయే అధ్యాపకులు రానప్పుడు మరోసారి నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉండేదంటున్నారు. ఎంపికలో అనుభవం, అర్హతకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టమైన నిబంధనలు ఉన్నా, గతంలో బీఎడ్ కళాశాలలో ఆంగ్ల అధ్యాపకుడిగా పని చేసిన అధ్యాపకుడు అరుణాచారిని తీసుకోలేదన్నారు.

బీఎడ్ కళాశాలలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు డైట్ కళాశాలలో నిర్వహించారని, బీఎడ్ విద్యార్థులు లేకుండానే డైట్ విద్యార్థులతో డెమోలు ఇప్పించారని ఆరోపించారు. ఇంటర్వ్యూల సమయంలో నియామక కమిటీ చైర్మెన్ అయిన డీఈవో రాలేదని, దీంతో ఇంచార్జి ప్రిన్సిపాల్ ఇష్టారీతిన వ్యవహరించారని ఆరోపించారు. మెరిట్ లిస్టులో 5వ నంబర్‌లో ఉన్న అభ్యర్థిని ఎంపిక చేశారన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గతంలో రెండు సార్లు సస్పెండ్ అయిన చరిత్ర ఉందని గుర్తు చేశారు. ఈ దృష్ట్యా అతిథి అధ్యాపకుల నియామకాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అభ్యర్థులు కోరుతున్నారు. ఈ విషయంలో కలెక్టర్ చొరవ తీసుకొని అర్హులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.

నిబద్ధతతో పని చేయాలి

ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలి

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్


పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్‌సింగ్

ఎల్కతుర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులకు సత్వర సేవలందించాలని పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ సూచించారు. బుధవారం ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎ.ప్రవీణ్‌కుమార్ ఆయనకు మొక్కను అందజేశారు. పోలీస్ సిబ్బంది పరేడ్ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీజ్ చేసిన వాహనాల వివరాలు తెలుసుకున్నారు.అలాగే పోలీస్ సిబ్బంది సామగ్రి (కిట్ ఆర్టికల్స్), రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు.

పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పలు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సిబ్బందితో ఆయన మాట్లాడారు. ప్రతీ పోలీస్ విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధతతో ఉండాలన్నారు. శాఖాపరంగా నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. మాదక ద్రవ్యాల నియంత్రణలో ప్రజలను భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

ప్రజలకు న్యాయం చేసేందుకు వృత్తి శిక్షణ ఎంతో అవసరం



మాట్లాడుతున్న ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్

వరంగల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలకు న్యాయం చేసేందుకు వృత్తి శిక్షణ ఎంతో అవసరమని ఈస్ట్‌జోన్ డీసీపీ అంకిత్‌కుమార్ అన్నారు. మూడు రోజుల పాటు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో జరిగే భద్రాద్రి జోన్ పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను ఈస్ట్‌జోన్ డీసీపీ బుధవారం ప్రారంభించారు. భద్రాద్రి జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం పోలీస్ కమిషనరేట్, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెంకు చెందిన వివిధ పోలీస్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటున్న ఈ డ్యూటీ మీట్‌లో కంప్యూటర్ పరిజ్ఞానం, ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్ లిఫ్టింగ్, ప్యాకింగ్, హ్యాండ్లింగ్, బాంబ్ డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫోటోగ్రఫీ అండ్ వీడియో గ్రఫీ విభాగాల్లో పోటీపడనున్నారు. ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందిని త్వరలోనే వరంగల్ వేదికగా జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు డీసీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో వెస్ట్‌జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్, అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ప్రభాకర్‌రావు, బోనాల కిషన్, జోనల్‌కు చెందిన ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్స్, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ఇన్‌చార్జి సీఈవో శంకర్ సస్పెన్షన్

పాలకవర్గానికి షోకాజ్ నోటీసులు

శాయంపేట సొసైటీ రద్దు యోచనలో డీసీవో?


శాయంపేటలోని పీఏసీఎస్ కార్యాలయం

శాయంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఇన్‌చార్జి సీఈవో పెరుగు శంకర్‌ను సస్పెండ్ చేస్తూ బుధవారం హనుమకొండ డీసీవో సంజీవ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రైతుల వద్ద వడ్డీల పేరుతో వసూళ్లకు పాల్పడ్డారని ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో 'అవినీతి ఊబిలో సొసైటీ' అనే కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో విచారణ చేయించిన డీసీవో షోకాజ్ నోటీసు జారీ చేసి, అనంతరం సస్పెన్షన్ వేటు వేశారు. ఇదిలా ఉండగా, పాలకవర్గానికి సైతం గత నెల 28న డీసీవో సంజీవ్ రెడ్డి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు 11 మంది డైరెక్టర్‌లను సంఘంలో రూ.10 కోట్ల ఇన్‌బ్యాలెన్స్ సరిచేయడానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టకపోవడం, ప్రజలకు సేవ చేయడంలో నిరంతరం వైఫల్యం చెందారని, విధులను సరిగా నిర్వర్తించక పోవడంలాంటి లోపాలను షోకాజ్ నోటీసులో పేర్కొన్నారు. ఈ కారణాలను అనుసరించి పాలకవర్గాన్ని ఎందుకు రద్దు చేయకూడదో వారం రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు. సంతృప్తికరమైన వివరణ లేకుంటే పాలకర్గాన్ని రద్దుచేస్తామని షోకాజ్ నోటీసులో పొందుపరిచారు. ఈ క్రమంలో నోటీసులు అందుకున్న పాలకవర్గం ఇటీవల డీసీవోను కలవగా, ఆయన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్‌లపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో సొసైటీ పాలకవర్గాన్ని డీసీవో రద్దు చేయనున్నారని స్థానికంగా ప్రచారం జోరందుకుంది.

క్లీన్ సిటీయే లక్ష్యంగా...

(5వ పేజీ తరువాయి)

చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించినట్టు శానిటేషన్ అధికారులు తెలిపారు.

భువన్‌యాప్ వినియోగం, పన్నుల వసూలు, ట్రేడ్‌లైసెన్స్ జారీ, బిల్లుల చెల్లింపులు, సీజన్ వ్యాధులు ప్రబలకుండా సోషల్ మీడియా, ఆకాశవాణి, కళాజాత, కరపత్రాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. పబ్లిక్ టాయిలెట్స్ వాడే విధంగా అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం శానిటేషన్ కార్మికులకు ఉచిత వైద్యపరీక్షలు, పీపీ కిట్లు, కావలసిన సామగ్రి అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. వనమహోత్సవంలో భాగంగా ఖాళీ ప్రదేశాలు, చిల్డ్రన్స్ పార్క్‌లలో ఇప్పటికే నాలుగు చోట్ల మొక్కలు నాటారు. ఇంజనీరింగ్ విభాగం భాగస్వామ్యంతో నాలాల పూడికతీత, కొత్త నల్లా కలెక్షన్లు, రోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణం ప్రతిపాదనలు చేశారు. కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు, ఇంకా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ జ్వరాలు ప్రబలకుండా ఉండేందుకు 100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో దోమల నివారణకు ఫాగింగ్, దోమల స్ప్రై, ఆయిల్ బాల్స్, గంబూషియా చేపలు వేసి వ్యాధుల ను అరికట్టే ప్రయత్నం చేస్తున్నారు.

100 రోజుల ప్రణాళిక కార్యక్రమాల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. మేయర్, కమిషనర్, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్‌తో పాటు శానిటరి సూపర్‌వైజర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు నగర పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతీ రోజు ఉన్నతాధికారులు సైతం ఐదు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, టీస్టాల్స్ పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తే జరిమాన విధిస్తూ కొరడా ఝుళిపిస్తున్నారు. కాలనీలలోని ఇండ్ల నుంచి స్వచ్ఛ ఆటోల ద్వారా సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్, డంపింగ్ యార్డ్‌లకు తరలిస్తున్నారు. ఓపెన్ డ్రెయినేజీలలో ఘన వ్యర్థాలు చేరకుండా ఇనుప జాలీలు ఏర్పాటు చేయడంతో పాటు మ్యాన్ హోల్స్‌ను ముందస్తుగా గుర్తించి రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తున్నారు.

మెడికల్ సీట్లలో అక్రమాలు

విచారణకు స్వీకరించిన లోకాయుక్త

హనుమకొండ, జులై 2 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీలో మెడికల్ సీట్ల కేటాయింపుల్లో జరిగిన అవతకవలపై విచారణకు లోకాయుక్త స్వీకరించింది. గత వైస్‌చాన్సలర్‌తో పాటు రిజిస్ట్రార్ తీరు మూలంగా 400 మంది విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని వినియోగదారుల మండలి జాతీయ ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, మొగిలిచెర్ల సుదర్శన్ గత నెల 27న లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడానికి రాష్ట్ర ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి అయినా అవేమి లేకుండా రెండు ప్రైవేటు మెడికల్ కాలేజీలు డీమ్డ్ యూనివర్సిటీలుగా మారడం, ఈ క్రమంలో గత ఏడాది 400 మెడికల్ సీట్లు రాష్ట్ర ప్రభుత్వ పరిధి నుంచి దాటిపోవడంలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని వారు తమ ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుకు సానుకూలంగా స్పందించిన లోకాయుక్త లోతుగా విచారణకు స్వీకరించింది. ఈ మేరకు ఫిర్యాదుదారులకు లోకాయుక్త కార్యాలయం నుండి సమాచారం అందింది.

నిరుద్యోగ యువతులకు బ్యూటీ పార్లర్‌లో ఉచిత శిక్షణ

హసన్‌పర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతులకు బ్యూటీ పార్లర్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణనిస్తున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. వరంగల్ హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు, మహబూబాబాద్ జిల్లాల నుంచి ఆసక్తి గల నిరుద్యోగ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్, విద్యార్హత జిరాక్స్ కాపీలను తీసుకొని భారతీయ స్టేట్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంస్కృతి విహార్, టీటీడీసీ, హసన్‌పర్తి, హనుమకొండ జిల్లా చిరునామాలో జూలై 6వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ఉమెన్స్ టైలరింగ్, బ్యూటీ పార్లర్, మగ్గం వర్క్స్ ప్రారంభమవుతుందని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం, కోర్సు సంబంధించిన మెటీరియల్ ఉచితంగా అందిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి అయిన అభ్యర్థులకు యోగ్యతా పత్రం అందజేస్తారని సంస్థ డైరెక్టర్ బాస రవి తెలిపారు. ఇతర వివరాలకు 97040 56522, 98493 07873, 62812 60878, 99491 08934 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్‌గా జంగా



వరంగల్ స్పోర్ట్స్, జూలై 2(ఆంధ్రజ్యోతి) ఖోఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎథిక్స్ కమిషన్ కన్వీనర్‌గా, సౌత్‌జోన్ ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడిగా జంగా రాఘవరెడ్డి ఏకగ్రీవంగా నియమితుల య్యారు. వర్ధన్నపేట నియోజకవర్గం టీకుల గూడెంనకు చెందిన జంగా రాఘవరెడ్డి ఇప్పటికే కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్, గ్రోవర్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా పదవి నిర్వర్తిస్తున్నారు. క్రీడల్లో ఉన్న ఆసక్తి, స్వతహాగా క్రీడాకారుడు కావడంతో కొన్నేళ్లుగా ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్‌గా, ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్ బాధ్యతలు స్వీకరిస్తున్నారు.

ప్రైవేటు పాఠశాల బస్సులను అడ్డుకున్న గ్రామస్థులు

రేగొండ, జూలై 2(ఆంధ్రజ్యోతి) : పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశా లల్లోనే చదివించాలని భూపాలపల్లి జిల్లా తిరుమలగిరికి చెందిన పలువురు గ్రామస్థులు నినదించారు. ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్న వారి బస్సులను బుధవారం అడ్డుకున్నారు. 'ప్రైవేట్ స్కూల్స్ వద్దు.. ప్రభుత్వ బడే ముద్దు' అని నినాదాలు చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా నాణ్యమైన విద్య అందుతోందన్నారు. ఈ కార్యక్రమంలో జీడీహెచ్ఎస్ చైర్మన్ నిర్మల, ప్రైమరీ స్కూల్ చైర్మన్ వసంతతోపాటు విజేందర్, వెంకటస్వామి, తిరుపతి, కిరణ్, శంకర్, శ్రీధర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగులకు భరోసా

- అందుబాటులోకి వచ్చిన బీమా పథకం
- విధినిర్వహణలో మృతి చెందితే రూ. కోటి పరిహారం
- తీవ్రంగా గాయపడితే రూ. 80 లక్షలు
- సహజ మరణం చెందితే రూ. 10 లక్షలు
- 13 వేల మంది ఉద్యోగులకు లబ్ధి
- ఎస్‌బీఐ, యూబీఐలతో ఒప్పందం


హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్‌పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం

హనుమకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ఉద్యోగమంటే ప్రాణంతో చెలగాటం. ప్రమాదం ఎప్పుడు ఎక్కడి నుంచి ముంచుకు వస్తుందో తెలియదు. నిత్యం ప్రమాదం అంచున ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. అటువంటి వారికి సామాజిక, ఆర్థిక భద్రత కల్పించేందుకు బీమా అమలులోకి వచ్చింది. నార్తరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని విద్యుత్ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం కల్పించారు.

రూ. కోటి పరిహారం

గతంలో విద్యుత్ ఉద్యోగి విధినిర్వహణలో మరణించినా, తీవ్రంగా గాయపడినా, సంస్థ అందించే పరిహారం లేదా వారు వ్యక్తిగతంగా చేసుకున్న బీమా పాలసీల ద్వారా పరిహారం అందేది. ఇది ఆశించినంత మేరకు ఉండేది కాదు. కానీ ఈ బీమా సౌకర్యం వల్ల విధినిర్వహణలో విద్యుత్ ఉద్యోగి మరణిస్తే (ఎఐ) రూ. కోటి వరకు బీమా పరిహారం కుటుంబానికి లభిస్తుంది. అలాగే ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కదలలేని స్థితిలో (పీటీడీ) ఉన్న ఉద్యోగులకు సైతం రూ.కోటి వరకు బీమా పరిహారం అందేలా ఏర్పాట్లు చేశారు. శాశ్వత అంగవైకల్యం (పీపీడీ) కలిగిన వారికి రూ. 80 లక్షల వరకు పరిహారం అందుతుంది. ఉద్యోగి సహజ మరణం చెందితే రూ. 10 లక్షల వరకు ప్రమాద బీమా ఉంటుంది. ఉద్యోగితో పాటు నలుగురు కుటుంబ సభ్యులకు కలిపి రూ.20 లక్షల వరకు బీమా సౌకర్యం వర్తిస్తుంది. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూనియన్ బ్యాంక్ (యూబీఐ)తో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఎస్‌బీఐలో ఖాతా తెరిచిన విద్యుత్ ఉద్యోగులకు కేవలం ప్రమాద బీమానే కాకుండా పెళ్లి, విద్యాపరమైనా ఆర్థిక సహాయంలోనూ రుణాలు అందించనున్నారు.

ఎలాంటి కంట్రిబ్యూషన్ లేకుండానే..

బీమా పొందాలంటే ప్రత్యేకంగా పాలసీ తీసుకోవలసిన అవసరం లేదు. ఉద్యోగి బ్యాంకు ఖాతాలో ప్రతీనెల వేతనం జమ చేస్తూనే బీమాను వర్తింపచేస్తున్నారు. విద్యుత్ సిబ్బందిలో నమ్మకం, ధైర్యాన్ని ఇవ్వడం కోసం ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ఈ పథకాన్ని తీసుకువచ్చారు.

నిబంధనలు

ఉద్యోగి వేతనం నెలకు రూ. 25 వేలకుపైగా ఉంటే చాలు. ఒప్పందం చేసుకున్న బ్యాంకుల్లో ప్రతీ నెల జీతం జమ కావడమే ఈ బీమాకు అర్హత. ప్రారంభంలో మొదటి నెల 1న జీతం జమ చేస్తే మరుసటి నెల 1 నుంచి బీమా వర్తిస్తుంది. మూడు నెలల్లో ఒక్కసారైనా ఏటీఎం నుంచి డబ్బులు తీసుకొని ఉండాలి. ఎన్‌పీడీసీఎల్ పరిధిలో పని చేసే అటెండర్, వాచ్‌మన్ మొదలుకొని ఎస్ఈ వరకు బీమా వర్తిస్తుంది. ఈ బీమా పథకం ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని 16 జిల్లాల్లో పని చేస్తున్న 13,287 మంది ఉద్యోగులకు వర్తిస్తుంది. వీరిలో ఉద్యోగులు 9821 కాగా ఆర్టిజన్ కార్మికులు 3466 మంది. బీమా పథకంలో ఎస్‌బీఐలో 11287 మంది, యూబీఐలో 2000 మంది ఉద్యోగులు నమోదయ్యారు. ఈ బీమా పాలసీ కింద ఇప్పటికే ఒక ఉద్యోగి కుటుంబానికి పరిహారం అందింది. కరీంనగర్ రూరల్ డివిజన్ చెంజెర్ల పరిధిలో అసిస్టెంట్ లైన్‌మన్ జోగు నరేష్ విధి నిర్వహణలో ఉండగా గత సంవత్సరం అక్టోబరులో ప్రమాదానికి గురై మృతి చెందారు. బ్యాంకు బీమా పథకంలో నమోదై ఉండడంతో నరేష్ భార్య సుష్మకు రూ. కోటి బీమా పరిహారాన్ని గత నెల 26న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా అందజేశారు.

చావు డప్పు నుంచి.. చలన చిత్రాల వరకు..


విలన్ పాత్రలో రవి

- దినదిన ప్రవర్ధమానం చెందుతున్న కోగిల రవి
- లఘుచిత్రాల ద్వారా యూట్యూబ్‌లో గుర్తింపు
- ఇప్పటికే 8లక్షలకు చేరిన సబ్‌స్క్రైబర్లు
- 200కు పైగా వీడియోలు అప్‌లోడ్
- పల్లెపాటలపై ఎక్కువ ఫోకస్


రుషి వేషంలో రవి


బోనాల పాటలో భాగంగా..

పరకాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మనిషి ఏదో ఒక రంగంలో గుర్తింపు పొందేందుకు కృషి చేస్తూనే ఉంటాడు. ఈ కోవలోనే పరకాల పట్టణానికి చెందిన కోగిల రవి నటుడిగా రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. ఎప్పటికైనా తనను తాను తెరపై చూసుకోవాలనుకున్నాడు. ఇందు కోసం తన కులవృత్తి అయిన చావు డప్పు వాయించడం నుంచే పునాది వేసుకున్నాడు. ప్రైవేట్ ఆల్బమ్స్ చేస్తూ ప్రస్థానం ప్రారంభించాడు. పల్లెపాటలు, లఘు చిత్రాలలో నటిస్తూ క్రమంలో యూట్యూబ్‌లో ప్రవేశించాడు. తాను చేసిన చిన్న చిన్న చిత్రాలను, పాటలను యూట్యూబ్‌లో పెట్టి ప్రేక్షకాదరణ పొందాడు. ఎట్టకేలకు తన కష్టానికి గాను సినిమాలో నటించే అవకాశం లభించడంతో రవి సంతోషం వ్యక్తం చేస్తున్నాడు. పరకాల పట్టణం మాదారం కాలనీ చెందిన కోగిల రవి, రాణి దంపతులకు అరవింద్, విన్ని ఇద్దరు కుమారులు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో పాన్‌షాపు ఏర్పాటు చేసుకొని వీరి జీవితం కొనసాగించాడు. కులవృత్తిలో భాగంగా రవి దహన సంస్కారాల్లో డప్పు వాయించేందుకు వెళ్లేవాడు. అదేకాకుండా ఎన్నికల ప్రచారాలకు, గ్రామాల్లో చాటింపులకు వెళ్లి డప్పువాయించి వచ్చిన కాస్త ఆదాయంతో తమ కుటుంబాన్ని పోషించేవాడు. తనకు చిన్నప్పటి నుంచి సినిమాలు చూడటం, డాన్స్ చేయడం తాను నటించి తెరపై చూసుకోవాలని ఎంతో ఆకాంక్ష ఉండేది. గ్రామాల్లో పోచమ్మ తల్లి బోనాలకు వివిధ వేషాధారణతో నృత్యాలు చేస్తూ డప్పు వాయించడం మొదలు పెట్టాడు. దాంతో మొట్టమొదటగా 1998లో హోలీ సందర్భంగా 'రింగుడు బిళ్ల రూపాయి దండ' అనే ప్రైవేట్ సాంగ్ చిత్రీకరించి ఆదరణ పొందాడు. అప్పటి నుంచి 200లకు పైగా ప్రైవేట్ ఆల్బమ్స్, సీరియళ్లు, షార్ట్ ఫిలిమ్స్, చేస్తూ కొద్దో గొప్పో సంపాదనలో పడ్డాడు.

సినిమా చాన్స్ వచ్చేసింది..

యూట్యూబ్‌లో, వాట్సాప్‌లలో ప్రైవేట్ సాంగ్స్‌తో జనాదరణ పొందుతున్న రవికి ఇటీవల 'పరకాల' అనే చిత్రంలో విలన్‌గా అవకాశం వచ్చింది. చిత్రీకరణ కూడా పూర్తై ఆగస్టు నెలలో విడుదలకు సిద్ధంగా ఉంది. మరిన్ని సీరియళ్లలో నటించేందుకు కూడా అవకాశాలు వచ్చాయి. తన యూట్యూబ్ చానల్‌కు ఎనిమిది లక్షల మంది సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. మొట్టమొదటగా గత నెలలో రూ.18వేలు ఆదాయం కూడా వచ్చింది. ప్రస్తుతం తను పూర్తిగా నటనా రంగానికి దగ్గరవుతున్నాడు. ముందుముందు మరెన్నో అవకాశాలు అందిపుచ్చుకొని తను ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆశిద్దాం.

ఆ ఎమ్మెల్యేలంతా డాక్టర్లు..


మహబూబాబాద్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వేదిక మీద ఆసీనులైన ఎమ్మెల్యేలు రాంచందర్‌నాయక్, మురళీనాయక్, వెంకట్రావు, రాగమయి

మహబూబాబాద్ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ పట్టణంలో బుధవారం జరిగిన కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షుల సమ్మేళన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలంతా డాక్టర్లు కావడం విశేషం. మానుకోటలో పార్లమెంటరీ నియోజకవర్గ కార్యకర్తల సన్నాహక సమావేశాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. దీనికి మాజీ ఎమ్మెల్సీ, పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పోట్ల నాగేశ్వర్‌రావు, కో ఇన్‌చార్జీగా ఉన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టి రాగమయి, పార్లమెంటరీనియోజకవర్గపరిధిలోని భద్రాచలం, డోర్నకల్, మానుకోట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోతు రాంచందర్‌నాయక్, భూక్య మురళీనాయక్ హాజరయ్యారు. వేదికపైన కాంగ్రెస్ రాష్ట్ర నేతలు, ఎమ్మెల్యేలు కలిసి మొత్తంగా 10 మంది ఆశీనులయ్యారు. సమావేశానికి హాజరైన నలుగురు సత్తుపల్లి, భద్రాచలం, డోర్నకల్, మానుకోట నియోజకవర్గ ఎమ్మెల్యేలు రాగమయి, వెంకట్రావు, రాంచందర్ నాయక్, మురళీనాయక్‌లు వైద్యులు కావడం విశేషం.

అందులో ముగ్గురు జనరల్ సర్జన్‌లు కాగా, మహిళా ఎమ్మెల్యే పల్మానాలిజిస్టు (శ్వాస కోశ సంబంధింత వైద్యురాలు). ఈ అంశం వేదికపై ప్రస్తావన రాగా సమావేశానికి హాజరైన ముఖ్య నేతలు నలుగురు ఎమ్మెల్యేలకు డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు.

నకిలీ పురుగు మందుల విక్రేతపై పీడీ యాక్టు



నిందితుడికి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేస్తున్న సీఐ గోపి

వరంగల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న వ్యక్తిపై పీడీ యాక్టు నమోదు చేస్తూ సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పరకాల జైలులో ఉన్న నిందితుడు శాయంటపేటకు చెందిన నూక రాజేశ్‌కు బుధవారం మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ గోపి పీడీ యాక్టు ఉత్తర్వులు అందజేసి చర్లపల్లి జైలుకు తరలించారు. నిందితుడు గతంలో సుబేదారి, కేయూ, హనుమకొండ పీఎస్‌ల పరిధిలో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడటంతో ఏడు కేసులు నమోదు కాగా అరెస్టయ్యాడు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు మరో ఆరుగురు వ్యక్తులతో కలిసి ముఠాగా ఏర్పడి పర్టిలైజర్ డీలర్ల నుంచి కాలం చెల్లిన పురుగు మందులు, నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి రైతులకు విక్రయిస్తూ నిందితుడు ఏప్రిల్ 7న ఒకసారి 26న మరోసారి పట్టుబడగా మట్టెవాడ పోలీసుల అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ ముఠాలో ఇప్పటికే ఒకరిపై పీడీ యాక్టు నమోదు చేయగా ఇది రెండో పీడీ యాక్టు అని సీపీ వెల్లడించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే 7799848333 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

కొత్త కొత్తగా ఉంటదా!?

(5వ పేజీ తరువాయి)

జిల్లాలో 39,17,048మంది జనాభా ఉంది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 2,30,064మంది ఉండాలి.. అంటే ఈ లెక్కన 17 స్థానాల వరకు పెరిగే ఛాన్స్ ఉంది. ఇందులో ఒకటి అటు ఇటుగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా, పునర్విభజనతో నాలుగైదు స్థానాలు పెరుగుతాయనే చర్చ జరుగుతుంది.

ఒకే జిల్లా.. ఒకే నియోజకవర్గం

అసెంబ్లీ నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లా పరిధిలో ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నది. దీంతో వరంగల్ వెస్ట్‌తో పాటు కొత్తగా ఏర్పడే మరో నియోజకవర్గం కూడా హనుమకొండ జిల్లా పరిధిలోకే వచ్చే అవకాశం ఉంది. హనుమకొండ జిల్లాలో 2011 జనాభా ప్రకారం 11,35,707 జనాభా ఉంది. ఈ లెక్క ప్రకారం నాలుగు నుంచి ఐదు అసెంబ్లీ స్థానాలు హనుమకొండలో ఏర్పాటు కావాల్సి ఉంది. ప్రస్తుతం వరంగల్ పశ్చిమ, పరకాల నియోజకవర్గాలే ఉన్నాయి. దీంతో కొత్తగా ఏర్పడే రెండు స్థానాలు హనుమకొండ జిల్లా పరిధిలోకి వస్తాయనే చర్చ జరుగుతుంది.

- అలాగే వరంగల్ జిల్లాలో 7,16,457 జనాభా ఉంది. ఇక్కడ కూడా మూడు అసెంబ్లీ స్థానాలు ఏర్పడే అవకాశం ఉంది. కొన్ని మండలాలు అటుఇటుగా ప్రస్తుతం ఉన్న వరంగల్‌తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాలు కొనసాగే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.
- మహబూబాబాద్ జిల్లాలో 7,70,170 మంది జనాభా ఉండటంతో మహబూబాబాద్, డోర్నకల్‌తో పాటు కొత్తగా తొర్రూరు కేంద్రంగా మరో నియోజకవర్గం ఏర్పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.
- జనగామ జిల్లాలో 5,82,457 మంది జనాభా ఉంది. ప్రస్తుతం ఉన్న జనగామ, స్టేషన్‌ఘనపూర్ కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంపై అనుమానాలు ఉన్నాయనే టాక్ వినబడుతోంది. ఇప్పటికే పాలకుర్తి జనగామ, మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో విస్తరించింది. ఈ పునర్విభజనలో ఏదో ఒక జిల్లా పరిధిలోకి వచ్చే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.
- భూపాలపల్లిలో 4,16,763 మంది జనాభా ఉంది. ప్రస్తుతం ఇక్కడ భూపాలపల్లి నియోజకవర్గం ఒక్కటే ఉంది. కరీంనగర్ జిల్లాకు చెందిన మథని పరిధిలోని ఐదు మండలాలు ఈ జిల్లాలో ఉన్నాయి. ఈ ఐదు మండలాల్లో సుమారు 1.50లక్షల జనాభా ఉంది. ఒకే జిల్లా పరిధిలో కొత్త నియోజకవర్గం ఏర్పడటం కష్టమే. ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు సొంత ప్రాంతం కావటంతో కొత్త నియోజకవర్గం ఏర్పాటు చేస్తారనే టాక్ వినబడుతోంది. దీంతో కొత్తగా కాళేశ్వరం లేదా కాటారం పేరుతో మరో నియోజకవర్గం ఏర్పాటు చేస్తారా లేదా అనేది ఉత్కంఠగా మారింది.
- ములుగు జిల్లాలో 2,95,494 జనాభా ఉంది. ఇక్కడ ఒక్క నియోజకవర్గానికే అవకాశం ఉంది. ప్రస్తుతం భద్రాచలం నియోజకవర్గం పరిధిలో ఉన్న వెంకటాపురం, వాజేడు మండలాలను ములుగు పరిధిలోకి తీసుకువచ్చి, ములుగు నియోజకవర్గానికి చెందిన మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ, గంగారం మండలాలను మహబూబాద్ నియోజకవర్గంలో విలీనం చేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

రిజర్వేషన్లలోనూ మార్పులు

నియోజకవర్గాల పునర్విభజనతో పాటు కొత్తగా అసెంబ్లీ స్థానాలు ఏర్పడుతుండటంతో ఇప్పుడున్న రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. ప్రస్తుతం వరంగల్ ఎంపీ స్థానం ఎస్సీ, మహబూబాబాద్ ఎస్టీలకు రిజర్వుడు అయ్యాయి. దేశవ్యాప్తంగా జరిగే మార్పుల్లో ఈ రెండు స్థానాల్లో చేరే అసెంబ్లీ స్థానాల జనాభా ఆధారంగా అలాగే రిజర్వుడు స్థానాలుగా ఉంటాయా.. మార్పు జరుగుతుందా అనేది తేలనుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రస్తుతం 12 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, వీటిలో ములుగు, మహబూబాబాద్, డోర్నకల్ ఎస్టీ రిజర్వుడు స్థానాలు కాగా, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట ఎస్సీ రిజర్వుడు స్థానాలు. మిగతా ఏడు అసెంబ్లీ స్థానాలు జనరల్‌గా కొనసాగుతున్నాయి. అయితే కొత్తగా నాలుగు స్థానాలు పెరిగే అవకాశం ఉండటంతో ఇప్పుడున్న రిజర్వుడు స్థానాల్లో కూడా మార్పులు జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధానంగా వర్ధన్నపేట జనరల్ స్థానంగా మారుతుందని ఇప్పటి నుంచే రాజకీయ నాయకులు ఖర్చీఫ్ వేసుకుని తిరుగుతున్నారు. అలాగే అలాగే మహిళలకు 33శాతం రిజర్వేషన్ కూడా 2028 నుంచి అమలు చేస్తే ఉమ్మడి వరంగల్ జిల్లాలో నగరంలో ఒక స్థానంతో పాటు రూరల్‌లో రెండుమూడు స్థానాలు కలిపి నాలుగైదు స్థానాలు మహిళలకు రిజర్వు అయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది.

ఇలాగైతే ఎలా చదవాలి!?

- మౌలిక వసతుల కొరతతో రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల
- స్థలం కేటాయించినా, భవన నిర్మాణానికి మంజూరుకాని నిధులు
- జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే తరగతుల నిర్వహణ
- తూర్పు నియోజకవర్గంతో పాటు చుట్టుపక్కల మండలాలకు అనుకూలం
- మంత్రి సురేఖ చొరవ తీసుకోవాలంటున్న విద్యావంతులు


రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

శంభునిపేట(వరంగల్), జూలై 2 (ఆంధ్రజ్యోతి): అక్కడ అధ్యాపకులు ఫుల్.. మౌలిక వసతులు నిల్.. విద్యార్థులకు అందుబాటులో వున్నప్పటికీ మౌలిక సౌకర్యాల కొరత శాపంగా మారింది.. శాశ్వత భవనం కోసం స్థలం కేటాయించినా, నిర్మాణానికి మాత్రం చిల్లిగవ్వ మంజూరు కావడం లేదు.. ఇది రంగశాయిపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిస్థితి.

వరంగల్ తూర్పులో మొట్టమొదటి పూర్తి స్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా రంగశాయిపేట ప్రభుత్వ కళాశాలకు చరిత్ర ఉంది. వరంగల్‌లో ఎయిడెడ్ కళాశాలలు ఉండటంతో ప్రభుత్వం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయలేదు. దీంతో పలువురు మేధావులు వరంగల్ తూర్పులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులకు, నాయకులకు పలుమార్లు వినతి పత్రాలు అందించారు. అప్పటి ఎమ్మెల్యే బస్వరాజు సారయ్య విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్ళి 2008లో డిగ్రీ కళాశాలను మంజూరు చేయించారు. అప్పుడు నగరంలో కళాశాలకు స్థలం, భవనం, మంజూరు చేయకపోవటంతో అందుబాటులో వున్న రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాలకు కొన్ని గదులు తాత్కాలికంగా కేటాయించారు. అప్పటి నుంచి అరకొర వసతులతోనే కళాశాల నిర్వహణ జరుగుతూ వచ్చింది. శాశ్వత భవనం, వసతులు లేకపోవడంతో విద్యార్థుల నుంచి ఆదరణ కనిపించ లేదు. అలాగే వున్న విద్యార్థులకు అభ్యాసం కష్టంగా మారింది. ఈ క్రమంలో సరైన తరగతి గదులు లేకపోవటంతో 2018లో రంగశాయిపేటకు సమీపంలోని ఖిలావరంగల్ పెట్రోల్‌పంప్ వద్ద అద్దె భవనంలోకి కళాశాలను తరలించారు. అయితే నిర్వహణ కారణాలతో 2022లో కళాశాలను తిరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనంలోకి మార్చారు.

ఇంటర్, డిగ్రీ కళాశాలల మధ్య సయోధ్య కుదరకపోవటంతో అధికారులు, నాయకులు జూనియర్ కళాశాల మైదానంలోనే డిగ్రీ కళాశాలకు స్థలాన్ని కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ నిర్మాణానికి నిధులు కేటాయించలేదు. దీంతో ఇంటర్ కళాశాల భవనంలోనే కొన్ని గదుల్లో డిగ్రీ విద్యార్థులకు తరగతులను నిర్వహిస్తున్నారు. నగర ద్వారంగా ఉన్న రంగశాయిపేటలో జాతీయ రహదారికి డిగ్రీ కళాశాల కూతవేటు ఉండటంతో చుట్టు పక్కల మండలాలు, గ్రామాల నుండి వచ్చే విద్యార్థులకు రవాణా పరంగా బస్సు సౌకర్యం అదనపు ప్రయోజనంగా మారింది. కళాశాలలో బీఏ హెచ్‌పీపీ, ఈపీపీ, సోషియాలజీ, బీకాం జనరల్, కంప్యూటర్స్ అప్లికేషన్స్, బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, బీజెడ్ కంప్యూటర్ సైన్స్ గ్రూపులు ఉన్నాయి. ఎక్కువగా బీఎస్సీ ఎంపీసీఎస్, బీకాం, బీజెడ్‌సీఎస్ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ప్రాధాన్యత ఇస్తున్నారు. కళాశాలలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు 13 మంది బోధన, 15 మంది బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. కంప్యూటర్ సైన్స్, గణితం, ఇంగ్లిష్ అధ్యాపకుల పోస్టులు ఖాళీగా వున్నాయి. గత ఏడాది వరకు ఈ పోస్టుల్లో అతిథి అధ్యాపకులను నియమించి బోధన సాగించారు.

కార్పొరేట్‌కు దీటుగా బోధన



ప్రభుత్వ కళాశాలల్లో చదవాలనే ఆసక్తి విద్యార్థుల్లో పెరగాలి. ప్రభుత్వం అన్నీ ఉచితంగా అందటమే గాక, స్కాలర్‌షిప్‌లు అందిస్తుంది. విద్యార్థులకు ప్రభుత్వ హాస్టల్ వసతి కల్పిస్తున్నాం. డిజిటల్ స్మార్ట్ బోర్డులతో విద్యా బోధనతో పాటు సాంకేతిక నైపుణ్య అభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం.

- జి. శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్

శాశ్వత భవనం నిర్మించాలి..



రంగశాయిపేటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం త్వరగా చేపట్టాలి. క్రీడలకు ఉపయోగపడేలా మైదానాన్ని ఉపయోగిస్తూ ఇంటర్, డిగ్రీ కళాశాలల భవనాలను నిర్మించాలి. కళాశాలలో మౌళిక వసతులు కల్పనకు, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి అభివృద్ధి పనులు ప్రారంభించాలి. ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి అయిన కొండా సురేఖ చొరవ తీసుకోవాలి.

- మండల పరుశరాములు, సోషల్ యాక్టివిస్ట్

ప్రస్తుతం కళాశాలలో అన్ని గ్రూపుల్లో కలిపి 368 మంది విద్యార్థుల అడ్మిషన్లు నమోదై వున్నాయి. ప్రస్తుత విద్యాసంవత్సరంలో దోస్త్ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటికే 115 మంది విద్యార్థులు అడ్మిషన్లు తీసుకున్నారు. గత సంవత్సరం డిగ్రీ ఫలితాల్లో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. నగర పరిధిలోని కళాశాల కావడంతో ఇక్కడ పూర్తి స్థాయిలో అధ్యాపకులు ఉన్నారు.

కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జూవాలజీ ల్యాబ్‌లతో పాటు తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు, కాన్ఫరెన్స్ హాల్, లైబ్రరీ ఉన్నాయి. కళాశాలకు పూర్తి స్థాయి భవనం నిర్మాణం చేపడితే అదనపు కోర్సులతో పాటు పీజీ కళాశాలగా మార్చుకోవచ్చని స్థానిక విద్యావంతులు చెబుతున్నారు.


ఎన్నికల కమిషన్‌లో వినతి పత్రం అందజేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తదితరులు

సురేఖ అసెంబ్లీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి

ఎన్నికల కమిషన్‌కు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు వినతి

మిల్స్‌కాలనీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మంత్రి కొండా సురేఖ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల సమయంలో రూ.70 కోట్లు ఖర్చు చేశామని బహిరంగంగానే చెప్పడాన్ని సుమోటాగా తీసుకొని సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఆయన ఎన్నికల సంఘాన్ని కోరారు.

హద్దు మీరి మాట్లాడుతున్నాడు..

మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి హద్దు మీరి మాట్లాడుతున్నాడని, వ్యక్తిగత దూషణలకు దిగడం ఆయనకే మంచిది కాదని ప్రదీప్‌రావు మండిపడ్డారు. బుధవారం ఓసిటీలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. తమది సంస్కారం లేకుండా మాట్లాడే కుటుంబం కాదని అన్నారు. ఆనాడు రాజశేఖర్‌రెడ్డి, మొన్న కేసీఆర్, నిన్న రేవంత్‌రెడ్డి కాళ్లు పట్టుకొని పదవులు తెచ్చుకున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలోనే చాలా సార్లు పార్టీ మారిన చరిత్ర కొండా దంపతులదని ఎద్దేవా చేశారు. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

వడ్డేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాలభిస్తుందని డిస్ట్రిక్ మైనారిటీస్ వెల్ఫేర్ ఆఫీసర్ (డీఎండబ్ల్యూఓ) కేపీ. గౌస్ హైదర్ అన్నారు. బుధవారం హనుమకొండలోని పెద్దమ్మగడ్డ, మచిలీబజార్, రాయపుర, సుబేదారి, ఎన్జీవోస్ కాలనీ, వడ్డేపల్లిలో బడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనారిటీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ గురుకుల పాఠశాలల ఆర్ఎల్‌సీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.సతీష్, నీరజతో పాటు మైనారిటీ నాయకులు డాక్టర్ రాణాసిద్ధిఖి, ఎమ్డీ నెహల్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండలో బడి బాట నిర్వహిస్తున్న దృశ్యం



నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంఆర్‌సీ సిబ్బంది

హసన్‌పర్తి ఎంఈవోగా శ్రీనివాస్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తి మండల విద్యాశాఖ అధికారిగా ఎ.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఎఫ్ ఏసీ ఎంఈవోగా పనిచేసిన ఎర్ర రాజిరెడ్డి పదవీకాలం ముగియడంతో ఆయన స్థానంలో ఏఎంవోగా పనిచేస్తున్న ఎ.శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా మండల రిసోర్స్ సెంటర్ కార్యాలయ సిబ్బంది నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవోను శాలువాతో సత్కరించి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు రమేష్, రాజుకుమార్, నాగరాజు, రజనీ, ఐఈఆర్‌పీలు కందికొండ వీరస్వామి, మమత, కార్యాలయ సిబ్బంది భార్గవి, అనిల్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆస్కి డైరెక్టర్‌ను కలిసిన కమిషనర్



ఆస్కి డైరెక్టర్ జనార్దన్‌రెడ్డికి పూలమొక్క అందిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) డైరెక్టర్ డాక్టర్ జనార్ధన్‌రెడ్డిని బుధవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ హైదరాబాద్ కార్యాలయంలో కలిశారు. వరంగల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత జనార్ధన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు గ్రేటర్ వరంగల్ గురించి చర్చించుకున్నారు. గ్రేటర్ శానిటేషన్ విభాగానికి ఆస్కి పూర్తి సహకారం అందిస్తుందని అన్నారు. ఆస్కి ప్రాజెక్టను పూర్తిస్థాయిలో వాడుకోవాలని జనార్ధన్‌రెడ్డి కోరారు.

పోగొట్టుకున్న ల్యాప్‌ట్యాప్ అప్పగింత

హనుమకొండ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండకు చెందిన మాచర్ల శ్రీనివాస్ అనే బ్యాంకు ఉద్యోగి బుధవారం హంటర్‌రోడ్డులోని ఓ సెలూన్ షాపులో ల్యాప్‌ట్యాప్‌ను మరిచిపోయారు. తాను మళ్లీ వచ్చి చూసే సరికి బ్యాగ్ కనిపించకపోవడంతో సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంటనే సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ సూచన మేరకు వేరే వ్యక్తి తనది అనుకొని తీసుకెళ్లినట్లు గుర్తించి ల్యాప్‌ట్యాప్ బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించినట్లు సీఐ తెలిపారు.

టీజీఎంఆర్ఎస్‌ను సందర్శించిన మైనారిటీ సంక్షేమ అధికారి

హనుమకొండ కలెక్టరేట్, జూలై2 (ఆంధ్రజ్యోతి): హనుమకొండలోని తెలంగాణ గురుకుల మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కళాశాలను బుధవారం జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కేపీ గౌస్‌హైదర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్, కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతులను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి గౌస్ హైదర్ భోజనం చేశారు. అనంతరం స్కూల్, కళాశాలలో విద్యార్థుల అడ్మిషన్‌ల కోసం గౌస్‌హైదర్ ప్రచారం చేశారు. స్కూల్‌లో ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని, పెద్ద సంఖ్యలో విద్యార్థులు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎల్ఎస్ శ్రీనివాస్, ప్రిన్సిపాళ్ల డాక్టర్ కె.సతీష్, నీరజ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు జాగిలంతో డ్రగ్ కంట్రోల్ టీం తనిఖీలు

వరంగల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వేస్టేషన్, హనుమకొండ బస్టాండ్, రద్దీ ప్రాంతాల్లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ డ్రగ్ కంట్రోల్ టీం పోలీసు జాగిలంతో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. అనుమానిత వ్యక్తులబ్యాగులను తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్ఐ శివకేశవులు, కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకతాయిలు వేధిస్తే డయల్ 100కు ఫోన్ చేయాలి

వరంగల్ క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే మహిళలు, కళాశాల యువతులు తక్షణమే డయల్ 100కు ఫోన్ చేయాలని హనుమకొండ సీఐ శివకుమార్ సూచించారు. ఎస్ఆర్ గర్ల్స్ జూనియర్ కళాశాలలో షీటీం, సైబర్ క్రైంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఫ్రాడ్‌జాబ్ కాల్స్, వాట్సాప్ లింకు, బ్యాంకు ఓటీపీలు, సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.కార్యక్రమంలో షీటీం కానిస్టేబుల్ రాంరెడ్డి, బూకోల్ట్ కానిస్టేబుల్ శ్రీను, మహిళా కానిస్టేబుల్ షహనాజ్ పాల్గొన్నారు.

బ్యాంకు లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు



బ్యాంక్ సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు

హనుమకొండ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ నిర్దేశిత లక్ష్యాలను సాధించడానికి చిత్తశుద్ధితో కృషి చేయాలని డీసీసీబీ అధికారులను చైర్మన్ మార్నేని రవిందర్‌రావు ఆదేశించారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ ప్రధాన కార్యాలయంలో బ్యాంక్ మేనేజర్‌లతో రవిందర్‌రావు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్దేశించిన టార్గెట్ అన్నింటినీ గడువులోగా పూర్తి చేయాలని సీఈవో వజీర్ సుల్తాన్‌ను ఆదేశించారు. రుణాలను కూడా తొందరగా రికవరీ చేయాలన్నారు. బ్యాంక్ టార్నోవర్ రూ.2500కోట్లకు చేరుకునేలా బాధ్యతా యుతంగా పనిచేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో బ్యాంక్‌ను రెండో స్థానంలో నిలిపేందుకు సమష్టిగా కృషి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జీఎం పద్మావతి, డీజీఎం అశోక్, ఏజీఎంలు మధు, శ్రవంతి, రాజు పాల్గొన్నారు.

ఉధ్యానవన శాఖ పథకాల పురోగతిపై సమీక్ష

హనుమకొండ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఉద్యానవన, పట్టు పరిశ్రమశాఖ అధికారులతో బుధవారం హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి వరంగల్ జిల్లా సూపర్‌వైజర్‌గా రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సంగీతలక్ష్మిని సంబంధిత శాఖ మంత్రి నియమించగా బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని జనగామ, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్ అధికారులతో వివిధ పథకాల పురోగతిపై సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీవారం ఆయిల్‌పామ్‌తో పాటు ఇతర పథకాలు ప్రగతిని పరిశీలించి తగిన సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు సంగీతలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన శాఖ, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు బిందుసేద్యం సంబంధిత కంపెనీల డీలర్లు పాల్గొన్నారు.

నిరాదరణకు గురైన వారికి సేవచేయడం గొప్ప

హనుమకొండ టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో నిరాదరణకు గురైన వికలాంగులు, అనాథలు, ఒంటరి మహిళలు ఎంతో మంది నిరుపేదలకు జీకే నామ్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవ చేయడం గొప్ప సంకల్పమని హనుమకొండ జిల్లా కోర్టు జడ్జి క్షమాదేశ్‌పాండే అన్నారు. మంగళవారం రాత్రి హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళా క్షేత్రంలో జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమాన్ని చైర్మన్ డాక్టర్ సుప్రియరత్నకుమార్ గౌడిపేరు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జడ్జి క్షమాదేశ్‌పాండే హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ డాక్టర్ సుప్రియ రత్నకుమార్ గౌడిపేరు ఆధ్వర్యంలో ఎన్నో ప్రాజెక్టుల ద్వారా సేవలు అందించడం పట్ల జడ్జి క్షమాదేశ్‌పాండే అభినందనలు తెలిపారు. ఆర్థిక సమస్యల కారణంగా ఎవరూ మౌలిక, ఆరోగ్యసేవలకు చట్టపరమైన సేవలు అందకుండా ఉండవద్దన్నారు. అందరు చట్టాలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కాళోజీ కళాక్షేత్రంలో జాతీయ వైద్యుల దినోత్సవ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులతో ఉన్న జిల్లా కోర్టు జడ్జి క్షమాదేశ్‌పాండే



గ్రేటర్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నాలుగు పూటలా హాజరు విధానం తొలగించాలి

గ్రేటర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ నిరసన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న శానిటేషన్ కార్మికులకు ఇటీవల కొత్త కమిషనర్ వచ్చిన తర్వాత ప్రతీ రోజు నాలుగుసార్లు బయోమెట్రిక్ హాజరు వేయించడంవల్ల చాలా ఇబ్బందిగా ఉందని సీఐటీయూ వరంగల్, హనుమకొండ జిల్లాల కమిటీలు ఆందోళన వ్యక్తం చేశాయి. బుధవారం గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టాయి. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిని సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ బి.మహేందర్‌లకు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సింగారపు బాబు, సుద్దాలకుమార్, ఉప్పలయ్య, బరుపట్ల మహేష్, ఆరూరి కుమార్, భాషా, యాస బాబు, కృష్ణ, రంజిత్, కిశోర్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

- ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ స్నేహ శబరీష్

హనుమకొండ కలెక్టరేట్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వివిధ శాఖల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ కోరారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో బుధవారం సాయంత్రం సీజనల్‌వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపట్ల ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రజలు చికెన్ గున్యా, డెంగీ వ్యాధుల బారిన పడకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుంగా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశామన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యల గురించి డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్ జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.

థౌజండ్ పిల్లర్స్ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా పరికిపండ్ల వేణు



పరికిపండ్ల వేణు

రాంనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): థౌజండ్ పిల్లర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా 53వ డివిజన్ ఆదర్శకాలనీకి చెందిన పరికిపండ్ల వేణు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదర్శకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు, థౌజండ్ పిల్లర్స్ లయన్స్ క్లబ్ సభ్యులు, వివిధ స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు వేణును అభినందించారు. అభినందించిన వారిలో ఆదర్శకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు తూడి విద్యాసాగర్‌రెడ్డి, నరసింహస్వామి, కాసగాని కుమారస్వామి, తీగల చంద్రమౌళి, సంజీవరెడ్డి, తిరుపతిరెడ్డి, పున్నం శ్రీను, రమేశ్, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులు, శాస్త్ర మిత్రమండలి కార్యవర్గసభ్యులు, తెలంగాణ నేత్ర శరీర అవయవదాన అసోసియేషన్ హనుమకొండ జిల్లా కమిటీ సభ్యులు, ఇగ్నైటెడ్ మైండ్స్ ఫ్యామిలీ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, జనవిజ్ఞాన వేదిక, పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక బాధ్యులు ఉన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న విజయ గణపతి పరపతి సంఘం ప్రతినిధి కృష్ణమూర్తి

వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం

హసన్‌పర్తి, జూలై 2(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 66వడివిజన్ కేంద్రం యాదవనగర్‌కు చెందిన వేల్పుల గట్టమ్మరాములు వృద్ధ దంపతులకు 1993-94 ఎస్ఎస్‌సీ బ్యాచ్, విజయ గణపతి పరపతి సంఘం సంయుక్త ఆధ్వర్యంలో దాత కందుకూరి క్రిష్ణమూర్తి రూ.20 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో వేల్పుల అంజి, కందుకూరి చంద్రమోహన్, కరుణాకర్‌రెడ్డి, రమేష్, కుమార్, దాడి రాజు, సంపత్, కరుణాకర్ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకం

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

హసన్‌పర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి కీలకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని రామారం ఫంక్షన్ హాలులో మడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎఫ్ఏసీ ఎంఈవో ఎర్ర రాజిరెడ్డి సన్మాన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మండల వడుప్సా నాయకులు గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఉద్యోగి ప్రజలకు మెరుగైన సేవలు అందించినప్పుడే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మడిపల్లి ప్రభుత్వ పాఠశాల అధ్యాపక సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాజిరెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న వడుప్సా నాయకులు

శిథిల కల్వర్టుతో కష్టాలెన్నో..?

- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా..!
- కొత్త కల్వర్టు నిర్మించాలని జవహర్‌కాలనీ వాసుల వినతి

వడ్డేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్, జవహర్ కాలనీల మధ్య ద్వారకాసాయి కాలనీ వద్ద ఉన్న కల్వర్టు శిథిలమైపోయింది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా జీడబ్ల్యూఎంసీకి నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నూతన కల్వర్టును నిర్మించాలని జవహర్ కాలనీ, ద్వారకా సాయి కాలనీలతో పాటు వివిధ కాలనీల ప్రజలు జీడబ్ల్యూఎంసీ కమిషనర్‌ను వేడుకుంటున్నారు.



జవహర్ కాలనీ, గోపాల్‌పూర్‌ల మధ్య శిథిలమైన కల్వర్టు

నిత్యం ప్రమాదాలే..

జవహర్ కాలనీ, గోపాల్‌పూర్‌ల మధ్య రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టు శిథిలావస్థలో మగ్గుతోంది. వర్షాలకు కల్వర్టు పూర్తిగా దెబ్బతిని వాహనచోదకులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రివేళల్లో వాహన చోదకుల బాధలు వర్ణణాతీతం. గుంతలమయమైన రోడ్డుతోపాటు కల్వర్టు శిథిలమై ఉండడం వలన ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న డ్రెయినేజీలు సైతం శిథిలావస్థలోనే ఉన్నాయి. జీడబ్ల్యూ ఎంసీ అధికారులు స్పందించి వెంటనే కొత్త కల్వర్టును నిర్మించడంతోపాటు రోడ్డుకు ఇరువైపుల డ్రెయినేజీలను నిర్మించాలని వివిధ కాలనీల వాసులు కోరుతున్నారు.

నిట్‌లో ప్రారంభమైన స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్



స్కాలర్‌షిప్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి

హనుమకొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నిట్‌లో స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభమైంది. 1999 బ్యాచ్‌కు చెందిన నిట్ పూర్వ విద్యార్థులు ఈ స్కాలర్ షిప్పులను అందచేయడానికి ఉదారంగా ముందుకు వచ్చారు. 1999 బ్యాచ్ పూర్వవిద్యార్థులు వరంగల్ నిట్ పూర్వవిద్యార్థుల సంఘంతో కలిసి, ఇన్‌స్పయిరింగ్ మీనింగ్‌ఫుల్ ప్రొగ్రెస్, అలుమ్ని కాంట్రిబ్యూషన్ టుగెదర్ (ఇంపాక్ట్-1999) పేరుతో ఈ స్కాలర్‌షిప్పుల కార్యక్రమాన్ని చేపట్టారు. 2025-26 విద్యాసంవత్సరానికి ఈ స్కాలర్‌షిప్పులను అందచేస్తారు. బీటెక్ 2,3,4, సంవత్సరాల విద్యార్థులకు, తాజా పట్టభద్రులకు వీటిని పంపిణీ చేస్తారు. ఈ స్కాలర్‌షిప్పుల్లో భాగంగా ట్యూషన్ ఫీజు చెల్లిస్తారు. ల్యాప్‌టాప్ లేని విద్యార్థులు వాటిని అందిస్తారు. సాంకేతిక నైపుణ్య అభివృద్ధి కోర్సుల అధ్యయనానికి కూడా సాయం చేస్తారు. ఈ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ అధికారిక పోస్టర్‌ను ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ బిద్యాదర్ సుబధి బుధవారం ఆవిష్కరించారు. నిట్ పూర్వవిద్యార్థుల సంఘం, ఉపాధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ రామా, వరంగల్ చాప్టర్ అధ్యక్షుడు పులి రవి కుమార్, స్కాలర్‌షిప్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ శైలజతో పాటు డీన్లు, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. 1999 బ్యాచ్ విద్యార్థులు చూపిన ఈ ఔదార్యాన్ని ఇతర పూర్వ విద్యార్థులు కూడా స్ఫూర్తిగా తీసుకోవాలని డైరెక్టర్ బిద్యాదర్ సుబుధీ కోరారు.



మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

హసన్‌పర్తి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : చదువుకునే విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ వట్టి చేరాలు అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బాలికల గురుకుల జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం జాగృతి పోలీసు కళాజాత బృందం, హసన్‌పర్తి పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్, గంజాయి, సైబర్ మోసాల బారిన పడకుండా అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రపుల్లదేవి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ఇన్‌స్పెక్టర్ చేరాలు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హసన్‌పర్తి ఏఎస్సై మల్లికార్జున్, కళాబృందం ఇన్‌చార్జి ఉమెన్ ఏఎస్సై నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, కానిస్టేబుళ్ళు పూల్ సింగ్, హోంగార్డులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులకు జరిమానా

వరంగల్ క్రైం, జూలై2(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డ 15 మందిని బుధవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ చారి రూ. 16,900 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జీ.సీతారెడ్డి తెలిపారు. అదేవిధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండాపట్టుబడ్డ నలుగురిని కోర్టులో హాజరుపరచగా రూ.2,400 జరిమానా విధించామన్నారు.



ఆకర్షణ సతీష్... వయసు చిన్నదే... కానీ పెద్ద బాధ్యతను భుజానికి ఎత్తుకుంది. అక్షరాస్యతతోనే సాధికారత సాధ్యమని భావించి... ఇప్పటికి 23 గ్రంథాలయాలు ఏర్పాటు చేసింది. 'మన్ కీ బాత్'లో ప్రధాని మోదీ ప్రశంసలు అందుకుంది. అంతేకాదు... ఈ మహాసంకల్పానికి చేయూత అందిస్తానని నాడు ప్రధాని హామీ ఇచ్చారు. చెప్పినట్టుగానే 'నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా' నుంచి ఇటీవల ఏడున్నర వేల పుస్తకాలను ఆమె అందుకుంది. ఇది తనకు ఎనలేని ప్రేరణనిచ్చిందని... వంద గ్రంథాలయాల ఏర్పాటే తన లక్ష్యమని అంటున్న ఆకర్షణ... 'నవ్య'తో ముచ్చటించింది.

అక్షరంతో సాధికారత

"నాలుగేళ్ల కిందట... నేను హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ చిన్నపిల్లల వార్డును సందర్శించాను. అక్కడి చిన్నారులను పలుకరించినప్పుడు... పెయింటింగ్ చేయడానికి, అలాగే చదువుకోవడానికకి పుస్తకాలు ఉంటే బాగుంటుందని అనుకున్నారు. ఆ ఘటనే నాలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలన్న ఆలోచనకు ప్రేరణనిచ్చింది. అనుకున్న వెంటనే పని మొదలుపెట్టాను. 100 పుస్తకాలతో ఎంఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్‌లో తొలి లైబ్రరీ ప్రారంభించాను. నాటి నుంచి నా ఈ ప్రయాణం నిరంతరాయంగా సాగుతూనే ఉంది. తెలంగాణ తమిళనాడుల్లో కలిపి మొత్తం 23 గ్రంథాలయాలు ఏర్పాటు చేశాను.

మెట్రో స్టేషన్లలో...



ఈ నెలలోనే జువైనల్ హోమ్‌లో మరో లైబ్రరీ ప్రారంభిస్తున్నాను. అలాగే హైదరాబాద్‌లోని మొత్తం 57 మెట్రో స్టేషన్ల గ్రంథాలయాలు అందుబాటులోకి తేవాలని ప్రయత్నిస్తున్నాను. ఇందుకోసం మెట్రో అధికారుల నుంచి అనుమతి పొందాను. తొలి లైబ్రరీని మధురానగర్‌లో ప్రారంభించాలని అనుకొంటున్నాను. అన్నీ కుదిరితే ఆగస్టు మొదటివారంలో ఇది కార్యరూపం దాల్చవచ్చు. ప్రారంభోత్సవానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు హాజరవ్వాలని కోరుకొంటున్నాను. ఆయనతో పాటు ప్రధానికి కూడా ఆహ్వానం పంపుతాను. ఈ లైబ్రరీల కోసమే మెట్రోవారు ఒక యాప్‌ను తీసుకువస్తున్నారు. ఆ యాప్‌లో ఎవరైనా సరే... మొబైల్ నంబర్, పేరు నమోదు చేసుకొని పుస్తకాలు పొందవచ్చు. ప్రతి మెట్రో స్టేషన్‌లో వెయ్యి పుస్తకాలు ఉంటాయి.

> **లక్ష్యం 100 గ్రంథాలయాలు...**
>
> ప్రస్తుతం నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాను. నేను ఏర్పాటు చేసిన లైబ్రరీలవల్ల ఎనిమిది వందలకు పైగా చిన్నారులు ప్రభావితమయ్యారు. అక్షరం భవిష్యత్తుకు పునాది. అది అన్ని వర్గాలవారికీ చేరాలన్నదే నా కోరిక. అందుకోసమే గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నా. ఈ ఏడాది డిసెంబరు నాటికి 100 లైబ్రరీలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. నా ఈ సంకల్పానికి మా అపార్టుమెంటులో నివసించేవారు, బంధువులు, తోటి విద్యార్థులు, వివిధ రంగాలకు చెందినవారు ఎంతో సహకారం అందిస్తున్నారు. నాకు మద్దతుగా నిలుస్తున్నారు. అందుకే ఎలాంటి ఆటంకాలు లేకుండా దీన్ని ముందుకు తీసుకొని వెళ్లగలుగుతున్నాను."

ప్రధాని సూచనతో...



నేను చేపట్టిన 'ఆకర్షణ లైబ్రరీ ఇనీషియేటివ్స్- ఎంపవరింగ్ మైండ్స్ త్రూ బుక్స్' కార్యక్రమం భారత ప్రధాని నరేంద్ర మోదీ దృష్టిని ఆకర్షించడం ఒక గొప్ప అనుభూతి. ఆయన 'మన్ కీ బాత్'లో నన్ను ప్రత్యేకించి అభినందించారు. అక్షరాస్యతను పెంపొందించడం సామాజిక బాధ్యతగా భావించి, దాని కోసం గ్రంథాలయాలు ఏర్పాటు చేయడాన్ని ప్రధాని ప్రశంసించారు. అంతేకాదు... నేను చేపట్టిన ఈ కార్యక్రమానికి సహకారం, మద్దతు అందిస్తానని హామీ కూడా ఇచ్చారు. ఇది నేను అస్సలు ఊహించలేదు. ఆయన చెప్పినట్టుగానే ఇటీవల 7,520 పుస్తకాలు అందుకున్నాను. ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) సూచనతో 'నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా' ఈ పుస్తకాలు నాకు పంపించింది. వీటిల్లో మహానాయకుల జీవిత గాథలతో పాటు ఫిక్షన్, నాన్‌ఫిక్షన్ కథలు, జీకే, సాహిత్యానికి సంబంధించి తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ భాషా పుస్తకాలు ఉన్నాయి. 67 పెట్టెల్లో వచ్చిన ఈ పుస్తకాల విలువ రూ.7.6 లక్షలు. మరిన్ని గ్రంథాలయాల ఏర్పాటుకు ఇది నాకు స్ఫూర్తినిచ్చింది. కొత్తగా ఏర్పాటు చేయబోయే లైబ్రరీల్లో వీటిని పెడతాను. అన్నీ కలిపి ఇప్పుడు నా దగ్గర పదకొండు వేల పుస్తకాలు ఉన్నాయి. అలాగే ఒకసారి రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశాను. గిరిజనుల కోసం కూడా ఒక గ్రంథాలయం ఏర్పాటు చేయాలని ఆ సందర్భంలో ఆమె సూచించారు.

• పులగం గిరి

సమాధానాలు చెప్పలేకపోతున్నారా?



కొంతమంది పిల్లలు గంటలతరబడి చదువుతూనే ఉంటారు. కానీ పరీక్షల్లో అడిగిన ప్రశ్నలకు సరిగా సమాధానాలు రాయలేక మార్కులు పోగొట్టుకుంటూ ఉంటారు. అలా కాకుండా పిల్లలు పరీక్షలు బాగా రాసి ఎక్కువ మార్కులు తెచ్చుకునేలా... తల్లిదండ్రులు ఎలా చదివించాలో తెలుసుకుందాం...

- పిల్లలు ఎంతసేపు చదువుతున్నారు అనే అంశం మీద కాకుండా ఎలా చదువుతున్నారనే దాని మీద ఎక్కువగా దృష్టి సారించాలి. గంటసేపు కూర్చుని పాఠమంతా ఒకేసారి చదివితే పిల్లలకు గుర్తుండకపోవచ్చు. పాఠాన్ని రెండు లేదా మూడు భాగాలుగా విభజించి రోజుకు ఒక భాగాన్ని మాత్రమే చదివించాలి. అది కూడా పావు గంట లేదా అరగంట దాటకుండా చూడాలి. ఇలా పాఠం చదవడం పూర్తయిన తరవాత మరోసారి రివిజన్ చేయించాలి. కొద్ది కొద్దిగా ఎక్కువసార్లు చదవడం వల్ల పిల్లలకు పాఠాలు చక్కగా గుర్తుంటాయి.
- పాఠం చదువుతున్నప్పుడు ముఖ్యాంశాల కింద పెన్సిల్‌తో లైన్ గీయడం పిల్లలకు అలవాటు చేయాలి. పాఠం చదవడం పూర్తయ్యాక వాటిని నోట్‌బుక్‌లో రాయించాలి. వారానికి ఒకసారి వీటిని పిల్లల చేత చదివించాలి. వీలైనప్పుడల్లా నోట్స్ చూడకుండా పేపర్ మీద వాటిని రాయిస్తూ ఉండాలి. ఈ ప్రక్రియ... పిల్లల జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- పిల్లలు సాధారణంగా లెక్కలంటే భయపడుతూ ఉంటారు. అలాంటప్పుడు వాటికి సంబంధించిన సూత్రాలు, నియమాలను ముందుగానే నోట్‌బుక్‌లో రాయించాలి. పిల్లలకు అవి అర్థమయ్యేలా వివరించి చెప్పాలి. రోజూ ఉదయాన్నే వీటిని రివిజన్ చేయించాలి. అభ్యాసంలో ఇచ్చిన లెక్కలను దగ్గరుండి చేయించాలి.
- పరీక్షలప్పుడు ఒక పాఠం లేదా అధ్యాయం పూర్తయ్యాకే మరోదాన్ని మొదలుపెట్టాలనే విధానాన్ని పాటించవద్దు. పిల్లలు ఒక పాఠాన్ని కొంత వరకు చదివిన తరవాత అరగంటసేపు ఆగి మరో పాఠాన్ని మొదలుపెట్టమని చెప్పాలి. తరవాత పావుగంటసేపు ఆగి మొదటి పాఠాన్ని పూర్తిచేయించాలి. ఇలా చేయడం వల్ల పిల్లల గ్రహణ శక్తి పెరుగుతుంది.

బ్రొకలీతో ఆరోగ్యం



క్యాబేజీ కుటుంబానికి చెందిన బ్రొకలి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. వండుకుని లేదా పచ్చిగా తిన్నా మంచిదంటున్నారు నిపుణులు.

- బ్రొకలీలో విటమిన్ కె, క్యాల్షియం ఎముకలను బలంగా ఉంచడంలో సహాయపడతాయి.
- ఇందులోని అధిక ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఆకలిని నియంత్రించి బరువు పెరగకుండా సహాయపడుతుంది.
- విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. విటమిన్ ఎ కంటి ఆరోగ్యానికి దోహదం చేస్తుం ది. యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఆర్థరైటిస్‌కు కారణమయ్యే ఎంజైమ్‌లను అడ్డుకుంటాయి.
- బ్రొకలిలోని యాంటీఆక్సిడెంట్లు హానికర ఫ్రీరాడికల్స్‌ను తటస్థీకరిస్తాయి.
- ఇందులోని విటమిన్ సి, ఈ, ఫ్లేవనాయిడ్లు మెదడు ఆరోగ్యాన్ని కాపాడతాయి.
- బ్రొకలి చర్మాన్ని కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. కొల్లాజన్ ఉత్పత్తిని పెంచి వృద్ధాప్య ఛాయలను దూరం చేస్తుంది.
- అయితే ఇది థైరాయిడ్ గ్రంధి పనితీరును ప్రభావితం చేస్తుంది. కాబట్టి థైరాయిడ్ ఉన్నవారు బ్రొకలీకి దూరంగా ఉండడం మేలు.

కౌన్సెలింగ్

వర్షాల్లో పసికందుల సమస్యలు

Q A

వానాకాలంలో పసికందులకు చర్మ సమస్యలు రాకుండా ఉండాలంటే ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి?

- ఓ సోదరి, హైదరాబాద్

ఎక్కువ తేమతో కూడిన చల్లని వానాకాలం వాతావరణంలో పసికందుల చర్మం మీద సూక్ష్మజీవులు విస్తృతంగా వృద్ధి చెందుతూ ఉంటాయి. పసికందుల శరీరాల్లో ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించే వ్యవస్థ బలహీనంగా ఉంటుంది కాబట్టి వాతావరణ మార్పులను పసి చర్మాలు తట్టుకోలేవు. కాబట్టి ఈ కాలంలో ఈ కింది జాగ్రత్తలు పాటించాలి.

- పసిపిల్లలకు తేలికైన కాటన్ దుస్తులు వేయాలి. పొడవాటి చేతుల దుస్తులు వేస్తే, దోమ కాటు నుంచి కూడా రక్షణ దొరుకుతుంది.
- ప్రతి రెండు గంటలకోసారి డయాపర్ మారుస్తూ ఉండాలి. లేదంటే తడిచిన వెంటనే మారుస్తూ ఉండాలి. ఇలా చేస్తే కటి ప్రాంతంలో తేమను నియంత్రించగలుగుతాం. అలాగే రోజులో 2 నుంచి 4 గంటల పాటు డయాపర్ లేకుండా పిల్లలను వదిలేయాలి.
- పసి పిల్లలకు కల్తీ లేని తాజా కొబ్బరినూనె పట్టించి, మర్దన చేయాలి. పసికందుల చర్మం లోపలి పొరల్లోకి ఈ నూనె తేలికగా ఇంకిపోతుంది.
- వానాకాలం వాతావరణం మూలంగా పిల్లల రోగనిరోధకశక్తి బలహీనంగా ఉంటుంది కాబట్టి ఇన్‌ఫెక్షన్లు తేలికగా సోకుతూ ఉంటాయి. కాబట్టి మురికితో కూడిన పరిసరాలకు, ఇన్‌ఫెక్షన్లు సోకిన వారికి పసికందులను దూరంగా ఉంచాలి.
- దోమల మందులకు బదులుగా దోమ తెరలు వాడుకోవాలి.

ఆరోగ్యమైన చర్మం కోసం



- ప్రతి రోజూ స్నానం చేయిస్తూ, చర్మాన్ని శుభ్రంగా ఉంచాలి. స్నానం కోసం సున్నితమైన క్లీన్సర్, గోరువెచ్చని నీళ్లు వాడాలి.
- స్నానం చేయించిన వెంటనే, చర్మాన్ని రుద్దకుండా, పొడిగా తుడవాలి.
- స్నానం తర్వాత కొబ్బరి నూనె పూయడం వల్ల, పిల్లల చర్మం తేమను సంతరించుకుని, దద్దుర్లు, చర్మం పొడిబారడం లాంటి సమస్యలు తలెత్తకుండా ఉంటాయి.
- రాత్రి నిద్రకు ముందు పసికందుల కోసం ఉద్దేశించిన బాడీ లోషన్ అప్లై చేయాలి.
- డయాపర్ మార్చే ప్రతిసారీ ఆ ప్రదేశాన్ని కాటన్ క్లాత్‌తో పొడిగా తుడిచి, వర్జిన్ కొకొనట్ ఆయిల్ పూయాలి. మలమూత్రాల వల్ల ఎలాంటి ఇన్‌ఫెక్షన్ తలెత్తకుండా ఉండేలా కొబ్బరి నూనె బిడ్డకు రక్షణ కల్పిస్తుంది.

• డాక్టర్ జుష్యా భాటియా సరీన్
డెర్మటాలజిస్ట్.

మొక్కలకు ఎప్పుడు నీళ్లు పోయాలి..?

మనం ఇంటి చుట్టూరా లేదంటే బాల్కనీల్లో మొక్కలను పెంచుతూ ఉంటాం. వాటి స్వభావాన్ని అనుసరించి రోజూ నీళ్లు పోస్తూ ఉంటే మొక్కలు చక్కగా పెరుగుతాయి. మొక్కలకు ఏ సమయంలో నీళ్లు పోస్తే మంచిదో తెలుసుకుందాం...

- సూర్యోదయానికి ముందే మొక్కలకు నీళ్లు పోయాలి. ఈ సమయంలో నేల లేదా కుండీలోని మట్టి చల్లగా ఉంటుంది. దీంతో మొక్కలు మెల్లగా నీటిని పీల్చుకుంటాయి. ఫలితంగా వేర్లు, కాండం, ఆకులు పూర్తిగా తేమతో నిండుతాయి. రోజంతా ప్రసరించే సూర్యరశ్మిని, వేడిని తట్టుకుని నిలబడతాయి. సూర్యోదయం తరవాత, మధ్యాహ్న సమయాల్లో మొక్కలకు నీళ్లు పోయకూడదు. అలా పోస్తే ఆకులు, వేర్లు దెబ్బతిని మొక్కలు త్వరగా ఎండిపోతాయి.



- సాయంత్రం సూర్యాస్తమయం వెంటనే మొక్కలకు నీళ్లు పోయకూడదు. మొక్క భాగాలు, మట్టి చల్లబడే వరకూ ఆగాలి. చీకటి పడకుండా వెలుగు ఉన్నప్పుడే నీళ్లు పోయాలి.
- రాత్రి వేళల్లో కూడా మొక్కలకు నీళ్లు పోయకూడదు. అలా చేస్తే హానికారక ఫంగస్‌లు, క్రిమికీటకాలు చేరి మొక్కలకు నష్టం కలిగిస్తాయి.
- వర్షాకాలంలో అయితే రోజూ కాకుండా రెండు రోజులకు ఒకసారి నీళ్లు పోస్తే చాలు. శీతాకాలంలో మట్టిని గమనించి అవసరం మేరకు ఉదయమే నీటిని చిలకరించాలి.
- కొన్ని మొక్కలకు నీళ్లు ఎక్కువగా అవసరమవుతాయి. కొన్నింటికి మట్టి తేమగా ఉంటే చాలు. వాటి స్వభావం గురించి పూర్తిగా తెలుసుకుని ఆ ప్రకారమే నీళ్లు అందిస్తే మొక్కలు ఏపుగా పెరుగుతాయి.

గ్రామీణ జీవితాల్లో మార్పు కోసం చిన్న ప్రయత్నంగా 15 ఏళ్ల క్రితం అర్చనాకపూర్ ప్రారంభించిన స్మార్ట్ కమ్యూనిటీ రేడియో... విశ్వసనీయ సమాచారం అందించడంతో పాటు ప్రతి సమస్యకు సహేతుకమైన పరిష్కారాన్ని సూచించే మాధ్యమంగా ఎదిగింది. వినోదం నుంచి విజ్ఞానం వరకూ రోజూ పద్నాలుగు గంటల ప్రసారాలతో జనం కోసం జనమే నిర్వహించుకుంటున్న ఈ నెట్‌వర్క్ లక్షలాది జీవితాలతో పెనవేసుకుంది.

ఈ రేడియో... జన జీవన వాణి

గర్భంతో ఉన్నప్పుడు ఉపవాసం చేయవచ్చా? మానేస్తే... నిర్ణీతమైన రోజుల్లో కచ్చితంగా ఉపవాసం పాటించాలనే సంప్రదాయానికి భంగం కలిగించినట్టా? కొనసాగిస్తే మరి తనకు, తనలోపల పెరుగుతున్న బిడ్డకు పోషణ ఎలా?... హరియాణాలోని ఒక గర్భిణిని ఈ ప్రశ్నలు సతమతం చేశాయి. తనకు దగ్గర్లో ఉన్న రేడియో కమ్యూనిటీ సభ్యులకు తన సందేహాన్ని ఆమె వివరించారు. వారు వెంటనే తమ రేడియోలో ఈ విషయాన్ని ప్రసారం చేశారు. కొద్దిసేపటికే స్థానిక మత పెద్ద స్పందించారు. "నిర్ణీతమైన రోజుల్లో ఉపవాసాలు తప్పనిసరి అయినప్పటికీ... గర్భిణులు దాన్ని పాటించకపోయినా అపచారం కాదు" అని స్పష్టం చేశారు. ఇదొక్కటే కాదు... ఆరోగ్య, వ్యవసాయ సమస్యలు, స్త్రీ-పురుష సంబంధాలు, గృహహింస, మహిళలపై వేధింపులు వాతావరణ మార్పులు, వివిధ కార్యక్రమాల్లో పౌర భాగస్వామ్యం... ఇలా ఎన్నో అంశాలకు 'స్మార్ట్ కమ్యూనిటీ రేడియో నెట్‌వర్క్' ఒక చర్చాస్థలి, పరిష్కార వేదిక. ఢిల్లీకి చెందిన అర్చనాకపూర్ స్థాపించిన ఈ నెట్‌వర్క్ వచ్చే సెప్టెంబరుకు పదిహేనేళ్ళు పూర్తి చేసుకోబోతోంది.

అందుకే ఎంచుకున్నా...

అర్చనాకపూర్ ఒక సామాజిక కార్యకర్త, రచయిత, పుస్తక ప్రచురణకర్త, ఫిలిమ్ మేకర్. ఆమె, ఆమె బృందం హరియాణాలోని సుమారు వంద గ్రామాల్లో విద్య, జీవనోపాధికి సంబంధించి వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల్లో స్వచ్ఛందంగా పని చేసేవారు. అయితే... ప్రభుత్వ పాజెక్టుల్లో ఎన్జీవోల భాగస్వామ్యాన్ని అక్కడి ప్రభుత్వం రద్దు చేసింది. ఏది ఏమైనప్పటికీ గ్రామీణ ప్రజలకు సేవలందించాలనే సంకల్పంతో... 2010 సెప్టెంబర్‌లో 'రేడియో మేవాట్'ను ఆమె ప్రారంభించారు. "మేవాట్ (ప్రస్తుతం నెహ్ జిల్లా) సామాజికంగా, అక్షరాస్యతపరంగా... ఇలా అన్ని విధాలా వెనుకబడిన జిల్లా. సాంఘిక దురాచారాలు, మూఢనమ్మకాలు ఎక్కువ. రోజులో సగం సమయం విద్యుత్ సరఫరాకు కూడా జనం నోచుకొనేవారు కాదు. ఆరోగ్యాలు అంతంతమాత్రమే. వారి జీవితాల్లో మార్పుకోసమే ఆ జిల్లాను ఎంచుకున్నాను" అని చెబుతారు అర్చన. మొదట్లో రెండు గంటల ప్రసారాలతో ఈ కమ్యూనిటీ రేడియో ప్రారంభమయింది. ఇప్పుడు రోజూ పద్నాలుగు గంటల సేపు వివిధ స్థానిక అంశాలపై కార్యక్రమాలు జరుగుతున్నాయి. నెహ్ జిల్లాలోని 168 గ్రామాలకు చెందిన దాదాపు ఆరున్నర లక్షల మంది శ్రోతలు నిత్యం దీనితో మమేకం అవుతున్నారు.



సలహాల నుంచి అనుభవాల వరకూ...

ఈ కమ్యూనిటీ రేడియో నెట్‌వర్క్ అన్ని కార్యక్రమాల్లోనూ ప్రజలు తమ అభిప్రాయాలు వెల్లడించవచ్చు. వీలైనంత వరకూ అన్ని గ్రామాల్లోనూ కమ్యూనిటీ మెంబర్స్ వీటిని నడుపుతారు. గ్రామాల్లోని సమస్యలను స్థానికులు చెబితే... వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్ళి, వారి సమాధానాలను కూడా ప్రసారం చేస్తారు. నిరక్షరాస్యుల కోసం రేడియో ట్యూషన్ ఉంది. వయోధికులు తమ చిన్ననాటి జ్ఞాపకాలను, అనుభవాలను వివరిస్తారు, సలహాలు ఇస్తారు. వైద్య సిబ్బంది ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాల గురించి, పిల్లల పెంపకం గురించి, గర్భిణులు, బాలింతలకు జాగ్రత్తల గురించి, నెలసరి సమస్యల పరిష్కారం గురించి, మానసిక ఆరోగ్యం గురించి వివరిస్తారు. గృహహింస, మహిళల పట్ల వేధింపులను కూడా ఇప్పుడు నిర్భయంగా చర్చించి, తగిన చర్యలు తీసుకుంటున్నారు. యువతకు పోటీ పరీక్షల గురించి, ఉద్యోగావకాశాల గురించి, రైతులకు వ్యవసాయ సంబంధమైన అంశాల గురించి సమాచారం అందిస్తున్నారు. పోషకాలతో కూడిన వంటల్లాంటి అంశాలు, కథలు, కవితలు, చిన్న నాటకాల్లాంటి సాంస్కృతిక కార్యక్రమాలు సరేసరి. రోడ్లు, మంచి నీరు, పారిశుధ్యం, పాఠశాలల్లో సౌకర్యాలు... ఇలా ఎన్నో సమస్యలు కమ్యూనిటీ రేడియో ద్వారా అధికారుల దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్ళి పరిష్కరించుకుంటున్నారు.



అది మన బాధ్యత

"ప్రస్తుతం పలు కేంద్ర ప్రభుత్వ శాఖలు, యునెస్కోతో పాటు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, గేట్స్‌ఫౌండేషన్ తదితర ప్రసిద్ధ సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో వారి సాయంతో ఎనభైకి పైగా రేడియో స్టేషన్లను నిర్వహిస్తున్నాం. మాకు కేంద్ర సమాచార, ప్రసార శాఖ నుంచి రెండు జాతీయ పురస్కారాలు లభించాయి. యునెస్కో నుంచి ప్రత్యేక ప్రశంసలు లభించాయి. ఇది మాకు గర్వకారణంగా భావిస్తున్నా. 'రేడియో మేవాట్'ను మేము ప్రారంభించినప్పుడు సోషల్ మీడియా ఇంత విస్తృతంగా లేదు. ఇప్పుడు దాదాపు అందరి దగ్గరా స్మార్ట్ ఫోన్లు ఉన్నాయి. దానిలో అవాంఛనీయమైన, అశాస్త్రీయమైన విషయాలెన్నో కనిపిస్తున్నాయి. అక్షరాస్యత, అవగాహన కొరవడిన గ్రామీణులపై ఇవి దుష్ప్రభావం చూపుతాయి. ఇలాంటి సమయాల్లో... 'ఏది నిజం? దేన్ని నమ్మాలి?' అనే మీమాంసలో ఉన్నవారికి విశ్వసనీయమైన దారి చూపడం మన బాధ్యత. ప్రధాన మీడియా పట్టించుకోని ఎన్నో గ్రామీణ సమస్యలను మా కమ్యూనిటీ రేడియో వెలుగులోకి తెస్తోంది. ఒక వ్యవస్థను నేను ఏర్పాటు చేశాను. ఇప్పుడు కంటెంట్ రూపకల్పనతో సహా ప్రతి బాధ్యతను స్థానికంగా ఉన్న 'కమ్యూనిటీ మెంబర్స్' చూసుకుంటున్నారు. ప్రజల జీవితానికి సంబంధించిన ప్రతి అంశాన్నీ మా నెట్‌వర్క్ ప్రతిబింబిస్తుంది. అందుకే ఇది సమాచార మాధ్యమం మాత్రమే కాదు... ప్రజల జీవితాల్ని మార్చే సాధనం కూడా" అంటున్నారు అర్చన.

బంగారు ఆభరణాలు కొత్తగా మెరవాలంటే..

మనం ధరించే బంగారు ఆభరణాలు కొన్ని రోజుల తరవాత మెరుపు తగ్గి నల్లబడుతుంటాయి. వీటిమీద చెమట, దుమ్ము, ధూళి చేరడమే దీనికి కారణం. కొన్ని ఇంటి చిట్కాలతో బంగారు ఆభరణాలను కొత్తవాటిలా మెరిపించవచ్చు.

- టమాటాను మధ్యకు కోసి లోపలి గింజలను తీసివేయాలి. ఈ టమాటా ముక్క మీద కొద్దిగా ఉప్పు చల్లి దానితో ఆభరణాలను సున్నితంగా రుద్దాలి. తరవాత చల్లటి నీళ్లతో ఆభరణాలను శుభ్రంగా కడిగి మెత్తటి రుమాలు లేదా తువాలుతో తుడిస్తే అవి కొత్తవాటిలా మెరుస్తాయి.
- వెడల్పాటి గిన్నెలో ఒక గ్లాసు గోరువెచ్చని నీళ్లు పోసి అందులో ఒక చెంచా బేకింగ్ సోడా వేసి కలపాలి. ఈ నీటిలో బంగారు ఆభరణాలు వేసి అర గంటసేపు నానబెట్టాలి. తరవాత పాత టూత్‌బ్రష్‌తో వాటిని మెల్లగా రుద్ది కడగాలి. పేరుకున్న మురికి తొలగిపోయి ఆభరణాలు చక్కగా మెరుస్తాయి.




- ఆభరణాల మీద గోరువెచ్చని నీరు చల్లి కొద్దిగా టూత్‌పేస్టు రాయాలి. తరవాత మెత్తటి బ్రష్‌తో రుద్ది నీళ్లతో కడిగితే మంచి ఫలితం కనిపిస్తుంది.
- చింతపండు లేదా కుంకుడు రసంలో కొద్దిసేపు నానబెట్టి తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసినా బంగారు ఆభరణాలకు మెరుపు వస్తుంది.
- ఖరీదైన రత్నాలు, రాళ్లు, ముత్యాలు పొదిగిన ఆభరణాలను నీళ్లలో నానబెట్టకూడదు. అలా చేస్తే వాటి మెరుపు పోతుంది. మెత్తటి గుడ్డ లేదా దూదిని కొద్దిగా తడిపి పైపైన తుడిస్తే చాలు.
- శుభ్రం చేసిన ఆభరణాలు పొడిగా ఆరిన తరవాతనే నిర్ణీత బాక్సుల్లో భద్రపరచుకోవాలి.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

రామ్‌చరణ్‌ను కించపరిచే ఉద్దేశం శిరీష్‌కు లేదు

- దిల్‌రాజు



'నా సోదరుడు శిరీష్‌ను అనవసరంగా వివాదంలోకి లాగి ట్రోల్ చేస్తున్నారు. ఆయన వ్యాఖ్యలను తప్పుగా ఆపాదించారు. డిస్ట్రిబ్యూషన్ కోణంలో మాట్లాడారు తప్ప రామ్‌చరణ్‌ను కించపరిచే ఉద్దేశం శిరీష్‌కు లేదు' అని నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు అన్నారు. నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'తమ్ముడు' చిత్రం ఈ నెల 4న విడుదలవుతోంది. ఈ సందర్భంగా దిల్‌రాజు మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

శ్రీరామ్ వేణు మా సంస్థలోనే ఆర్యతో అసిస్టెంట్ డైరెక్టర్‌గా కెరీర్ ప్రారంభించి, అప్పటి నుంచి మాతోనే సినిమాలు చేస్తున్నాడు. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ కోసం ఈ సినిమాను ఆయన డిజైన్ చేశారు. యాక్షన్ ఓరియంటెడ్ కంటెంట్ ఉన్న చిత్రమిది. 80 శాతం చిత్రీకరణ అడవిలో చేశాం. విజువల్స్ ప్రత్యేకాకర్షణగా ఉంటాయి. అక్కా తమ్ముళ్లు తమకు ఎదురైన సమస్యను పరిష్కరించేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేశారనేది కథ. సింపుల్ లైన్ అయినా స్ర్కీన్‌ప్లే పరంగా, యాక్షన్ పరంగా దర్శకుడు ఆసక్తికరంగా మలిచారు. నితిన్‌కు ఈ చిత్రంతో మంచి విజయం దక్కుతుందని నమ్ముతున్నాను.

'గేమ్‌ఛేంజర్'ను పట్టుకుని వేళ్లాడుతున్నారు

● 'తమ్ముడు' సినిమా ప్రచార కార్యక్రమాలతో మేం తీరిక లేకుండా ఉంటే కొంతమంది ఆర్నెల్ల క్రితం విడుదలైన 'గేమ్‌ఛేంజర్' అపజయాన్ని పదే పదే తెరపైకి తెస్తున్నారు. రామ్‌చరణ్‌తో మాకు మంచి అనుబంధం ఉంది. ఆ సినిమాతో చరణ్‌కు హిట్ ఇవ్వలేకపోయాం. అందుకే మరో మంచి కథతో ఆయనతో సినిమా చేయబోతున్నాం. జనవరి తర్వాత విడుదలైన వాటిలో చాలా భారీ బడ్జెట్ సినిమాలు ఆడలేదు. వాటన్నింటినీ వదిలేసి ఒక్క 'గేమ్‌ఛేంజర్'ను మాత్రమే పట్టుకుని వేళ్లాడుతున్నారు. 'గేమ్‌ఛేంజర్' ప్రస్తావన లేకుండా తమ్ముడు సినిమా ప్రచార కార్యక్రమాలు జరగడం లేదు.

● సినిమాను కాపాడడానికి ఎవరు ఏం చేసినా మేం కూడా అది అనుసరిస్తాం. 'కన్నప్ప' సినిమా విడుదలకు ముందు తప్పుడు సమీక్షలు, ట్రోలింగ్, పైరసీకి పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని విష్ణు చేసిన హెచ్చరికలు సత్ఫలితాలనిచ్చాయి. సినిమా విడుదలకు ముందు మేము కూడా ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు ఆలోచిస్తున్నాం.

దిల్‌రాజుకు పొగరు అంటున్నారు

● సినిమాకు మేలు చేయకపోయినా పరవాలేదు కానీ అబద్ధపు రివ్యూలతో సినిమాకు హాని చేయవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. దీనివల్ల నిర్మాతలు భారీగా నష్టపోతున్నారు. గట్టిగా నిలదీస్తే దిల్‌రాజుకు పొగరు అంటున్నారు. విడుదలకు ముందే ఫలానా ఓటీటీలో మా సినిమా రాబోతోంది అని ప్రకటించడం కూడా ఆపేస్తే థియేట్రికల్ రన్‌కు మేలు జరుగుతుంది.

● పైరసీని అరికట్టేందుకు పరిశ్రమ తరపు నుంచి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. థియేటర్స్‌లో పైరసీ చేస్తున్న కొందరినీ ఇటీవలే అరెస్ట్ చేశారు. ఇప్పుడు ప్రీమియర్స్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోవాలి. అందుకే తమ్ముడు సినిమాకు ప్రీమియర్స్ వేసే విషయంలో ఇంకా నిర్ణయం తీసుకోలేదు. హైదరాబాద్‌లో బాలల చిత్రోత్సవాల నిర్వహణ నిలిచిపోయింది. పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

'అఖండ 2'లో 'బజరంగీ భాయిజాన్' బాలనటి



బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కిస్తున్న చిత్రం 'అఖండ 2'. ఇది 2021లో విడుదలై బ్లాక్‌బస్టర్ సాధించిన 'అఖండ'కు కొనసాగింపు భాగం. రామ్ అచంట, గోపీ అచంట నిర్మిస్తున్నారు. దసరా సందర్భంగా సెప్టెంబరు 25న విడుదలవుతోంది. తాజాగా, ఈ ప్రాజెక్ట్‌లోకి బాలీవుడ్ చిత్రం 'బజరంగీ భాయిజాన్'లో బాలనటిగా ప్రేక్షకులను ఆకట్టుకున్న హర్షాలీ మల్హోత్రా ఎంటరయ్యారు. ఆమె 'జననీ' అనే పాత్రను పోషిస్తున్నట్లు టీమ్ ప్రకటించింది. ఈ చిత్రంలో ఆది పినిశెట్టి, సంయుక్త కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇటీవలె విడుదలైన గ్లింప్స్ చిత్రం ఎలా ఉండబోతోందో హింట్ ఇచ్చింది.

మమ్ముట్టి కెరీర్‌పై పాఠ్యాంశం



విభిన్నమైన కథాంశాలతో మనసుకు హత్తుకునే సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు మలయాళ కథానాయకుడు మమ్ముట్టి. తాజాగా ఆయనకు ఓ అరుదైన గౌరవం దక్కింది. చిత్రసీమకు ఆయన చేసిన కృషిని గౌరవిస్తూ కేరళలోని మహరాజా కళాశాల ఓ కీలక నిర్ణయం తీసుకుంది. బి.ఎ.హిస్టరీలో ఆయనపై ఓ పాఠ్యాంశాన్ని చేర్చింది. ద్వితీయ సంవత్సరంలోని విద్యార్థుల కోసం 'హిస్టరీ ఆఫ్ మలయాళం సినిమా' పేరుతో ఒక ఛాప్టర్‌ను సిలబస్‌లో చేర్చింది. ఇందులో ఆయన సినీ కెరీర్, ఎదుర్కొన్న సవాళ్లు, అందుకున్న పురస్కారాల గురించిన ఆసక్తికర విషయాలు ఉన్నాయి. మోహన్‌లాల్, జయన్, షీలా, ప్రేమ్‌నజీర్ గురించి కూడా ఇందులో చర్చించారు. కాగా, మమ్ముట్టి ఈ కళాశాల పూర్వ విద్యార్థి కావడం విశేషం.

వినోదం పంచేందుకు



సంగీత్ శోభన్, నయన సారిక జంటగా నిహారికా కొణిదెల నిర్మిస్తున్న కొత్త చిత్రం బుధవారం పూజా కార్యక్రమాలతో మొదలైంది. మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు నాగ్ అశ్విన్ క్లాప్ ఇచ్చారు. మరో దర్శకుడు వశిష్ఠ కెమెరా స్విచ్ఛాన్ చేశారు. తొలి సన్నివేశానికి ఇంకో దర్శకుడు కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం ఇది, ఈనెల 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని చిత్రబృందం తెలిపింది.

ఫిష్ వెంకట్ ఆరోగ్యం విషమం



నటుడు ఫిష్ వెంకట్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. ఎన్నో సినిమాల్లో నటించిన ఆయన కొంత కాలంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మూడేళ్ల క్రితమే రెండు కిడ్నీలు ఫెయిల్ కావడంతో ఆయన డయాలసిస్ చేయించుకుంటున్నారు. ప్రస్తుతం వెంకట్ పరిస్థితి విషమంగానే ఉందని, డయాలసిస్‌పై ఎంతో కాలం నడిపించలేమని, సాధ్యమైనంత త్వరగా కిడ్నీ మార్చుకుంటే మంచిదని వైద్యులు చెబుతున్నారు. కనీసం మందులు కొనే పరిస్థితి కూడా తమకు లేదని, సినీ ప్రముఖులు ముందుకు వచ్చి ఆదుకోవాలని వెంకట్ కుటుంబ సభ్యులు అభ్యర్థిస్తున్నారు. -ఉప్పల్ (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్

'సోలో బాయ్' విజయం సాధించాలి



గౌతమ్‌కృష్ణ, రమ్య పసుపులేటి జంటగా నటించిన 'సోలో బాయ్' చిత్రం ఈ శుక్రవారం విడుదలవుతోంది. నవీన్‌కుమార్ దర్శకత్వంలో సెవెన్ హిల్స్ సతీశ్ నిర్మించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దర్శకుడు వీవీ వినాయక్ మాట్లాడుతూ 'దర్శకుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి, స్వయంకృషితో నిర్మాతగా ఎదిగిన సతీశ్‌ను అభినందిస్తున్నాను. ఈ సినిమా విజయం సాధించి ఆయన ప్రయాణానికి తోడ్పడాలని కోరుకుంటున్నాను' అని చెప్పారు. సతీశ్ మాట్లాడుతూ 'గౌతమ్‌కృష్ణ కెరీర్‌లో ఈ చిత్రం ఓ మైల్ స్టోన్ అవుతుంది' అన్నారు.

విడుదలకు సిద్ధం



మానవ సంబంధాలను చర్చిస్తూ సందేశాత్మకంగా సాగే చిత్రం 'దీక్ష'. డాక్టర్ ప్రతాని రామకృష్ణగౌడ్ స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. కిరణ్, అలేఖ్యరెడ్డి జంటగా నటించారు. ఈ నెల్లోనే ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతాని రామకృష్ణగౌడ్ మాట్లాడుతూ 'దీక్ష చిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకొంది. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తాం' అని చెప్పారు.

కొత్తదనం నిండిన చిత్రం



దిల్ రమేశ్, జబర్దస్త్ చంటి ప్రధాన పాత్రల్లో పీఎస్సీ శర్మ తెరకెక్కిస్తున్న చిత్రం 'కౌలాస్ కోట'. డా.మాదాల నాగూర్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత మాదాల నాగూర్ మాట్లాడుతూ "ప్రేక్షకుల ఆదరణను పొందే చిత్రమిది" అని అన్నారు. దర్శకుడు పీఎస్సీ శర్మ మాట్లాడుతూ "నవరసాలతో పాటు కొత్తదనం నిండిన ఈ సినిమా ఘన విజయం సాధిస్తుంది" అని చెప్పారు.

తొలి గీతం విడుదల



సాత్విక్ వర్మ, ప్రీతి నేహా హీరో హీరోయిన్లుగా భాను దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ప్రేమిస్తున్నా'. వరలక్ష్మీ పప్పుల సమర్పణలో కనకదుర్గారావు పప్పుల నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ని మేకర్స్ ఆవిష్కరించారు. అదేవిధంగా 'అరెరె' అంటూ సాగే తొలి గీతాన్ని భీమ్స్ విడుదల చేశారు. సుద్దాల అశోక్ తేజ సాహిత్యానికి సిద్ధార్థ్ సాలూర్ సంగీతం అందించారు. అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు భాను మాట్లాడుతూ 'మంచి ప్రేమ కథతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాము. ఇది అందరికీ కనెక్ట్ అయ్యే సినిమా అవుతుంది' అని అన్నారు.

'మేకిన్ ఇండియా'కు చైనా గండి

ఫాక్స్‌కాన్ నుంచి చైనా ఉద్యోగులు వెనక్కి

న్యూఢిల్లీ: భారత్‌పై చైనా ఆర్థిక యుద్ధాన్ని తీవ్రం చేస్తోంది. ఇప్పటికే రేర్ ఎర్త్ మాగ్నెట్లు, ప్రత్యేక ఎరువుల ఎగుమతులపై ఆంక్షలు విధించిన చైనా ఇప్పుడు కొత్తగా భారత్‌లో యాపిల్ ఐఫోన్ల తయారీకి గండి కొట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం యాపిల్ కంపెనీ కోసం భారత్‌లో ఐఫోన్లను తయారు చేసే తైవాన్ కంపెనీ ఫాక్స్‌కాన్ ఫ్యాక్టరీల నుంచి తన ఇంజినీర్లు, సాంకేతిక సిబ్బందిని వెనక్కి తీసుకుంటోంది. గత రెండు నెలల్లోనే దక్షిణ భారత్‌లోని ఫాక్స్‌కాన్ ప్లాంట్లలో పనిచేసే దాదాపు 300 మంది సాంకేతిక సిబ్బందిని చైనా వెనక్కి తీసుకుంది. అయితే ఈ ఆంక్షల కారణంగా భారత కంపెనీలకు తాత్కాలిక ఇబ్బందులే తప్ప, దీర్ఘకాలికంగా వచ్చే ఇబ్బందులు ఏమీ ఉండక పోవచ్చని నిపుణుల అంచనా.



ఎందుకంటే ?: కొవిడ్ తర్వాత అమెరికా, ఈయూ, జపాన్ దేశాల కంపెనీలు 'చైనా+వన్' విధానాన్ని అనుసరిస్తున్నాయి. ఇందులో భాగంగా తమ ఉత్పత్తి యూనిట్లను చైనా నుంచి భారత్, వియత్నాం వంటి దేశాలకు తరలిస్తున్నాయి. యాపిల్ కంపెనీ అయితే ఇప్పటికే తన ఐఫోన్లలో 20 శాతం భారత్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. వచ్చే ఏడాదికల్లా దీన్ని మరింత పెంచబోతున్నట్టు ప్రకటించింది. దీంతో ప్రపంచ ఫ్యాక్టరీగా తనకున్న ఆధిపత్యం ఎక్కడ చేజారుతుందోనని చైనా భయపడుతోంది. దీనికి తోడు గల్వాన్ సరిహద్దు ఘర్షణల తర్వాత మన దేశం చైనా కంపెనీల పెట్టుబడులపై కఠిన ఆంక్షలు విధించింది. మన టెలికం కంపెనీలు ప్రారంభించిన 4జీ, 5జీ నెట్‌వర్క్‌ల విస్తరణలోనూ ప్రభుత్వం చైనా కంపెనీలను అనుమతించలేదు. ఈ అక్కసుతోనే చైనా ప్రభుత్వం మన దేశ కంపెనీలకు టెక్నాలజీ బదిలీ, నిపుణులైన సిబ్బంది రాకపోకలపై ఆంక్షలు కట్టుదిట్టం చేస్తోందని భావిస్తున్నారు.

మైక్రోసాఫ్ట్‌లో మరో 9,000 ఉద్యోగాల కోత



రెడ్‌మాండ్(అమెరికా): అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజం, విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ రూపకర్త మైక్రోసాఫ్ట్ వ్యయ నియంత్రణలో భాగంగా మరో విడత భారీ ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టింది. ఈ సారి కంపెనీ మొత్తం సిబ్బంది 2.28 లక్షల మందిలో 4 శాతానికి సమానమైన 9,100 మందికి ఉద్వాసన పలకాలని నిర్ణయించినట్లు తెలిసింది. బుధవారం నుంచే వారికి పింక్ స్లిప్‌లు ఇవ్వడం ప్రారంభించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీ కార్యాలయాల్లోని ఉద్యోగులపై ఇది ప్రభావం చూపనుందని, ప్రధానంగా సేల్స్, ఎక్స్‌బాక్స్ వీడియో గేమ్ విభాగాల్లో అధిక కోతలుంటాయని మైక్రోసాఫ్ట్ తెలిపింది. కంపెనీ ఉద్యోగులను తగ్గించుకోవడం ఈ ఏడాదిలో ఇది రెండోసారి. మే నెలలో దాదాపు 6,000 మందిని బయటికి సాగనంపింది.

ఎంసీఎల్‌ఆర్ రేటును తగ్గించిన ఇండియన్ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంక్ రిటైల్ రుణాలపై నిధుల సమీకరణ వ్యయాల ఆధారిత వడ్డీరేటును (ఎంసీఎల్‌ఆర్) 0.05 శాతం మేరకు తగ్గించింది. దీంతో ఈ రేటు 9 శాతానికి దిగివచ్చింది. ఈ కొత్త రేటు గురువారం నుంచే అమలులోకి వస్తుంది. దీంతో ఆటో, పర్సనల్, గృహరుణాలు మరింత చవుక అవుతాయి. అలాగే కస్టమర్లకు మరింత సౌలభ్యం కల్పించడం లక్ష్యంగా బ్యాంకు ఖాతాలో కనీస నిల్వ నిర్వహించకపోతే విధించే చార్జీలను పూర్తిగా ఎత్తివేసింది. ఇది జూలై 7 నుంచి అమలులోకి వస్తుంది.

మివి నుంచి 'ఏఐ బడ్స్'



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్థానిక ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీ సంస్థ 'మివి' మరో వినూత్న ఉత్పత్తిని మార్కెట్‌లో విడుదల చేసింది. కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా పని చేసే బడ్స్‌ను ఆవిష్కరించింది. మానవ తరహా సంభాషణలు, స్క్రీన్ లేకుండా పరస్పర చర్చలు అందించడం ఈ బడ్స్ ప్రత్యేకత అని కంపెనీ తెలిపింది. తెలుగు, కన్నడం, తమిళంతో సహా ఎనిమిది భారతీయ భాషల్లో ఎటువంటి సెట్టింగులు మార్చకుండా పని చేయడం వీటి ప్రత్యేకత అని కంపెనీ తెలిపింది.

ఆర్‌కామ్‌ది రుణ మోసం!

కంపెనీ రుణ ఖాతాను మోసాల జాబితాలో చేర్చాలని ఎస్‌బీఐ నిర్ణయం

- అనిల్ అంబానీపైనా ఆర్‌బీఐకి ఫిర్యాదు
- బ్యాంక్‌ల నుంచి రూ.31,580 కోట్ల రుణాలు



న్యూఢిల్లీ: అనిల్ అంబానీకి చెందిన దివాలా టెలికం కంపెనీ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) రుణాన్ని మోసపూరిత ఖాతాల్లో చేర్చాలని ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ నిర్ణయించింది. అలాగే, ఈ రుణ మోసంపై ఆర్‌బీఐకి పంపనున్న నివేదికలో ఆర్‌కామ్ మాజీ డైరెక్టర్ అనిల్ అంబానీపైనా ఎస్‌బీఐ ఫిర్యాదు చేయనుంది. దీంతో, ఆర్‌కామ్‌కు గతంలో రుణాలిచ్చిన ఇతర బ్యాంక్‌లు సైతం ఎస్‌బీఐ బాటను అనుసరించే అవకాశం ఉంది. ఎస్‌బీఐ తాజా నిర్ణయం తనను దిగ్భ్రాంతికి గురి చేసిందని అనిల్ అంబానీ అన్నారు. రుణ నిధుల వినియోగంలో సంస్థ నిబంధనలను అతిక్రమించినట్లు గుర్తించడంతో ఆర్‌కామ్ రుణాన్ని మోసపూరిత ఖాతాల జాబితాలో చేర్చాలని ఎస్‌బీఐకి చెందిన మోసాల గుర్తింపు కమిటీ (ఎఫ్‌ఐసీ) నిర్ణయించింది. ఈ నిర్ణయానికి సంబంధించి జూన్ 23వ తేదీతో కూడిన లెటర్ ద్వారా ఎస్‌బీఐ తమకు సమాచారం అందించిందని ఆర్‌కామ్ బుధవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు వెల్లడించింది. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం.. బ్యాంక్ ఏదైనా కంపెనీకిచ్చిన రుణాన్ని మోసపూరిత ఖాతాల జాబితాలో చేర్చినట్లయితే, ఆ విషయాన్ని 21 రోజుల్లో ఆర్‌బీఐకి రిపోర్ట్ చేయాలి. అలాగే, సీబీఐ లేదా పోలీసులకు కూడా ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. ఆర్‌కామ్, దాని అనుబంధ సంస్థలు బ్యాంక్‌ల నుంచి మొత్తం రూ.31,580 కోట్ల రుణాలు తీసుకున్నాయని ఎస్‌బీఐ తన లేఖలో వెల్లడించింది. పలు బ్యాంక్‌ల నుంచి తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించడంలో ఆర్‌కామ్ విఫలమవడంతో బ్యాంక్‌లు కంపెనీ రుణ ఖాతాలను 2016 లోనే మొండి పద్దుల జాబితాలో చేర్చాయి. అయితే, ఈ రుణాల వినియోగంలో నిబంధనలను అతిక్రమించారన్న ఆరోపణలపై స్పందించేందుకు గడిచిన రెండేళ్లలో ఆర్‌కామ్‌తో పాటు అనిల్ అంబానీకి పలు అవకాశాలివ్వడం జరిగిందని, వారి నుంచి సరైన స్పందన లభించలేదని ఎస్‌బీఐ పేర్కొంది. గత ఏడాది కెనరా బ్యాంక్ కూడా ఆర్‌కామ్ రుణ ఖాతాను మోసంగా వర్గీకరించింది. కానీ, బాంబే హైకోర్టు బ్యాంక్ నిర్ణయంపై స్టే విధించింది. ఎస్‌బీఐ తాజా చర్యలకు వ్యతిరేకంగా ఆర్‌కామ్ కోర్టును ఆశ్రయించే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.

కంపెనీపై దివాలా పరిష్కార చర్యలు

ఆర్‌కామ్‌పై 2019 జూన్ నుంచి దివాలా పరిష్కార చర్యలు కొనసాగుతున్నాయి. ఈ దివాలా పరిష్కార ప్రక్రియకు రుణదాతల కమిటీ (సీఓసీ) ఇప్పటికే ఆమోదం తెలిపింది. జాతీయ కంపెనీల చట్టం ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) ముంబై బెంచ్ తుది ఆమోదం తెలుపాల్సి ఉంది. ఈ మార్చి 31 నాటికి కంపెనీ మొత్తం రుణ బకాయిలు రూ.40,413 కోట్లుగా నమోదయ్యాయి.

ద్వితీయ శ్రేణి నగరాల్లో నియామకాల జోరు

ముంబై: గత నెల దేశంలో వైట్ కాలర్ కొలువుల (ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగులు) నియామకాలు పుంజుకున్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం పెరిగినట్టు ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ తెలిపింది. తన ఆన్‌లైన్ జాబ్ పోర్టల్ 'ఫౌండిట్.ఇన్‌'లో నమోదైన జాబ్ పోస్టింగ్స్ ఆధారంగా ఫౌండిట్ ఇన్‌సైట్స్ ట్రాకర్ ఈ విషయం తెలిపింది. ఆ నివేదిక ప్రకారం ద్వితీయ శ్రేణి నగరాలు నియామకాల్లో ముందువరుసలో ఉన్నాయి. నియామకాలు కోయంబత్తూరులో 26 శాతం, నాగపూర్, నాసిక్ నగరాల్లో 24 శాతం చొప్పున పెరిగాయి. ఐటీ, బీఎఫ్‌ఎస్‌ఐ, తయారీ, ఎఫ్ఎంసీజీ కంపెనీలు అధిక మొత్తంలో నియామకాలు చేశాయి. లాజిస్టిక్స్, రవాణ, ఇంధన రంగాల్లోనూ 38-42 శాతం మేరకు నియామకాలు పెరిగాయి. స్థిరమైన వృద్ధి, చక్కటి మౌలిక సదుపాయాలతో ద్వితీయ శ్రేణి నగరాల్లో కంపెనీల పెట్టుబడులు కూడా పెరుగుతున్నట్టు ఆ నివేదిక తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	590
వరంగల్	577	గోదావరి	570
చిత్తూరు	633	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	93	విజయవాడ	93
వరంగల్	93	గుంటూరు	98
కరీంనగర్	93	ఒంగోలు	101
మహబూబ్‌నగర్	93	చిత్తూరు	95
కర్నూలు	93	నెల్లూరు	100
విశాఖపట్నం	79	అనంతపురం	100
గోదావరి	93		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	98,890 ▲	90,650 ▲	1,20,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,09,000 ▼
విశాఖపట్నం	1,00,450 ▼	90,650 ▲	1,20,000 ▲
రాజమండ్రి	98,890 ▲	90,650 ▲	1,09,200 ▲
ప్రొద్దుటూరు	97,550 ▲	89,750 ▲	1,07,000 ▲
ముంబై	97,480 ▲	89,290 ▲	1,06,690 ▼

మార్కెట్లో లాభాల స్వీకరణ

ముంబై: లాభాల స్వీకరణ అమ్మకాలు బుధవారం దేశీయ స్టాక్ మార్కెట్‌ను దెబ్బతీశాయి. జూలై 9 నుంచి సుంకాల అమలు విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోననే భయం కూడా మార్కెట్‌ను వెంటాడింది. దీంతో సెన్సెక్స్ 287.60 పాయింట్ల నష్టంతో 83,409.69 వద్ద ముగియగా నిఫ్టీ 88.40 పాయింట్ల నష్టంతో 254,453.40 వద్ద క్లోజయింది. ఎఫ్‌పీఐల అమ్మకాలకు తోడు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, ఎల్ అండ్ టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో లాభాల స్వీకరణ అమ్మకాల ఒత్తిడి బుధవారం మార్కెట్‌ను బాగా దెబ్బతీశాయి.

హెచ్‌డీబీ ఫైనాన్స్ శుభారంభం: ఇటీవల ఐపీఓకు వచ్చిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీ షేర్లు బుధవారం లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.740పై 12.83 శాతం లాభంతో రూ.835 వద్ద బీఎస్ఈలో లిస్టయిన ఈ కంపెనీ షేర్లు ఇంట్రా డేలో 14.92 శాతం లాభంతో రూ.850.45ని తాకాయి. చివరికి 13.63 శాతం లాభంతో రూ.840.90 వద్ద ముగిశాయి. దీంతో కంపెనీ షేర్ల మార్కెట్ విలువ రూ.69,758 కోట్లకు చేరింది.

చారిత్రాత్మకమైన రోజు : తమ అనుబంధ సంస్థ హెచ్‌డీబీ ఫైనాన్సియల్ సర్వీసెస్ కంపెనీ లిస్టింగ్‌ను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చారిత్రాత్మకమైన రోజుగా బ్యాంకు ఎండీ, సీఈఓ శశిధర్ జగదీశన్ అభివర్ణించారు.

'టీవీఎస్ ఐక్యూబ్' కొత్త వెర్షన్

ధర రూ.1.03 లక్షలు

చెన్నై: టీవీఎస్ మోటార్ కంపెనీ.. తమ ఎలక్ట్రిక్ స్కూటర్ 'ఐక్యూబ్ 'ను మరింత మెరుగైన ఫీచర్లతో మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ కొత్త వేరియంట్ ఎక్స్ షోరూమ్ ప్రారంభ ధర రూ. 1.03 లక్షలు. 3.1 కిలోవాట్-అవర్ బ్యాటరీతో, ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే ఇది 123 కి.మీ వరకు ప్రయాణించగలదని కంపెనీ తెలిపింది. అలాగే హిల్ హోల్డ్ అసిస్ట్ వంటి అధునాతన భద్రతా ఫీచర్‌తో ఈ కొత్త వేరియంట్‌ను టీవీఎస్ అందుబాటులోకి తీసుకువచ్చింది.

పెరిగిన ఫార్మా ఎగుమతులు

- రెండు నెలల్లో రూ.42,482 కోట్లు

హైదరాబాద్: అంతర్జాతీయఅనిశ్చితిలోనూ మన ఫార్మా ఎగుమతులు పెరుగుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో మన దేశంనుంచి 496.17 కోట్ల డాలర్ల (సుమారు రూ.42,482 కోట్లు)విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతయ్యాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 7.38 శాతం ఎక్కువని భారత ఔషధ ఎగుమతుల ప్రోత్సాహక మండలి (ఫార్మాగ్జిల్) తెలిపింది. తాము తీసుకున్న వ్యూహాత్మక చర్యలు ఇందుకు ఎంతగానో దోహదం చేసినట్టు పేర్కొంది. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో మన దేశం నుంచి జరిగిన ఫార్మా ఎగుమతుల్లో ఫార్ములేషన్స్, బయోలాజిక్స్ వాటా 75.74 శాతం; బల్క్ డ్రగ్స్, ఇంటర్మీడియట్స్ వాటా 4.4 శాతం వరకు ఉన్నట్టు తెలిపింది. అమెరికా, బ్రిటన్, బ్రెజిల్, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్ దేశాలు మన దేశం నుంచి ఔషధాలు దిగుమతి చేసుకోవడంలో అగ్రస్థానంలో ఉన్నాయి.

గిల్.. జిగేల్

వరుసగా రెండో శతకం

- రాణించిన జైస్వాల్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 310/5
- ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్



శుభ్‌మన్ గిల్ (114 బ్యాటింగ్)

బర్మింగ్‌హామ్: క్లాస్ ఆటతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (216 బంతుల్లో 12 ఫోర్లతో 114 బ్యాటింగ్) వరుసగా రెండో శతకంతో మెరవగా.. యశస్వి జైస్వాల్ (107 బంతుల్లో 13 ఫోర్లతో 87) శుభారంభం అందించడంతో.. ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్ తొలి రోజును భారత్ మెరుగ్గా ముగించింది. బుధవారం ఆరంభమైన టెస్ట్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 85 ఓవర్లలో 310/5 స్కోరు చేసింది. మొదటి రోజు ఆట చివరకు గిల్‌తోపాటు జడేజా (41 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. కరుణ్ నాయర్ (31) మరోసారి విఫలమయ్యాడు. క్రిస్ వోక్స్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత్ మూడు మార్పులు చేసింది. బుమ్రాకు విశ్రాంతినివ్వగా.. సాయి సుదర్శన్, శార్దూల్ ఠాకూర్‌పై వేటు వేశారు. వారి స్థానాల్లో వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్‌తోపాటు పేసర్ ఆకాశ్‌దీప్‌కు తుది జట్టులో చోటు దక్కింది. ఇంగ్లండ్ మాజీ ఆటగాడు వేన్ లార్కిన్స్ మృతికి సంతాపంగా నల్లరిబ్బన్లు ధరించారు.

చెలరేగిన జైస్వాల్..: ఇంగ్లండ్ బౌలర్లు జైస్వాల్‌ను తీవ్రంగా పరీక్షించినా.. అతడు మాత్రం ఓపిగ్గా క్రీజులో నిలదొక్కుకొనేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో జైస్వాల్‌ను దాదాపుగా వికెట్ల ముందు దొరకబుచ్చుకొన్నాడు. కానీ, రివ్యూలో అంపైర్ కాల్ కావడంతో జైస్వాల్ ఊపిరిపీల్చుకొన్నాడు. కానీ, మరో ఓపెనర్ రాహుల్ (2) దారుణంగా విఫలమయ్యాడు. 26 బంతులాడిన రాహుల్.. వోక్స్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. అనంతరం వన్‌డౌన్‌లో వచ్చిన కరుణ్ నాయర్.. జైస్వాల్‌కు సహకారం అందించాడు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 80 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. క్రమంగా గేరు మార్చిన జైస్వాల్ బౌండ్రీతో ఫిఫ్టీ మార్క్‌కు చేరుకొన్నాడు. కానీ, లంచ్‌కు ముందు నాయర్‌ను షార్ట్‌పిచ్ బాల్‌తో అవుట్ చేసిన కార్స్.. జట్టుకు కావల్సిన బ్రేక్‌ను అందించాడు. దీంతో తొలి సెషన్‌లో భారత్ 98/2తో నిలిచింది.

దెబ్బకొట్టిన స్టోక్స్..: రెండో సెషన్‌లో కీలక జైస్వాల్‌ను అవుట్ చేసిన ఇంగ్లండ్ దెబ్బకొట్టినా.. గిల్, పంత్ మరిన్ని వికెట్లు చేజారకుండా కాచుకొన్నారు. ఆరంభంలో జైస్వాల్, కెప్టెన్ గిల్.. ఇంగ్లండ్ బౌలర్ల సహనాన్ని పరీక్షించారు. ఎక్కువగా స్ట్రయిక్ రొటేట్ చేస్తూ స్కోరు బోర్డును నడిపించారు. 34వ ఓవర్‌లో ఎల్బీ అప్పీలు నుంచి గిల్ తప్పించుకొన్నాడు. అయితే, మరోసారి బౌలింగ్‌కు దిగిన స్టోక్స్ జట్టుకు కావల్సిన బ్రేక్‌ను అందించాడు. ఆఫ్ స్టంప్‌కు దూరంగా వేసిన షార్ట్‌బాల్‌ను గట్టిగా బాదే ప్రయత్నంలో జైస్వాల్ బ్యాట్ ఎడ్జ్ తీసుకొంది. దీంతో మూడో వికెట్‌కు 66 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ దశలో క్రీజులోకి వచ్చిన రిషబ్ పంత్ (25).. బషీర్‌పై విరుచుపడే ప్రయత్నం చేశాడు. కానీ, ఆ తర్వాత కొంత నిగ్రహం చూపించిన పంత్.. గిల్‌తో కలసి ఆచితూచి ఆడుతూ వికెట్లు చేజారకుండా చూడడంతో.. భారత్ 182/3తో టీకి వెళ్లింది.

ఒక్క సెషన్‌లోనే 128/2..: పంత్, నితీశ్ కుమార్ (1)ను వెంటవెంటనే కోల్పోయినా.. గిల్, జడేజా జోరుతో ఒక్క మూడో సెషన్‌లోనే భారత్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ ఒక్క సెషన్‌లోనే ఏకంగా 128 పరుగులు జోడించడం విశేషం. తిరిగి వచ్చిన తర్వాత రెండు బౌండ్రీలు బాదిన గిల్ తనదైన శైలిలో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకోగా.. పంత్ ఫోర్‌తో జట్టు స్కోరును 200 మార్క్ దాటించాడు. కానీ, బషీర్‌పై ఎదురుదాడి చేసే ప్రయత్నంలో పంత్ క్యాచవుట్ కావడంతో.. నాలుగో వికెట్‌కు 47 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన నితీశ్‌ను వోక్స్ బౌల్డ్ చేయడంతో 211/5తో భారత్ కష్టాల్లో పడినట్టు కనిపించింది. అనంతరం క్రీజులోకి వచ్చిన జడేజా జాగ్రత్తగా ఆడుతూ గిల్‌కు అండగా నిలిచాడు. ఈ క్రమంలో గిల్ బౌండ్రీతో సెంచరీ మార్క్‌ను అందుకొన్నాడు. అనంతరం బ్యాట్‌కు పని చెప్పడంతో భారత్ స్కోరు 300 దాటింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) స్మిత్ (బి) స్టోక్స్ 87, రాహుల్ (బి) వోక్స్ 2, కరుణ్ నాయర్ (సి) బ్రూక్ (బి) కార్స్ 31, గిల్ (బ్యాటింగ్) 114, పంత్ (సి) క్రాలే (బి) బషీర్ 25, నితీశ్ (బి) వోక్స్ 1, జడేజా (బ్యాటింగ్) 41; ఎక్స్‌ట్రాలు: 9; **మొత్తం: 85 ఓవర్లలో 310/5; వికెట్ల పతనం:** 1-15, 2-95, 3-161, 4-208, 5-211; **బౌలింగ్:** వోక్స్ 21-6-59-2, కార్స్ 16-2-49-1, టంగ్ 13-0-66-0, స్టోక్స్ 15-0-58-1, బషీర్ 19-0-65-1, రూట్ 1-0-8-0.

1 ఎడ్జ్‌బాస్టన్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన భారత ఓపెనర్‌గా జైస్వాల్ (87). 1974లో సుధీర్ నాయక్ (77) చేసిన స్కోరును జైస్వాల్ అధిగమించాడు. సునీల్ గవాస్కర్ (68), చటేశ్వర్ పుజార (66) మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నారు.

4 కెప్టెన్‌గా ఆడిన తొలి రెండు టెస్టుల్లోనే వరుసగా శతకాలు బాదిన నాలుగో భారత సారథిగా గిల్. విజయ్ హజారే, సునీల్ గవాస్కర్, విరాట్ కోహ్లీ ముందున్నారు.



జైస్వాల్ (87)

స్పోర్ట్స్

వైభవ్ ధనాధన్



- మూడో వన్డేలో భారత యువ జట్టు గెలుపు

నార్తాంప్టన్: యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ (31 బంతుల్లో 6 ఫోర్లు, 9 సిక్సర్లతో 86) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో మూడో వన్డేలో భారత్ అండర్-19 జట్టు 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్ అండర్-19 జట్టుపై గెలిచింది. వర్షం కారణంగా ఆలస్యంగా మొదలైన ఈ మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించారు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. కనిష్క చౌహాన్ (3/30) ధాటికి 40 ఓవర్లలో 268/6 స్కోరు చేసింది. కెప్టెన్ థామస్ రే (76 నాటౌట్), ఓపెనర్ డాకిన్స్ (62) అర్ధ సెంచరీలు చేశారు. ఛేదనలో ఓపెనర్ వైభవ్‌కు తోడు విహాన్ (46), కనిష్క (43 నాటౌట్) సత్తా చాటడంతో భారత జట్టు 34.3 ఓవర్లలోనే 274/6 స్కోరు చేసి గెలిచింది. దీంతో ఐదు వన్డేల ఈ సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యంలో నిలిచింది. తొలి వన్డేలో భారత్, రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ గెలిచాయి.

రెండోదీ మనదే

24 రన్స్‌తో భారత్ గెలుపు
ఇంగ్లండ్‌తో టీ 20

బ్రిస్టల్: అమన్‌జోత్ కౌర్ (63 నాటౌట్), జెమీమా రోడ్రిగ్స్ (63) అర్ధ శతకాలు నమోదు చేయడంతో.. ఇంగ్లండ్‌పై భారత మహిళల జట్టు వరుసగా రెండో విజయాన్ని సాధించింది. మంగళవారం రాత్రి జరిగిన రెండో టీ20లో భారత్ 24 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌పై గెలిచింది. తొలుత భారత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 181 పరుగులు చేసింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (3), స్మృతి మంధాన (13)తోపాటు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (1) విఫలమయ్యారు. అయితే, జెమీమా, అమన్ నాలుగో వికెట్‌కు 93 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. ఛేదనలో ఇంగ్లండ్ ఓవర్లన్నీ ఆడి 157/7 స్కోరు మాత్రమే చేసింది. శ్రీచరణి రెండు వికెట్లు పడగొట్టింది.

భారత్: 20 ఓవర్లలో 181/4 (అమన్‌జోత్ 63 నాటౌట్, జెమీమా 63; బెల్ 2/17).
ఇంగ్లండ్: 20 ఓవర్లలో 157/7 (బ్యూమాంట్ 54, ఎకెల్‌స్టోన్ 35; శ్రీచరణి 2/28).

గాఫ్‌కు ఝలక్



దయానా చేతిలో ఓటమి

- మూడోరౌండ్‌కు సబలెంక, అల్కారజ్
- జొకోవిచ్ బోణీ ● వింబుల్డన్

లండన్: వింబుల్డన్‌లో ఊహించని షాక్. ఇటీవలే ఫ్రెంచ్ ఓపెన్ నెగ్గి సమరోత్సాహంతో ఉన్న మహిళల రెండోసీడ్ కొకొ గాఫ్ అనూహ్యంగా తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. ఈ అమెరికా స్టార్‌కు ఉక్రెయిన్ భామ దయానా యాస్ట్రెమ్‌స్కా ఝలకిచ్చింది. ప్రపంచ 46వ ర్యాంకరైన 25 ఏళ్ల దయానా 7-6 (7-3), 6-1తో ప్రపంచ నెంబర్ 2 గాఫ్‌ను కంగుతినిపించి రెండోరౌండ్‌కు చేరింది. 21 ఏళ్ల గాఫ్.. ఓ గ్రాండ్‌స్లామ్‌లో మొదటి రౌండ్లోనే ఓడడం 2023 తర్వాత ఇదే మొదటిసారి. మరోవైపు టాప్‌సీడ్ సబలెంక 7-6(7-4), 6-4తో మేరీ బౌజ్కోవాపై గెలిచి మూడోరౌండ్ చేరింది. 6వ సీడ్ మాడిసన్ కీస్ 6-4, 6-2తో డానిలోవిచ్ నెగ్గింది. చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రా క్విటోవాకు తానాడిన చివరి వింబుల్డన్‌లో నిరాశే ఎదురైంది. తొలిరౌండ్లోనే ఓటమిపాలైంది.

గట్టెక్కిన జొకో: పురుషుల సింగిల్స్‌లో 25వ గ్రాండ్‌స్లామ్ వేటలోనున్న సెర్బియా యోధుడు నొవాక్ జొకోవిచ్ తొలిరౌండ్‌ను అధిగమించాడు. ఆరోసీడ్ జొకోవిచ్ 6-1, 6-7(7-9), 6-2, 6-2తో ముల్లర్‌పై గెలిచాడు. ఇక ఫ్రెంచ్ ఓపెన్ విజేత, టాప్‌సీడ్ కార్లోస్ అల్కారజ్ 6-1, 6-4, 6-4తో టార్వెట్‌పై అలవోకగా నెగ్గి మూడో రౌండ్లో అడుగుపెట్టాడు. 14వ సీడ్ రుబ్లెవ్ 6-7(1-7), 6-4, 7-6(7-5), 6-3తో హారిస్‌ను ఓడించగా, స్థానిక ఆటగాడు నోరి 4-6, 6-4, 6-3, 7-5తో 12వ సీడ్ టియాఫోను రెండోరౌండ్లోనే ఇంటిబాట పట్టించాడు.

యుకీ జోడీ బోణీ: భారత డబుల్స్ ఆటగాడు యుకీ భాంబ్రీ శుభారంభం చేశాడు. డబుల్స్ తొలిరౌండ్లో 16వ సీడ్ యుకీ/రాబర్ట్ గాలోవే (అమెరికా) జోడీ 7-6(8), 6-4తో రొమైన్ (మొనాకో)/మాన్యుయెల్ (ఫ్రాన్స్)పై విజయం సాధించింది.

పంత్ కెరీర్ బెస్ట్ ర్యాంక్

దుబాయ్: రిషబ్ పంత్ ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా ఆరో స్థానానికి ఎగబాకాడు. బుధవారం విడుదల చేసిన టెస్ట్ ర్యాంకింగ్స్ బ్యాటర్ల విభాగంలో పంత్ ఒక మెట్టెక్కి ఆరో స్థానంలో నిలిచాడు. యశస్వి జైస్వాల్ నాలుగో ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. రూట్, బ్రూక్, కేన్ విలియమ్సన్ టాప్-3లో ఉన్నారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో బుమ్రా, ఆల్‌రౌండర్లలో జడేజా అగ్రస్థానాల్లో కొనసాగుతున్నారు.

ఫుట్‌బాల్ కోచ్ రాజీనామా

న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ పురుషుల జట్టు చీఫ్ కోచ్ మనోలో మార్క్వెజ్ రాజీనామా చేశాడు. స్పెయిన్‌కు చెందిన 56 ఏళ్ల మార్క్వెజ్ రెండేళ్ల కాంట్రాక్టు కింద గతేడాది జూన్‌లో భారత ప్రధాన కోచ్‌గా నియమితులయ్యాడు. కానీ, జట్టు వరుస ఓటముల దృష్ట్యా అతను మరో ఏడాది పదవీకాలం ఉండగానే తప్పుకొన్నాడు. మార్క్వెజ్ హయాంలో భారత్ ఎనిమిదింటిలో ఒకటే నెగ్గింది.

అథ్లెట్ల నిషేధం కుదింపు

న్యూఢిల్లీ: డోప్ పరీక్షలకు గైర్హాజరై నాలుగేళ్ల నిషేధానికి గురైన తెలుగమ్మాయి చెలిమి ప్రత్యూష, పూజా రాణి, కిరణ్, పంకజ్‌లకు కాస్త ఊరట దక్కింది. వీరి సస్పెన్షన్‌ను 4 నుంచి మూడేళ్లకు కుదిస్తున్నట్టు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) ప్రకటించింది. నిబంధనల ప్రకారం తమపై చర్యలు తీసుకున్న 20 రోజుల్లోపు అథ్లెట్లు తప్పిదాన్ని అంగీకరించడంతో ఈ నిర్ణయాన్ని తీసుకుంది.


శ్రీలంక ఘనవిజయం

అసలంక శతకం

కొలంబో: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి వన్డేలో శ్రీలంక 77 పరుగులతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.2 ఓవర్లలో 244 పరుగులకు ఆలౌటైంది. చరిత్ అసలంక సెంచరీ (106) సాధించగా, కుశాల్ మెండిస్ (45) ఫర్వాలేదనిపించాడు. టస్కిన్‌కు 4, తన్జిమ్‌కు 3 వికెట్లు లభించాయి. ఛేదనలో బంగ్లాదేశ్ 35.5 ఓవర్లలో 167 పరుగులకే కుప్పకూలింది. హసరంగకు 4, కమిందు మెండిస్‌కు 3 వికెట్లు దక్కాయి. తన్జిద్ హసన్ 62, జాకెర్ అలీ 51 పరుగులతో రాణించారు. ఈ రెండు జట్ల మధ్య రెండో వన్డే శనివారం జరుగుతుంది.

జ్యోతికి గాయం

వరల్డ్ చాంపియన్‌షిప్ అవకాశాలు దూరం!



న్యూఢిల్లీ: ఆసియా చాంపియన్, తెలుగు అథ్లెట్ యర్రాజి జ్యోతి మోకాలి గాయానికి గురైంది. సాధన చేస్తున్న సమయంలో తన మోకాలికి గాయమైందని జ్యోతి బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు గ్రహీత అయిన 25 ఏళ్ల జ్యోతి.. ప్రస్తుతం ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించడమే లక్ష్యంగా కఠోరంగా శ్రమిస్తోంది. ఈ పరిస్థితుల్లో ఆమె గాయానికి గురవడం ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత పతక అవకాశాలకు గండి పడినట్టే. ప్రపంచ టోర్నీ సెప్టెంబరు 13 నుంచి 21 వరకు టోక్యోలో జరగనుంది. జ్యోతి ప్రస్తుత గాయానికి సర్జరీ చేయాల్సిన అవసరముందని భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) వర్గాలు వెల్లడించాయి. ప్రపంచ చాంపియన్‌షిప్‌నకు అర్హత సాధించాలంటే 12.73 సెకన్ల టైమింగ్‌ను జ్యోతి అందుకోవాల్సి ఉంది. అలా కాకుండా ర్యాంకింగ్స్ ప్రకారం నేరుగా టోర్నీలో తలపడాలంటే జ్యోతి.. ప్రస్తుతం తన 12వ ర్యాంక్‌ను క్వాలిఫికేషన్స్‌కు కటాఫ్ తేదీ అయిన ఆగస్టు 24 దాకా కాపాడుకోవాలి.



బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావును సన్మానిస్తున్న బార్ కౌన్సిల్ సభ్యులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి బార్ కౌన్సిల్ సన్మానం

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గతంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా పనిచేసి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన ఎన్ రామచంద్రరావును రాష్ట్ర బార్ కౌన్సిల్ బుధవారం సన్మానించింది. హైకోర్టులోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో కౌన్సిల్ ఛైర్మన్ నర్సింహారెడ్డి, వైస్ ఛైర్మన్ సునీల్‌గౌడ్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

మైనార్టీలపై దాడులు పెరుగుతున్నా యూపీ సర్కారు మౌనమెందుకు?

- మజ్లిస్ చీఫ్ అసదుద్దీన్ ఒవైసీ నిలదీత

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో మైనార్టీ వర్గాలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు పెచ్చుమీరుతున్నాయని మజ్లిస్ పార్టీ చీఫ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. కన్వర్ యాత్ర సందర్భంగా ముజఫర్‌నగర్ ప్రాంతంలోని హోటళ్ల సిబ్బందిని అల్లరిమూకలు వేధింపులకు గురి చేస్తున్నాయన్నారు. 'ముజఫర్‌నగర్ సమీపంలో హోటళ్లలోని సిబ్బంది మతాన్ని నిరూపించుకునేందుకు ఆధార్ కార్డులు చూపాలని.. లేని పక్షంలో ప్యాంట్ విప్పాలని దుర్మార్గంగా వ్యవహరించే అల్లరిమూకలను పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. భారతీయ సనాతన్ సురక్ష దళ్ అనే స్వయం ప్రకటిత సంస్థకు చెందిన ఓ గ్రూప్ మైనార్టీలను లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దౌర్జన్యాలకు పాల్పడుతోంది. కన్వర్ యాత్ర మార్గాల్లో దుకాణదారులు తమ పేర్లను ప్రదర్శించాలన్న యూపీ సర్కారు ఆదేశాన్ని గతంలోనే సుప్రీంకోర్టు నిలిపేస్తూ ఆదేశాలిచ్చింది' అని వ్యాఖ్యానించారు.

బనకచర్లకు బీఆర్ఎస్ రాజకీయ రంగు

- కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు
- సీమకు నీరిస్తామన్న కేసీఆర్ మాటలు మరిచిపోయారా..?: ఏపీ మంత్రి పయ్యావుల



అనంతపురం, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు నడుస్తోంది. ఆ కారణంగానే బనకచర్ల ప్రాజెక్టుకు రాజకీయ రంగు పులుముతున్నారు' అని ఏపీ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు. సముద్రంలోకి వెళ్లే జలాలను వాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. కేటీఆర్, హరీశ్‌రావు మధ్య ఉన్న అస్తిత్వ పోరుకు రాజకీయ రంగు పులిమి, ఇదేదో ప్రాంతాల మధ్య సమస్య అన్నట్లు మాట్లాడటం బాధాకరం. రాయలసీమను రతనాల సీమను చేస్తానని చెప్పిన కేసీఆర్ మాటలు హరీశ్‌రావుకు గుర్తుకు రాలేదా? ఆయన తన అస్తిత్వాన్ని కోల్పోతున్న క్రమంలో, సొంత పార్టీలో తనను తాను నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగానే బనకచర్ల ప్రాజెక్టు అంశాన్ని లేవనెత్తారు. కేటీఆర్ ఎక్కడా బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడలేదు. హరీశ్‌రావు ట్రాప్‌లో పడి, ఆ పార్టీ మిగతా నేతలు బనకచర్లపై మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారే తప్ప, దాని మూలంగా తెలంగాణకు నష్టం ఉండదని వారికీ తెలుసు. తెలంగాణ బాగుండాలని మేము కోరుకుంటున్నాం. ఆ రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టులు కట్టినా సంతోషాన్ని వ్యక్తం చేశాం. మొన్నటి దాకా కలిసున్న వాళ్లమే కదా..! ఇదంతా పొలిటికల్ డ్రామా' అని పయ్యావుల అన్నారు.

నేడు ఏసీబీ విచారణకు అరవింద్ కుమార్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ కారు రేసు కేసుకు ముగింపు పలకడానికి ఏసీబీ అధికారులు తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. ఈ కేసులో ఏ2గా ఉన్న ఐఏఎస్ అరవింద్ కుమార్‌ను గురువారం ఉదయం 11.30 గంటలకు విచారణకు రావాలంటూ ఏసీబీ అధికారులు బుధవారం నోటీసు జారీ చేశారు. వాస్తవానికి అరవింద్ కుమార్ 1వ తేదీన ఏసీబీ ముందు విచారణకు హాజరుకావాల్సి ఉండగా, తనకు కొంత సమయం కావాలని ఆయన ఏసీబీని కోరారు. దీంతో ఏసీబీ తాజా నోటీసు జారీ చేసింది. ఇటీవల జరిగిన విచారణలో కేటీఆర్ పేర్కొన్న అంశాలకు సంబంధించి తాజాగా అరవింద్ కుమార్‌ను ప్రశ్నించి ఈ కేసులో చార్జిషీట్ దాఖలు చేయడానికి ఏసీబీ సిద్ధమైనట్లు తెలుస్తోంది.

బనకచర్లపై మాట్లాడేందుకు సిద్ధం: వాకిటి

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): బనకచర్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన ప్రభుత్వం.. వారంలో కృష్ణా జలాలపైనా ఇవ్వనుందని మంత్రి వాకిటి శ్రీహరి వెల్లడించారు. బనకచర్లపై ఎక్కడైనా మాట్లాడేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలో హరీశ్‌రావు తడబడుతున్నట్లుగా స్పష్టంగా తెలుస్తోందన్నారు. గాంధీభవన్‌లో మంత్రితో ముఖాముఖీ కార్యక్రమంలో భాగంగా బుధవారం నాడు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 90కి పైగా వినతులు వచ్చాయని శ్రీహరి తెలిపారు. ఎక్కువగా ధరణి బాధితులే ఉన్నారన్నారు. ఒక పేదవాడు తన సమస్య పరిష్కారం కోసం నేరుగా మంత్రిని కలిసి విన్నవించే సంస్కృతిని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే చూస్తున్నామన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష నియామకం ద్వారా బీసీల పట్ల ఆ పార్టీ వైఖరి ఏంటో మరోమారు తేటతెల్లమైందన్నారు. ఇక బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. రైల్ రోకో కార్యక్రమం చేపట్టే ముందు.. ఆమె పార్టీలో బీసీలకు కీలక పదవి గురించి ఆలోచిస్తే మంచిదన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రెసిడెంట్ లేదా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీలకు ఇవ్వాలని మంత్రి సూచించారు. s

ఫార్మాసిటీ భూముల్లో కాంగ్రెస్ నేతల దోపిడీ

- రైతన్నల ఇండ్ల స్థలాలూ వదల్లేదు: కేటీఆర్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ ఫార్మాసిటీ భూముల్లో కాంగ్రెస్‌పార్టీ నేతలు దోపిడీకి పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫార్మాసిటీ భూములపై కాంగ్రెస్ నేతలు గద్దల్లా వాలి దోచుకుంటున్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలోతొక్కిన ముఖ్యమంత్రి.. తమపార్టీ నేతలతో కలిసి ఫార్మాసిటీ భూములను కొట్టేస్తున్నారని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఫార్మాసిటీ కోసం భూములిచ్చిన రైతన్నలకు నష్టపరిహారంగా కేటాయించిన ఇండ్ల స్థలాలను కాంగ్రెస్‌నేతలు తమ పేర్లపై అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో గెలవగానే ఫార్మాసిటీ ప్రాజెక్టును రద్దుచేసి, భూములను రైతన్నలకు తిరిగి ఇస్తామన్న హామీ ఏమైంది? అంటూ సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రైతులకు నష్టపరిహారంగా దక్కాల్సినదాన్ని కాంగ్రెస్ నేతలు ఎందుకు దోచుకుంటున్నారని నిలదీశారు.

తెలంగాణలో చంద్రబాబు కోవర్టులు

- పెద్ద కాంట్రాక్టులన్నీ వాళ్లకే: అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో చంద్రబాబుకు కోవర్టులు ఉన్నారని, వాళ్లే పెద్ద, పెద్ద కాంట్రాక్టులన్నీ చేపడుతున్నారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం ఆపాలంటే లేఖలు రాస్తే సరిపోదని, కోవర్ట్ కాంట్రాక్టర్లను కట్టడి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఆయన సూచించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం మోతీఘనపూర్‌లో ముడా నిధులతో నిర్మించే పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. హైదరాబాద్‌లో దందాలు కూడా చంద్రబాబు కోవర్టులే చేస్తున్నారని, వారికి నల్లా, కరెంటు కనెక్షన్లు కట్ చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులలో ఒక్క రూపాయి కూడా రాకుండా చూడాలన్నారు. ఇలా చేస్తే వారంతా చంద్రబాబు వద్దకు వెళ్లి బనకచర్లను బంద్ చేయిస్తారని చెప్పారు.

రేపు గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళన సభ

- ఖర్గే ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో నిర్వహణ
- జై బాపూ, జై భీమ్ కార్యక్రమంలో భాగంగా తొలిసభ రాష్ట్రంలోనే

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) తీసుకున్న జై బాపూ, జై భీమ్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్బీ స్టేడియంలో టీపీసీసీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళనం జరగనుంది. ఈ సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ గ్రామ కమిటీల అధ్యక్షులు హాజరు కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ముఖ్యఅతిథిగా పాల్గొని.. జై బాపూ, జై భీమ్ కార్యక్రమానికి సంబంధించి గ్రామ కమిటీల అధ్యక్షులకు దిశానిర్దేశం చేస్తారు. ఈ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ ముఖ్యనేతలు పాల్గొంటారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ గ్రామకమిటీల అధ్యక్షులతో ఈ మేరకు సమ్మేళన సభలను నిర్వహించాలని ఏఐసీసీ భావిస్తోంది. తొలి సభను తెలంగాణలో నిర్వహిస్తోంది. భవిష్యత్తులో ఇతర రాష్ట్రాల్లోనూ నిర్వహించనుంది. గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళన సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్, మహేశ్ కుమార్‌గౌడ్ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. గ్రామ కమిటీల అధ్యక్షులను సభకు తరలించే బాధ్యతలను మంత్రులు, ఇతర ముఖ్యనాయకులకు అప్పగించారు. ప్రతి నియోజకవర్గం నుంచి కనీసంగా 500 మంది గ్రామ శాఖల అధ్యక్షులను సభకు తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. బుధవారం సభా ప్రాంగణంలో ఏర్పాట్లను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మహేశ్‌గౌడ్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం, పొంగులేటి పరిశీలించారు. కాగా సమ్మేళన సభలో పాల్గొనేందుకు.. ఒకరోజు ముందుగానే ఖర్గే రానున్నారు. గురువారం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీ నుంచి ఫ్లైట్‌లో హైదరాబాద్‌కు చేరుకుంటారు. ఇక్కడి ఓ హోటల్‌లో బస చేయనున్నారు. శుక్రవారం ఉదయం గాంధీభవన్‌లో జరిగే టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొంటారు. అనంతరం జరిగే టీపీసీసీ విస్తృత సమావేశంలోనూ పాల్గొని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. ఆ తర్వాత ఎల్బీ స్టేడియంలో జరిగే సమ్మేళన సభకు హాజరవుతారు. కాగా ఎల్బీ స్టేడియంలో జరగనున్న సభను విజయవంతం చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.



గ్రామ కమిటీల అధ్యక్షుల సమ్మేళన సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి దుద్దిళ్ల, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్

జిన్‌పింగ్ శకం ముగిసిందా?

కొన్నిరోజులుగా అధికారిక కార్యక్రమాల్లో కనిపించని చైనా అధినేత.. ప్రభుత్వ మీడియాలోనూ మాయం

- తెర వెనుక మాజీ అధ్యక్షుడు జింటావో
- జనరల్ ఝాంగ్ యూక్సియాకి పగ్గాలు!



వాషింగ్టన్, జూలై 2: చైనాలో గత 12 ఏళ్లగా తిరుగులేని నాయకుడిగా ఉన్న షీ జిన్‌పింగ్ తన ప్రాభవం కోల్పోతున్నారా? అధికారాలు క్రమంగా ఆయన చేజారుతున్నాయా? తాజా పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తోందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బ్రెజిల్‌లోని రియోడీజెనిరోలో ఈ నెల 5-8 తేదీల మధ్య జరిగే 17వ బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరు కావటం లేదని, ఆయన బదులుగా ప్రధాని లీ క్వియాంగ్ హాజరవుతారని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి బుధవారం మీడియాకు వెల్లడించారు. జిన్‌పింగ్ రాకపోవటానికి కారణాలేమిటన్న విలేకర్ల ప్రశ్నలకు ఆమె స్పందించలేదు. జిన్‌పింగ్ 2013లో చైనా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ప్రతి ఏటా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరవుతూ వచ్చారు. ఈసారి మాత్రమే ఆయన గైర్హాజరు అవుతున్నారు. అంతే కాదు, కొన్ని రోజులుగా జిన్‌పింగ్ చైనాలో బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. దాదాపు ప్రతి రోజూ మొదటిపేజీలో జిన్‌పింగ్ ఫొటోలతో వార్తలు ప్రచురించే ప్రభుత్వ పత్రిక పీపుల్స్ డైలీలో ఈ మధ్య ఆయన వార్తలుగానీ, ఫొటోలుగానీ కనిపించటం లేదు. చైనాకు వస్తున్న విదేశాల అధినేతలకు, ప్రతినిధులకు చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ)కి చెందిన సీనియర్ నేతలు ఆతిథ్యం ఇస్తున్నారే తప్ప జిన్‌పింగ్ జాడ లేదు. జూన్ తొలివారంలో.. చైనాకు బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో వచ్చినప్పుడు ఆయనతో జిన్‌పింగ్ సమావేశయ్యారు కానీ, ఈ తరహా ద్వైపాక్షిక సమావేశాల సందర్భంగా కనిపించే ఆర్భాటం మచ్చుకైనా లేదు. ఈ సమావేశంపై బెలారస్ అధ్యక్ష ప్రెస్ సర్వీస్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సదరు భేటీలో జిన్‌పింగ్ అలసటతో ఉన్నట్లుగా కనిపించారని తెలిపింది. ఇటీవల జిన్‌పింగ్ వ్యక్తిగత భద్రత సిబ్బందిని సగానికి తగ్గించారు. ఆయన తండ్రి స్మారకస్థలానికి ఇప్పటి వరకూ ఉన్న అధికారిక హోదాను తొలగించారు. అంతేకాదు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జిన్‌పింగ్ ఫోన్‌లో సంభాషించారన్న వార్తను చైనా ప్రభుత్వ టీవీ ఇటీవల ప్రసారం చేస్తూ.. జిన్‌పింగ్ పేరు ముందు ఎటువంటి హోదాను పేర్కొనకపోవటం విశేషం. ఇవన్నీ చూసి, చైనాలో ఏదో జరుగుతోందని విశ్లేషకులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. జిన్‌పింగ్‌ను పేరుకే అధ్యక్షుడిగా కొనసాగిస్తున్నప్పటికీ.. అధికారాలు ఆయన చేతుల్లో లేకపోవచ్చని చెబుతున్నారు. సర్వాధికారాలు చెలాయించిన వారిని నిశ్శబ్దంగా పక్కనపెట్టి, వారి స్థానంలో మరొకరిని తీసుకొచ్చే సంప్రదాయం చైనా కమ్యూనిస్టు పార్టీలో ముందునుంచీ ఉంది. ప్రస్తుతం జిన్‌పింగ్ విషయంలో అదే జరుగుతున్నట్లు ఉండవచ్చని విశ్లేషకుల అంచనా.

పగ్గాలు ఎవరికి?

ఈ నేపథ్యంలోనే, జిన్‌పింగ్ స్థానంలో పగ్గాలు చేపట్టేదెవరు అన్న దానిపైనా ఊహాగానాలు నడుస్తున్నాయి. చైనాలో అత్యంత శక్తిమంతమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్‌లో ఫస్ట్ వైస్ ఛైర్మన్‌గా ఉన్న జనరల్ ఝాంగ్ యూక్సియా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం అత్యున్నత అధికారాలన్నీ ఆయన చేతుల్లోనే ఉన్నాయని అంటున్నారు. ఆయనకు కమ్యూనిస్టు పార్టీలోని సీనియర్లు, మాజీ అధ్యక్షుడు హ్యూ జింటావో వర్గం మద్దతిస్తోందని సమాచారం. 2022లో సీపీసీ మహాసభల నుంచి జింటావోను(ఆయన ఆరోగ్యం బాగా లేదనే సాకుతో) అవమానకర రీతిలో బయటకు పంపించివేశారు. బహిరంగంగా జరిగిన ఈ ఘటనను యావత్ ప్రపంచం చూసింది. పార్టీలో, ప్రభుత్వంలో తన ఏకఛత్రాధిపత్యం కోసమే జిన్‌పింగ్ ఈ పని చేయించారని అప్పట్లో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు అదే జింటావో చక్రం తిప్పుతున్నారని, జిన్‌పింగ్‌ను పక్కకు తప్పించే వ్యూహం ఆయనదేనని విశ్లేషకులు భావిస్తున్నారు. సైన్యంలో జిన్‌పింగ్‌కు మద్దతుదారులుగా ఉన్న పలువురు జనరల్స్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పిస్తున్నారని, కొందరినైతే రహస్యంగా చంపేస్తున్నారన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఇక, జిన్‌పింగ్ వారసుడిగా వినిపిస్తున్న మరో పేరు వాంగ్ యాంగ్. చైనాలో మావో అనంతరం ఆ దేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన డెంగ్ జియావో పింగ్ ప్రోత్సాహంతో వాంగ్ యాంగ్ రాజకీయాల్లోకి వచ్చారు. సాంకేతిక నిపుణుడిగా, మార్కెట్ ఆధారిత సంస్కరణలకు మొగ్గు చూపేవాడిగా, వివాద రహితుడిగా ఆయనకు పేరుంది.

పెరుగుతున్న నిరుద్యోగం

చైనాలో నిరుద్యోగం భారీగా పెరుగుతోంది. స్థిరాస్తి రంగం స్తబ్దుగా ఉంది. విదేశీ రుణం 50 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. జీవన ప్రమాణాలు పడిపోవటంతో ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిపోతోంది. పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఫ్యాక్టరీలను ధ్వంసం చేయటం, కొల్లగొట్టటం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే, జిన్‌పింగ్‌ను పక్కనపెట్టటం ద్వారా ప్రజాగ్రహాన్ని చల్లార్చాలని సీపీసీ ప్రయత్నిస్తోందా? కొత్త నాయకుడు చైనా పగ్గాలు చేపట్టనున్నారా?.. ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

జూన్‌లో తగ్గిన రిజిస్ట్రేషన్ల ఆదాయం

- గత ఏడాదితో పోలిస్తే 20 కోట్లు తక్కువ
- గ్రేటర్ లోనూ తగ్గిన రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు జూన్ నెలలో ఆదాయం తగ్గింది. గత ఏడాది జూన్ నెలతో పోలిస్తే.. ఈ ఏడాది జూన్‌లో రాష్ట్రవ్యాప్తంగా రూ.20 కోట్ల మేర ఆదాయం తగ్గిపోయింది. 2024 జూన్‌లో 1.03 లక్షల డాక్యుమెంట్లు రిజిస్టర్ అవ్వగా.. ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్ల మేర ఆదాయం వచ్చింది. ఈ ఏడాది జూన్‌లో డాక్యుమెంట్ల సంఖ్య 94 వేలకు పడిపోగా.. ఆదాయం రూ.980 కోట్లుగా నమోదైంది. గత ఏడాది మే నెలలో పార్లమెంట్ ఎన్నికలు రావడంతో.. చాలా మంది వినియోగదారులు రిజిస్ట్రేషన్లను జూన్‌కి వాయిదా వేసుకోవడం వల్ల.. డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ సంఖ్య, ఆదాయం పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది అదనంగా జరిగిన రిజిస్ట్రేషన్ల కారణంగా ఆదాయం పెరిగిందని, ఆ కారణంగా ఈ ఏడాది ఆదాయం తగ్గినట్లు కనిపిస్తోందని పేర్కొంటున్నారు.

జీహెచ్ఎంసీ పరిధిలో..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 4 జిల్లాల్లో రిజిస్ట్రేషన్ల సంఖ్యను పరిశీలిస్తే రంగారెడ్డిని మినహాయిస్తే మిగతా మూడు జిల్లాల్లో రిజిస్ట్రేన్ల సంఖ్య, ఆదాయం తగ్గింది. హైదరాబాద్ జిల్లాలో గత ఏడాది జూన్ కన్నా ఈ ఏడాది జూన్‌లో 500, మేడ్చల్-మల్కాజిగిరిలో 1,500, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో వెయ్యి చొప్పున రిజిస్ట్రేషన్లు తగ్గాయి. ఆదాయం విషయానికి వస్తే హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో చెరో రూ.30కోట్ల చొప్పున.. సంగారెడ్డి జిల్లాలో రూ.40కోట్ల మేర తగ్గింది. రంగారెడ్డి జిల్లాలో మాత్రం గత ఏడాది జూన్ కంటే ఈ ఏడాది జూన్‌లో రూ.120కోట్ల మేర ఆదాయం పెరిగింది. బుద్వేల్‌లోని హెచ్ఎండీఏ ప్లాట్ల వేలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు జూన్ నెలలో అధికంగా జరగడమే రంగారెడ్డి జిల్లాలో ఆదాయం పెరగడానికి ప్రధాన కారణమని తెలుస్తోంది.

గ్రూప్-1 మూల్యాంకనంలో ఎలాంటి లోపాల్లేవు

- పారదర్శకంగా మెయిన్స్ :టీజీపీఎస్సీ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ సమాధాన పత్రాల మూల్యాంకనంలో ఎలాంటి లోపాలు జరగలేదని టీజీపీఎస్సీ హైకోర్టుకు తెలియజేసింది. అంతేకాక మెయిన్స్ పరీక్షను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని వివరించింది. గ్రూప్-1 మెయిన్స్ అభ్యర్థులకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనం, అభ్యర్థులకు పరీక్ష కేంద్రాల కేటాయింపులో అక్రమాలు, తుది అభ్యర్థుల సంఖ్యలో తేడాలు ఉన్నాయని పేర్కొంటూ హైకోర్టులో గతంలో పిటిషన్లు దాఖలైన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ కొనసాగించగా.. టీజీపీఎస్సీ తరపున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. సమాధాన పత్రాల మూల్యాంకనం మూడు దశల్లో సాగుతుందని ఆయన ధర్మాసనానికి తెలిపారు. తొలుత ఒక ఇవాల్యుయేటర్ మూల్యాంకనం చేసిన పత్రం ఆ తర్వాత మరో ఇవాల్యుయేటర్ వద్దకు వెళుతుందని చెప్పారు. ఈ రెండు దశల్లో వచ్చిన మార్కుల్లో తేడా ఉండే ఆ సమాధన పత్రం మూడో ఇవాల్యుయేటర్ దగ్గరకు వెళ్తుందని పేర్కొన్నారు. తాము ఎవరి సమాధాన పత్రంను దిద్దుతున్నామనేది ఇవాల్యుయేటర్లకు తెలిసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. ఇక, ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్‌టికెట్లు ఎందుకు ఇచ్చారు అనే అంశంపై రచనా రెడ్డి అనే న్యాయవాది మాత్రమే పదే పదే అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇలా వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడం కొత్త విధానం కాదని.. పోలీస్ రిక్రూట్‌మెంట్, జూనియర్ సివిల్ జడ్జి ఎంపిక ప్రక్రియల్లో కూడా ఈ విధానం ఉందని ధర్మాసనానికి తెలియజేశారు. ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసే వీలు లేకుండా బయోమెట్రిక్ గుర్తింపు, నామినల్ రోల్స్ ఉంటాయని చెప్పారు. అంతకుముందు పిటిషనర్ల తరఫున న్యాయవాది రచనారెడ్డి వాదనలు కొనసాగిస్తూ.. టీజీపీఎస్సీ పారదర్శకతపై అనుమానం వ్యక్తం చేశారు. నియామక పత్రాలు ఇవ్వడంలో ఆలస్యం వల్ల ఇబ్బంది పడుతున్నామని కొంతమంది ఎంపికైన అభ్యర్థులు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. తదుపరి విచారణ గురువారానికి వాయిదా పడింది.

నకిలీ న్యాయవాదుల తొలగింపు

తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి న్యాయవాదులుగా ఎన్‌రోల్ అయిన 9 మంది పేర్లు తొలగిస్తూ బార్ కౌన్సిల్ చర్యలు తీసుకుంది. ఈ మేరకు ఆ వివరాలను వెల్లడించింది. సదరు న్యాయవాదులు సమర్పించిన విశ్వవిద్యాలయాల సర్టిఫికెట్లు నకిలీవని కౌన్సిల్‌కు నివేదికలు అందాయని పేర్కొంది. దీనిపై సదరు న్యాయవాదులకు నోటీసులు జారీ చేసి, విచారణ చేపట్టామని తెలిపింది. తెలంగాణ బార్ కౌన్సిల్ రూల్-42 ప్రకారం ఆ 9 మందిపై చర్యలు చేపట్టిందని వెల్లడించింది. వారి పేర్లను వెంటనే రాష్ట్ర బార్ కౌన్సిల్ జాబితా నుంచి తొలగించాలని కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బార్ కౌన్సిల్ కార్యదర్శి ..అజర్ శ్రావణ్ కుమార్, ఎం.సురేఖా రమణి, ఎన్.విద్యాసాగర్, పి.సిసిల్ లివింగ్స్టన్, సతీశ్ కనకట్ల, నరేశ్ సుంకర, రాజశేఖర్ చిలక, శ్రీశైలం.కె, ఎ.ఉదయ్ కిరణ్‌ను తొలగించారు.

దశలవారీగా రాజీవ్ స్వగృహ ఆస్తుల వేలం

నాలుగు దశల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ నిర్ణయం.. మొదటి దశలో ఫ్లాట్లు, రెండో దశలో అపార్టుమెంట్లు

- తర్వాతి దశలో ఓపెన్ ప్లాట్లు, నాలుగో దశలో భూములు
- ఫ్లాట్లలో చ.అడుగుకు రూ.2,250 నుంచి రూ.3వేలు ధర
- తొలి దశ వేలానికి రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్!

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్లు, ఫ్లాట్లను దశలవారీగా వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వేలం వేయనున్న ఆస్తుల వివరాలపై రెండు, మూడు రోజుల్లో ప్రకటనను విడుదల చేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. వేలం ప్రక్రియను నాలుగు దశల్లో పూర్తి చేయాలని సర్కారు భావిస్తున్నట్లు సమాచారం. ఏ దశలో ఏ ఆస్తులను వేలం వేయాలన్న వివరాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. తొలి దశలో మేడ్చల్ జిల్లాలోని అపార్ట్‌మెంట్లలో పూర్తయిన ఫ్లాట్లతో పాటు మరికొన్నిచోట్ల ఉన్న ఆస్తులను వేలం వేయనున్నారు. పోచారం, బండ్లగూడ, గాజులరామారం తదితర ప్రాంతాల్లోని ఆస్తులకు రేట్లను కూడా ఖరారు చేశారు. బండ్లగూడలో పూర్తయిన అపార్ట్‌మెంట్లలోని ఫ్లాట్లకు చదరపు అడుగుకు రూ.3వేలుగా, అసంపూర్తిగా ఉన్న వాటికి రూ.2,750గా ధర నిర్ణయించారు. పోచారంలో పూర్తయిన ఫ్లాట్‌లో చదరపు అడుగు రూ.2,500, అసంపూర్తి వాటికి రూ.2,250 చొప్పున ధరలను ఖరారు చేశారు. రాజీవ్ స్వగృహ ఆస్తుల వేలంతో ప్రభుత్వానికి దాదాపు రూ.3,538కోట్ల ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఎన్ని ఫ్లాట్లు ఉన్నాయి, ఎంత విస్తీర్ణం ఉందనే అన్ని వివరాలను ఇప్పటికే లెక్కతేల్చారు. నిధుల సమీకరణలో భాగంగా ఏర్పాటైన క్యాబినెట్ సబ్‌కమిటీ ఇటీవల హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌లో ఉన్న ఆస్తులను వేలం వేసేందుకు పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే. హౌసింగ్ బోర్డు పరిధిలోని ఆస్తులను ఇప్పటికే దశల వారీగా వేలం వేస్తుండగా.. తాజాగా రాజీవ్ స్వగృహ ఆస్తుల వేలానికి కూడా రంగం సిద్ధమైంది.

ఎక్కడెక్కడ ఎన్ని ఫ్లాట్లు

మేడ్చల్ జిల్లా పరిధిలోని పోచారం(సద్భావన)లో 601 ఫ్లాట్లున్నాయి. ఇక్కడ 2బీహెచ్‌కే డీలక్స్-2, 3బీహెచ్‌కే-4, 2బీహెచ్‌కే-340, సింగిల్ బెడ్ రూమ్, హాల్, కిచెన్-205 చొప్పున ఉండగా.. వీటిని వేలం వేస్తే రూ.99.50కోట్లు వస్తాయని అంచనా. ఇదే జిల్లా పరిధిలోని బండ్లగూడ (సహభావన టౌన్‌షిప్)లో 159 ఫ్లాట్లు ఉన్నాయి. వీటిలో 3బీహెచ్‌కే డీలక్స్-3, 3బీహెచ్‌కే-8, 2బీహెచ్‌కే-19, 1బీహెచ్‌కే-129 ఫ్లాట్లున్నాయి. వీటిని వేలం వేస్తే రూ.28.93 కోట్లు వస్తాయని భావిస్తున్నారు. ఇక రెండో దశలో నిర్మాణం పూర్తి కాని అపార్ట్‌మెంట్లను వేలం వేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని గాజులరామారంలో 5, పోచారంలో 6, జవహర్‌నగర్‌లో 17, ఖమ్మంలో పోలేపల్లి దగ్గర 8 అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. వీటి వేలంతో దాదాపు రూ.725.23కోట్ల వరకు ఆదాయం రావొచ్చని అంచనా వేస్తున్నారు. కామారెడ్డి, నల్లగొండ, వికారాబాద్ జిల్లాల్లో ఉన్న 367 ఇళ్లను కూడా మొదటి లేదా రెండో దశలో వేలం వేయనుండగా.. రూ.38.81కోట్ల వరకు ఆదాయం వస్తుందనే అంచనాతో అధికారులు ఉన్నారు.

భూముల వేలంతోనే రూ.2,043కోట్లు

ఇక, మూడో దశలో రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఓపెన్ ప్లాట్లను వేలం వేయాలని నిర్ణయించారు. రంగారెడ్డి జిల్లా తొర్రూరులో 514, కవాడిపల్లిలో40, కుర్మలగూడలో 20, చందానగర్‌లో 3, నిజామాబాద్ జిల్లాలోని మల్లారంలో 294, గాజులరామారంలో 12, బహదూర్‌పల్లిలో 69, మహబూబ్‌నగర్ జిల్లాలోని పోతులమడుగులో 111, అమిస్తాపూర్‌లో 45, ఆసిఫాబాద్ జిల్లాలోని బోరేగావ్‌లో 73, కామారెడ్డిలో 79, నల్లగొండ జిల్లా ఎల్లారెడ్డిగూడలో 52, వికారాబాద్ జిల్లా కోకట్‌లో 10, ఆదిలాబాద్ జిల్లా బట్టిసావర్‌గావ్‌లో 9, జోగులాంబ గద్వాల జిల్లాలోని గద్వాలలో 8, కరీంనగర్ జిల్లా నుస్తులాపూర్‌లో 3 ఓపెన్ ప్లాట్లు ఉన్నాయి. వీటని వేలం వేస్తే రూ.613.34 కోట్లు వస్తాయని అంచనా వేస్తున్నారు. నాలుగో దశలో కార్పొరేషన్ పరిధిలో ఉన్న భూములను వేలం వేయనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా నోటిఫికేషన్లను విడుదల చేయనున్నారు. మొత్తం భూముల్లో కొన్నిచోట్ల కోర్టు కేసులుండగా, మరి కొన్నిచోట్ల ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఈ భూముల వేలంతో దాదాపు రూ.2,043కోట్ల వరకు ఆదాయం వస్తుందని అంచనా.

కులాల వెనుకబాటుతనంపై ర్యాంకులు

- కుల గణనపై స్వతంత్ర కమిటీ అధ్యయనం పూర్తి
- వారంలో నివేదిక సిద్ధం.. సీఎం, డిప్యూటీ సీఎంలకు అందజేయనున్న స్వతంత్ర నిపుణుల కమిటీ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది నిర్వహించిన కులగణనలో ఆయా కులాల వెనుకబాటుపై ర్యాంకులిచ్చినట్లు స్వతంత్ర నిపుణుల కమిటీ తెలిపింది. కుల గణనపై అధ్యయనానికి రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శనరెడ్డి ఛైర్మన్‌గా స్వతంత్ర నిపుణుల కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో కమిటీ సమావేశమైంది. తమ నివేదికలో రాష్ట్రంలోని 242 కులాల వెనుకబాటుతనంపై కంపోజిట్ బ్యాక్‌వర్డ్ నెస్ ఇండెక్స్ (సీబీఐ) సూచీని పొందుపరిచినట్లు ఓ ప్రకటనలో తెలిపింది. 300 పేజీలకు పైగా గల నివేదికలో 242 కులాల వారీగా వెనుకబాటుపై సీబీఐ స్కోర్, ర్యాంకులిచ్చినట్లు పేర్కొంది. మరో వారంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కలను కలిసి నివేదిక సమర్పిస్తామని కమిటీ తెలిపింది. ఈ సమావేశంలో కమిటీ వైస్ ఛైర్మన్ కంచ ఐలయ్య, కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి, సభ్యులు ప్రొఫెసర్ శాంత సిన్హా, డాక్టర్ సుఖ్‌దేవ్ థారోట్, డాక్టర్ హిమాన్షు, నిఖిల్ డే, ప్రొఫెసర్ భాంగ్య, పురుషోత్తమ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిటీ కార్యదర్శి అనుదీప్ పాల్గొన్నారు. కాగా, గత ఏడాది ఫిబ్రవరిలో రాష్ట్రంలో కుల గణన చేపట్టాలని నిర్ణయించిన సర్కారు.. ఈ ఏడాది ఫిబ్రవరి నాలుగో తేదీకి ప్రక్రియ పూర్తి చేసింది. ఇదిలా ఉంటే, ఈ ఏడాది ఫిబ్రవరి 16న ప్రారంభించిన కుల గణన రీ సర్వేలో 4,652 కుటుంబాలు తమ వివరాలు నమోదు చేసుకున్నాయి. ఓసీలు, ఓసీల్లోని ముస్లింల జనాభా కలిపి ఓసీలు: 47,21,115 (15.79%) కాగా, ముస్లిం బీసీలతో కలిపి రాష్ట్రంలో బీసీల జనాభా 56.33 శాతం ఉన్నట్లు తేలింది.

జనాభా వారీగా కుల గణన సర్వే వివరాలు

మొత్తం కుటుంబాలు	1,12,15,134,
జనాభా	3,54,77,554
పురుషులు	1,79,21,183 (50.51%)
స్త్రీలు	1,75,42,579 (49.45%)
థర్డ్‌జెండర్	13,774 (0.04%)

కులాల వారీగా జనాభా వివరాలు

ఎస్సీలు	61,84,319 (17.43%),
ఎస్టీలు	37,05,929 (10.45%),
బీసీలు	1,64,09,179 (46.25 %)
ముస్లిం	44,57,012 (12.56 %),
బీసీ ముస్లింలు	35,76,588 (10.08%)
ఓసీ జాబితాలోని ముస్లింలు	8,80,424 (2.48%)
ఓసీలు	38,30,691 (13.31%)

ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టం అమలు బాధ్యత కలెక్టర్లదే: పొంగులేటి



హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్లు, భూ భారతి చట్టాలను సమర్థంగా అమలు చేసి.. వాటి ఫలితాలు పేదలకు అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లపైనే ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలో పలు జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడితే.. సొంతింటి కల నెరవేరుతుందనే విశ్వాసంతో ప్రజలు తమకు అధికారం అప్పగించారని తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా సీఎం రేవంత్ ఆలోచనల మేరకు ఈ పథకాలకు శ్రీకారం చుట్టామని మంత్రి చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల్లో ఎవరైనా అనర్హులని తేలితే ఇంటి నిర్మాణం మధ్యలో ఉన్నా సరే రద్దు చేయడానికి వెనుకాడొద్దని తెలిపారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ప్రతీ సోమవారం ఇళ్ల కోసం బిల్లులు చెల్లిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఇక రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రతి సామాన్యుడు సంతృప్తి పడేలా పనిచేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

దేశానికే ఆదర్శంగా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ

ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేలా రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థను బలోపేతం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. దేశానికే ఆదర్శంగా ఉండేలా ఈ వ్యవస్థను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి, కృష్ణా నదుల పరివాహక జిల్లాల్లో వరద నిర్వహణ, ముందస్తు జాగ్రత్తలపై కలెక్టర్లు, ఉన్నతాధికారులతో సచివాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆకస్మిక వర్షాలు, వరదల సమాచారాన్ని వాతావరణ విభాగంతో సమన్వయం చేసుకుని ఎప్పటికప్పుడు కిందిస్థాయి వరకు సమాచారం అందించాలని సూచించారు. లోతట్టు గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

పల్లెవెలుగు బస్సుల్లోనూ డిజిటల్ చెల్లింపులు

- చిల్లర కష్టాలు దూరం చేసేందుకు ఆర్టీసీ నిర్ణయం

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) ప్రయాణికులకు చిల్లర కష్టాల్ని దూరం చేస్తుంది. ఇప్పటికే హైదరాబాద్ సిటీ బస్సులతోపాటు జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు నడిచే బస్సు సర్వీసుల్లో డిజిటల్ చెల్లింపు విధానాల్ని ప్రవేశ పెట్టింది. ఇకపై గ్రామీణ ప్రాంతాల్లో తిరిగే పల్లె వెలుగు బస్సు సర్వీసుల్లోనూ డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అందుబాటులోకి తేనుంది. మరో వారం పది రోజుల్లో పల్లె వెలుగు బస్సుల ప్రయాణికులు సైతం నగదు రహిత ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. గూగుల్ పే, ఫోన్ పే, ఇతర యూపీఐ సేవల ద్వారా టిక్కెట్ ధరకు సరిపడా మొత్తం స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో చెల్లించి టిక్కెట్ పొందవచ్చు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ఎంబీఏ కోర్సు

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఎంబీఏ (హాస్పిటల్ అండ్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్) ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. దరఖాస్తులకు జూలై 16 చివరి తేదీ అని విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం అధికారులు బుధవారం ఓ ప్రక టనలో తెలిపారు. ఆగస్టు 10న రాష్ట్రంలో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో మాత్రమే ప్రవేశ పరీక్షను నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఐ-సెట్ 2025లో అర్హత సాధించిన అభ్యర్థులు నేరుగా ఎంబీఏ కోర్సులో అడ్మిషన్లు పొందవచ్చని వెల్లడించారు.

ఎన్పీడీసీఎల్‌లో కొత్తగా 339 పోస్టులు

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): అవసరం లేని పోస్టులను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తగా ఉత్తర డిస్కమ్(టీజీఎన్పీడీసీఎల్-వరంగల్)లో 339 పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా జీవో జారీ చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో టెలిఫోన్ బాయ్, టీపీవో, కార్పెంటర్, సివిల్ మేస్త్రీ, స్టోర్ కీపర్, టూల్ కీపర్, టెలిఫోన్ ఇన్‌స్పెక్టర్ వంటి పోస్టుల అవసరం లేదని, వీటికి బదులుగా 339 కొత్త పోస్టులు మంజూరు చేయాలని డిస్కమ్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ప్రతిపాదనలు పంపించగా... ప్రభుత్వం అంగీకరించింది.

నిర్ణీత వ్యవధిలోగా ప్రాజెక్టులు పూర్తికావాలి

- ఏఐబీపీ ప్రాజెక్టులపై కేంద్ర క్యాబినెట్ సచివాలయం ఆదేశం

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సత్వరసాగు నీటి ప్రయోజన పథకం (ఏఐబీపీ)లోని ప్రాజెక్టులను నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని కేంద్ర క్యాబినెట్ సచివాలయం ఆదేశించింది. బుధవారం న్యూఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో కేంద్ర క్యాబినెట్ సచివాలయం కార్యదర్శి (కో-ఆర్డినేషన్) సమీక్షించారు. దీనికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు హాజరయ్యారు. సత్వరసాగు నీటి ప్రయోజన పథకం(పీఎంకేఎస్‌వై)కింద శ్రీరాంసాగర్ రెండోదశ, రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకం, జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులపై ఆరా తీశారు. భూసేకరణను సత్వరం పూర్తిచేసి, నిర్దేశిత ఆయకట్టుకు నీరందించాలని ఆదేశించారు. రెండేళ్లలో దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని, ఆర్నెల్లలోగా రాజీవ్‌బీమా ఎత్తిపోతల పథకాన్ని, శ్రీరాంసాగర్ రెండో దశను వచ్చే ఏడాదిలో పూర్తి చేస్తామని తెలంగాణ అధికారులు పేర్కొన్నారు.

రేవంత్ పదవికి మంత్రులే ఎసరు పెడుతున్నారు

- సెంటిమెంట్‌ను రగిల్చేందుకే బనకచర్ల వివాదం: లక్ష్మణ్



హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ పదవికి మంత్రులే ఎసరు పెడుతున్నారని.. ఈ విషయం రేవంత్‌కు కూడా తెలుసునని బీజేపీ ఎంపీ కె.లక్ష్మణ్ అన్నారు. తన మంత్రులను ఏమీ అనలేక బీజేపీ మీద నెపంనెడుతున్నారని చెప్పారు. మంత్రులు బీఆర్ఎస్‌ను అక్కున చేర్చుకుని.. వారితో లోపాయికారిగా పని చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాళేశ్వరం అవినీతిపై ప్రచారం చేసి లబ్ధిపొందిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక విచారణ పేరుతో కాలయాపన చేస్తోందని ఆరోపించారు. తెలంగాణ సెంటిమెంట్‌ను పండించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ బనకచర్ల అంశం తెరపైకి తీసుకొచ్చాయని చెప్పారు. నీటి పంపకాల మీద ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి మాట్లాడుకోవాలని సలహా ఇచ్చారు.

జనవరి 28నుంచి 31వరకు మేడారం జాతర

తాడ్వాయి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహాజాతర ముహూర్తం ఖరారైంది. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వాహక అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు బుధవారం ప్రకటించారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహా జాతర నాలుగు రోజులపాటు జరగనుందని తెలిపారు. జాతర ప్రారంభానికి ముందు జనవరి 21(బుధవారం) మండే మెలుగు(శుద్ధి పండుగ) కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

మహాజాతర షెడ్యూల్ ఇలా..

- జనవరి 28న సాయంత్రం 6 గంటలకు సారలమ్మ అమ్మవారు మేడారంలోని గద్దెను చేరుకుంటుంది. అలాగే పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు రావడంతో మహా జాతర మొదటి ఘట్టం ప్రారంభమవుతుంది.
- జనవరి 29న సాయంత్రం 6 గంటలకు వనదేవత సమ్మక్క గద్దెకు చేరుకుంటుంది.
- జనవరి 30న భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు.
- జనవరి 31న (శనివారం) సాయంత్రం 6 గంటలకు వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేస్తారు.

పాఠశాలలు ఇకపై 12వ తరగతి వరకు!

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోవాలన్నారు. బుధవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విద్యాశాఖపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతీ విద్యార్థి తప్పనిసరిగా ఇంటర్మీడియట్ పూర్తి చేసేలా చూడాలన్నారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ దశ కీలకమైనది అయిందున.. ఆ దశలో సరైన మార్గదర్శకత్వం అందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ విద్యను మెరుగుపరిచేందుకు అన్ని స్థాయిల్లో చర్చించి.. శాసనసభలోనూ చర్చకు పెడతామని తెలిపారు.

హాజరుపైనా దృష్టి పెట్టాలి..

ఇంటర్మీడియట్‌లో విద్యార్థుల చేరికతోపాటు వారి హాజరుపైనా దృష్టి పెట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్స్ స్కూళ్ల నమూనాలను పరిశీలించిన ముఖ్యమంత్రి.. ప్రతి పాఠశాల ఆవరణలో భారీ జాతీయ జెండాను ఏర్పాటు చేయాలన్నారు. భవనాల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని, నిర్మాణాల ప్రగతిపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో బాలురు, బాలికలకు ఒక్కొక్కటి చొప్పున యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణాలు చేపడతామని తెలిపారు. ఇప్పటికే ఒక్కో పాఠశాలకు సంబంధించి స్థల సేకరణ పూర్తయిందని, రెండో పాఠశాలకు స్థల గుర్తింపు, సేకరణ ప్రక్రియపై దృష్టి సారించాలని నిర్దేశించారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం నిర్మాణ నమూనాను సీఎం పరిశీలించి పలు మార్పులను సూచించారు. సాధ్యమైనంత త్వరగా టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. కాగా సీఎం రేవంత్ రెడ్డి రాత్రి 10 నుంచి 11-30 వరకు ఇంజనీరింగ్‌లో అదనపు సీట్ల అంశమ్మీద సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో అదనపు సీట్లపై చర్చించారు. అయితే సీఎస్‌ఈ సీట్లు పెరిగితే కోర్ ఇంజనీరింగ్ కోర్సులైన సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్ ఇంజినీరింగ్ సీట్లకు ప్రాధాన్యం తగ్గుతుందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

ఏటా నెల రోజులు

ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయండి

- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడంలో మద్దతివ్వండి
- ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచన



బంజారాహిల్స్‌లో ఏఐజీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, చిత్రంలో ఏఐజీ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు హాస్పిటళ్లలో పనిచేసే వైద్యులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓ కీలక సూచన చేశారు. ఏడాదిలో కనీసం నెల రోజులపాటు ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేయాలని కోరారు. తద్వారా సర్కారు దవాఖానాల్లో సేవల నాణ్యతను మెరుగుపరచడానికి తమ వంతు చేయూతనందించాలన్నారు. పేదలకు మెరుగైన వైద్య సేవలను చేరువ చేయాలనే ప్రభుత్వ ప్రయత్నాలకు మద్దతివ్వాలని అన్నారు. తెలంగాణలో చదువుకొని దేశ విదేశాల్లో స్థిరపడ్డ వైద్యులు కూడా ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సేవలందించాలని కోరారు. "సంవత్సరంలో 11 నెలలు మీకు నచ్చిన ప్రైవేట్ హాస్పిటల్‌లో, మీకు నచ్చిన జీతానికి పనిచేసుకోండి. ఒక్క నెల మాత్రం ప్రభుత్వ ఆస్పత్రులకు కేటాయించండి. హైదరాబాద్‌లో ఉన్న డాక్టర్లకు మాత్రమేకాకుండా.. దేశ విదేశాల్లోని తెలుగు డాక్టర్లందరకీ ఇది నా విన్నపం. మీరు ఏడాదికోసారి అయినా మీ అమ్మనాన్నలను చూడటానికో, మరేదైనా పనిమీదనో మీ సొంత ఊరికి వస్తుంటారు. అప్పుడు వీలు చూసుకుని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మీ సేవలను అందించడానికి ప్రయత్నించండి. మీకు నచ్చిన ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలనందిస్తామంటే.. అందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం తరఫున చేస్తాం" అని రేవంత్ అన్నారు. బుధవారం బంజారాహిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఏఐజీ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతిపెద్ద హాస్పిటల్‌ను నగరంలో ఏర్పాటు చేసినందుకు ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డి.నాగేశ్వర్‌రెడ్డిని అభినందిస్తున్నట్లు తెలిపారు.నాగేశ్వర్‌రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాదని.. పేదలకు వైద్య సేవలందించాలనే లక్ష్యంతో భారత్‌లోనే ఉండిపోయారని పేర్కొన్నారు. భారతరత్న పురస్కారానికి నాగేశ్వర్ రెడ్డి అర్హుడని, ఇందుకోసం ప్రభుత్వం తరఫున కేంద్రానికి సిఫారసు చేస్తామన్నారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులు..

సర్కారు ఆస్పత్రుల్లో కూడా ప్రైవేటు హాస్పిటళ్లకు దీటుగా మౌలిక సదుపాయాలు ఉండేలా ప్రభుత్వం కృషి చేస్తోందని సీఎం రేవంత్ అన్నారు. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌లో రూ.3వేల కోట్లతో 2700 పడకలతో 30 ఎకరాల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. అలాగే నిమ్స్‌లో కొత్త బ్లాక్ , వరంగల్, టిమ్స్ అల్వాల్, ఎల్‌బీనగర్, సనత్‌నగర్‌లో ఆస్పత్రులు నిర్మిస్తున్నామని, ఈ ఏడాది డిసెంబరు 9 లోపు 7వేల పడకల హాస్పిటళ్లను అందుబాటులోకి తీసుకువస్తున్నామని వెల్లడించారు. విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాము 25 ఏళ్ల క్రితం ఏఐజీని సోమాజిగూడలో ప్రారంభించామని, ఇప్పుడు అది గచ్చిబౌలిలో 1000 పడకల స్థాయికి చేరి.. ప్రపంచంలోనే అత్యుత్తమ హాస్పిటళ్లలో ఒకటిగా నిలిచిందని అన్నారు. ప్రస్తుతం బంజారాహిల్స్‌లో 300 పడకలతో ఈ హాస్పిటల్‌ను ఏర్పాటుచేశామని, ఏఐ సహాయంతో ఆరోగ్య సంరక్షణ సేవలను మరింత మెరుగ్గా అందిస్తామని తెలిపారు.

ఆరోగ్య పర్యాటక కేంద్రంగా హైదరాబాద్..

హైదరాబాద్ ఇప్పుడు ఆరోగ్య పర్యాటక కేంద్రంగా వెలుగొందుతోందని సీఎం రేవంత్ అన్నారు. మిడిల్ ఈస్ట్ లాంటి అనేక దేశాల నుంచి ఎంతోమంది వైద్య సేవల కోసం ఇక్కడికి వస్తున్నారని తెలిపారు. సీఐఐ నివేదికల ప్రకారం హైదరాబాద్‌కు 2.20 లక్షల మంది రోగులు విదేశాల నుంచి వస్తున్నారని చెప్పారు. ఆయా దేశాలకు నేరుగా విమానాలు నడపడం ద్వారా వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశముందని, ఈ విషయమై తాము పౌర విమానయాన శాఖ మంత్రితో చర్చించామని తెలిపారు. దేశంలో బల్క్ డ్రగ్ ఉత్పత్తిలో దాదాపు 35 శాతం హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతోందని అన్నారు. ప్రపంచానికి మూడు కొవిడ్ వ్యాక్సిన్‌లు ఉత్పత్తి చేసి ఇచ్చిన నగరమూ మనదేనని పేర్కొన్నారు. 60 ఏళ్ల క్రితం ఇందిరగాంధీ, నెహ్రూ వేసిన బీజాలే ఇప్పుడు ఫలాలను అందిస్తున్నాయని చెప్పారు. ఐడీపీఎల్‌లో నాడు పరిశోధనల్లో పాల్గొన్న ఎంతోమంది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఫార్మా సంస్థల అధినేతలుగా ఎదిగారని తెలిపారు.

మహిళలకు యునిక్ హెల్త్ కార్డులు..

తాము రూపొందిస్తున్న తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్‌లో ఆరోగ్య రంగానికి ప్రత్యేకంగా ఓ అధ్యాయం పెట్టామని సీఎం రేవంత్ అన్నారు. డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి లాంటి వారి సూచనలు, సలహాలను ఆహ్వానిస్తున్నామన్నారు. వైద్యాన్ని పేదప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నదే తమ ప్రయత్నమని చెప్పారు. ఆరోగ్యశ్రీ కింద గతంలో రూ.2 లక్షల వరకు చికిత్సకు అందిస్తే, దానిని ఇప్పుడు రూ.10 లక్షలకు పెంచామని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి దాదాపు రూ.1400 కోట్లు పేదల వైద్యానికి అందించామన్నారు. ఇదంతా అనారోగ్యం బారిన పడిన తరువాత చేస్తున్న ఖర్చు అని, ఇలా కాకుండా సమస్య బారిన పడకుండా నివారణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ దిశగా స్వయం సహాయక బృందాల మహిళలకు యునిక్ ఐడీ కార్డు ఇచ్చి.. వారి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించాలని ప్రయత్నిస్తున్నామని చెప్పారు. క్యాన్సర్ బారిన పడుతున్నది ఎక్కువగా మహిళలేనని, హెల్త్‌కార్డు ద్వారా వారి కుటుంబ ఆరోగ్య చరిత్ర మొత్తం డాక్టర్‌కు తెలిసే ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

టీజేఎస్ సూచనలు స్వీకరిస్తాం

ప్రజా సమస్యల పరిష్కారానికి టీజేఎస్ నేతల సూచనలు స్వీకరిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం నేతృత్వంలో నేతలు బుధవారం సీఎంతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు ప్రజా సమస్యలపై రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అలాగే, ఆగస్టు1న నవతెలంగాణ దినపత్రిక వార్షికోత్సవానికి రావాలని సీపీఎం నేతలు రాఘవులు, జూలకంటి రంగారెడ్డి, నవతెలంగాణ ఎడిటర్ రమేష్, సీజీఎం ప్రభాకర్ ఉన్నారు.



కొత్త రేషన్ కార్డులు.. 14 నుంచి పంపిణీ

- ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను అతి త్వరలో ప్రారంభిస్తాం: ఉత్తమ్
- ఎరువుల కొరత రానీయొద్దు: అడ్లూరి
- జిల్లా కేంద్రాలకు డబుల్‌రోడ్లు: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, మహేశ్వరం, జూలై 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో ఈ నెల 14న జరిగే బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ తరుణంలో అన్ని జిల్లాల కలెక్టర్లు ఈ నెల 13లోపు దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి అర్హుల జాబితాలు రూపొందించాలని ఆదేశించారు. బుధవారం నల్లగొండలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. తిరుమలగిరిలో నిర్వహించే బహిరంగ సభలో కొత్త రేషన్ కార్డుల పంపిణీని సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ప్రారంభిస్తారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం వద్ద హెలికాప్టర్ ద్వారా ఎలక్ట్రో మ్యాగ్నటిక్ రాడార్ సర్వే నిర్వహించి, నివేదిక ఆధారంగా టన్నెల్ పనులు అతిత్వరలో పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. టన్నెల్స్ నిర్మాణానికి అత్యంత అనుభవజ్ఞులైన జనరల్ హర్పాల్ సింగ్‌ను నీటిపారుదల శాఖ గౌరవ సలహాదారుగా, ప్రపంచ టన్నెల్ నిపుణుడు జనరల్ పరీక్షిత్ బెహరాను ఇరిగేషన్ శాఖ స్పెషల్ సెక్రటరీగా నియమించబోతున్నట్లు చెప్పారు. వారి నేతృత్వంలో ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గాన్ని వేగవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు. వానాకాలం సీజన్ ఆరంభమైన నేపథ్యంలో రైతులకు ఎరువుల ఇబ్బందుల్లేకుండా చూడాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. రాష్ట్రంలో అన్ని మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు ఉన్న రోడ్లను రూ.12 వేల కోట్లతో డబుల్ లైన్ రోడ్లుగా మార్చనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. వీటన్నింటినీ హామ్ పద్ధతిలో చేపడతారని, పంచాయతీరాజ్ రోడ్లను సైతం ఇదేరీతిలో చేపడుతున్నామన్నారు. కాగా, రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేసిన మలబార్ గోల్డ్ పరిశ్రమను గురువారం సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించనున్నారు. నాలుగు ఎకరాల విస్తీర్ణంలో రూ.700 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమలో 2 వేల మందికి పైగానే ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ వర్సిటీ

రెండేళ్లలో 2 లక్షల మంది కృత్రిమ మేధ నిపుణుల తయారీ.. తెలంగాణను గ్లోబల్ క్యాపిటల్ ఏఐగా తీర్చిదిద్దుతాం

- దేశంలోనే తొలి టీజీడెక్స్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెండేళ్లలో 2 లక్షల మంది యువతను అత్యుత్తమ ఏఐ (కృత్రిమ మేధ) రంగ నిపుణులుగా తీర్చిదిద్దాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అందుకోసం త్వరలోనే అంతర్జాతీయ ప్రమాణాలతో ఏఐ యూనివర్సిటీ ప్రారంభానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో టి-హబ్‌లో బుధవారం దేశంలోనే తొలి ఏఐ అనుసంధానిత 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్ (టీజీడెక్స్)ను ఆయన లాంఛనంగా ప్రారంభిస్తూ.. 'ప్రస్తుతం ఏఐ అంటే కేవలం ఎమర్జింగ్ టెక్నాలజీ మాత్రమే కాదు. మానవ జీవితాలను ప్రభావితం చేసే శక్తి. కొత్తగా ఎన్నో అవకాశాలు సృష్టించింది. ఈ మార్పును అందిపుచ్చుకుని రాష్ట్రాన్ని 'గ్లోబల్ క్యాపిటల్ ఆఫ్ ఏఐ'గా తీర్చి దిద్దడానికి మా సర్కారు చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఇప్పటికే ఏఐ స్ట్రాటజీ రోడ్ మ్యాప్‌ను రూపొందించుకుని ఆ దిశగా వడివడిగా అడుగులేస్తోంది' అని చెప్పారు. 'ఇది దేశంలో ఏర్పాటైన తొలి ఏఐ డేటా ఎక్స్ఛేంజ్. ప్రభుత్వ శాఖలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థలు, పరిశోధకులు, యువతను ఒకే వేదికపై తెచ్చి సమాజం ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారాలను అభివృద్ధి చేయడానికి దారి చూపుతుంది. ఇప్పటికే ఇందులో 480కి పైగా డేటా సెట్స్, 3,000లకు పైగా ఏఐ స్టార్టప్‌లు భాగస్వామ్యమయ్యాయి' అని పేర్కొన్నారు. ఏఐని ప్రజలంతా సమర్థవంతంగా వినియోగించుకోవడంతోపాటు పలు సమస్యల పరిష్కారం కోసం టీజీడెక్స్ అందుబాటులోకి తెచ్చామన్నారు. దీని రూపకల్పనకు జైకాతోపాటు బెంగళూరులోని ఐఐఎస్సీ వ్యూహాత్మక సహకారం అందించాయని చెప్పారు.

పలు సమస్యలకు పరిష్కారం..

రైతులకు మేలు చేసే అగ్రిటెక్ స్టార్టప్‌లకు అవసరమైన డేటా లభించడంతోపాటు రోగులకు ఆరోగ్య శాఖ మరింత సమర్థవంతమైన సేవలందించడానికి అవసరమైన ఏఐ మోడల్స్ అభివృద్ధికి టీజీడెక్స్ ఉపకరిస్తుందని శ్రీధర్‌బాబు చెప్పారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ఉపయోగ పడటంతోపాటు నూతన ఆవిష్కరణతోపాటు గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఇది దిక్సూచిగా మారుతుందన్నారు. 'వచ్చే ఐదేళ్లలో టీజీడెక్స్‌లో 2000 డేటా సెట్స్ చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ప్రభుత్వంలో 30 ఏఐ ఆధారిత ప్రాజెక్టుల అమలుతో పాలనలో ఏఐ వినియోగానికి పెద్ద పీట వేస్తున్నాం. త్వరలో క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని వివరించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ట్రస్ట్ బ్యాంక్!

- ఉన్నత విద్యారంగం టర్నోవర్ 65 వేల కోట్లు
- దానిపై వచ్చే వడ్డీతో ఫీజు చెల్లించండి
- ప్రభుత్వ ఖజానాపై భారం పడదు
- తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్య ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన భట్టి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కాలేజీలకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఏటేటా పెరిగిపోతుండడం, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్న నేపథ్యంలో కాలేజీల యాజమాన్యాలే ఫీజు చెల్లింపునకు పరిష్కార మార్గాన్ని సర్కారుకు సూచించాయి. మొత్తం బకాయిలు ఒకేసారి చెల్లించలేమని ప్రభుత్వం ఇప్పటికే చెప్పడంతో.. కొత్త ప్రతిపాదనతో సర్కారును సంప్రదించాయి. ప్రభుత్వంపై భారం పడకుండా ప్రతి ఏటా రీయింబర్స్‌మెంట్ చెల్లించేలా కొత్త విధానాన్ని ప్రతిపాదించాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత విద్యాసంస్థలన్నింటి ఆర్థిక లావాదేవీలకు కలిపి ట్రస్టు బ్యాంకును ఏర్పాటు చేసి.. దాని ద్వారా ఫీజు చెల్లింపు చేయవచ్చని పేర్కొన్నాయి. రాష్ట్ర ఉన్నత విద్యారంగం పరిధిలో వందలాది విద్యాసంస్థలు ఉన్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, మెడికల్, ఫార్మసీ, లా, మేనేజ్‌మెంట్, డిగ్రీ కాలేజీలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు యూనివర్సిటీలు కూడా ఉన్నాయి. వీటిలో వేలాది మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తుండగా.. తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల వార్షిక టర్నోవర్ రూ.65 వేల కోట్లకు పైగా ఉంది. ప్రభుత్వం సైతం ఈ రంగానికి ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ.వేల కోట్లు కేటాయిస్తుంది. ఈ మొత్తానికి కలిపి ట్రస్ట్ బ్యాంకును ఏర్పాటు చేయాలని కాలేజీల యాజమాన్యాలు ప్రతిపాదించాయి. ఫీజు బకాయిలు సాధించుకోవడమే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రైవేటు కాలేజీల సంఘాలన్నీ కలిసి ఇటీవలే తెలంగాణ ఉన్నత విద్యాసంస్థల సంఘాల సమాఖ్యగా ఏర్పడ్డాయి. బుధవారం సమాఖ్య అధ్యక్షుడు, అరోరా విద్యాసంస్థల చైర్మన్ నిమ్మటూరి రమేశ్‌బాబు నేతృత్వంలోని ప్రతినిధుల బృందం.. ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కను సచివాలయంలో కలిసి.. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ఆయన ముందుంచింది.

కాలేజీల యాజమాన్యాల ప్రతిపాదన ఇదీ..

ట్రస్ట్ బ్యాంక్ విధానాన్ని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సైతం 2001 జనవరిలో అనుమతించింది. దీనికి సంబంధించి ప్రభుత్వం ఒక ట్రస్టును నెలకొల్పి.. దాని ఆధ్వర్యంలో ట్రస్ట్ బ్యాంకు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. తొలుత ప్రభుత్వం తన మూలధన వాటాగా ఒకేసారి రూ.1500 కోట్లు అందులో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. దీంతోపాటు విద్యాసంస్థల ఆపరేషన్ డిపాజిట్లపై వడ్డీ రూపంలో రూ.2500 కోట్లు సేకరించవచ్చు. ప్రభుత్వ వర్సిటీలు, విద్యాసంస్థల కరంట్ ఆపరేషనల్ అకౌంట్ వడ్డీ రూ.1000 కోట్లు, హాస్టళ్ల కరంట్ ఆపరేషనల్ డిపాజిట్లపై రూ.300 కోట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా లబ్ధి పొంది ఉద్యోగాలు పొందినవారి నుంచి విరాళాల సేకరణతో రూ.525 కోట్లు, ఇతర వ్యాపార సంస్థలపై నామమాత్ర సెస్ విధించడం ద్వారా ఏటా రూ.375 కోట్లు సేకరించవచ్చు. ఇవే కాకుండా.. విద్యాసంస్థల నుంచి కార్పస్ ఫండ్ రూపంలో రూ.389 కోట్లు, ఉన్నత విద్య హాస్టళ్లు, స్టడీ సెంటర్లు, క్యాంపస్ సెంటర్ల కార్పస్ ఫండ్ రూ.100 కోట్లు, రాష్ట్ర, కేంద్ర విద్యాసంస్థల రిజర్వ్ ఫండ్ రూ.336 కోట్లు సేకరించవచ్చని సమాఖ్య ప్రతిపాదించింది. ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్‌మెంటు కోసం ప్రభుత్వం రూ.2500 కోట్ల వరకు చెల్లించాల్సి ఉండగా.. గత మూడేళ్లుగా నిధులు విడుదల చేయకపోవడంతో బకాయిలు రూ.7500 కోట్లకు చేరాయి. వచ్చే ఏడాదికి రూ.10 వేల కోట్లకు చేరతాయి. అయితే ట్రస్టు బ్యాంకు ద్వారా సుమారు రూ.3 వేల కోట్ల వరకు సమీకరించవచ్చని సమాఖ్య తెలిపింది. అప్పుడు ప్రభుత్వం పైసా చెల్లించాల్సిన అవసరం ఉండదని పేర్కొంది. కళాశాలల సమాఖ్య చేసిన ఈ ప్రతిపాదనను ఆర్థికశాఖ మంత్రిగా ఉన్న ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ఆసక్తిగా విన్నారు. ఉన్నత విద్యారంగానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, కానీ.. ఆర్థిక సమస్యల కారణంగానే బకాయిల విడుదలలో ఆలస్యం అవుతోందని చెప్పారు. సమాఖ్య చేసిన ట్రస్ట్ బ్యాంకు ప్రతిపాదనపై ఈ నెల 7న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి చర్చిస్తామని అన్నారు.

శివబాలకృష్ణ ఇంట్లో ఈడీ సోదాలు

- సోదరుడు, బంధువుల ఇళ్లలోనూ సోదాలు
- మనీలాండరింగ్ కోణంలో విచారణ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండీఏ) మాజీ ప్లానింగ్ డైరెక్టర్ శివబాలకృష్ణ ఇంట్లో ఈడీ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. శివబాలకృష్ణ సోదరుడు, బంధువుల ఇళ్లల్లోనూ సోదాలు నిర్వహించారు. అక్రమాస్తుల కేసులో గత ఏడాది శివబాలకృష్ణ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఏసీబీ ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు బాలకృష్ణ తదితరులపై మనీలాండరింగ్ కేసు నమోదు చేశారు. బాలకృష్ణ ఆస్తులు వందల కోట్ల విలువ ఉండటంతో మనీలాండరింగ్ కోణంలో ఈడీ రంగంలో దిగి పలు కీలక ఆధారాలు సేకరించిందని తెలుస్తోంది. బాలకృష్ణ గతంలో హైదరాబాద్ మెట్రో రైల్, రెరాలో సైతం కీలక బాధ్యతలు నిర్వహించారు. భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసే సమయంలో కొందరు రియల్టర్లతో శివబాలకృష్ణ కుమ్మక్కు అయినట్లు స్పష్టమైన ఆధారాలను ఈడీ సేకరించినట్లు తెలుస్తోంది. శివబాలకృష్ణ కేసులో భాగంగా హైదరాబాద్‌లోని కొన్ని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థల్లో ఈడీ సోదాలు జరపవచ్చని సమాచారం. గత ఏడాది జనవరి 24వ తేదీన ఏసీబీ అధికారులు శివబాలకృష్ణ, అతని సోదరుడు శివ నవీన్‌కుమార్ ఇళ్లతో పాటు 16 చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. శివబాలకృష్ణ, అతని బినామీల పేరిట 214 ఎకరాల వ్యవసాయ భూమి, 29 ప్లాట్లు, 7 ఫ్లాట్లు, మూడు విల్లాలు, పుప్పాల్‌గూడలోని ఆదిత్య ఫోర్ట్ వ్యూలో ఒక లగ్జరీ విల్లా ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ ఆస్తుల మార్కెట్ విలువ దాదాపు 400 కోట్ల రూపాయలు ఉంటుందని ఏసీబీ అధికారులు అప్పట్లో పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఈ నెలంతా వర్షాలే !

- దేశ వ్యాప్తంగానూ అదే పరిస్థితి
- రాష్ట్రంలో మరో 5 రోజులు వానలు:వాతావరణ శాఖ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల (జూలై)లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) బుధవారం వెల్లడించింది. అలాగే దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని తెలిపింది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షం కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఇక చాలా ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా ఉండే సూచనలున్నాయని వెల్లడించింది. అయితే, కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం కూడా ఉందని హెచ్చరించింది. మరోవైపు తెలంగాణపై నైరుతి రుతుపవనాలు చురుగ్గా ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బుధవారం మహబూబాబాద్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినట్లు వెల్లడించింది. రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం సగటు వర్షపాతం 2 సెంటీమీటర్లు నమోదైనట్లు తెలిపింది. గురు, శుక్రవారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురుస్తాయని పేర్కొంది. 7 వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది.

ఆరోగ్య శ్రీ ఎం-ప్యానెల్‌మెంట్‌పై ప్రైవేటు ఆస్పత్రుల నుంచి ఫిర్యాదుల్లేవు

- పూర్తి పారదర్శకతతోనే అనుమతి
- "ఆంధ్రజ్యోతి" కథనంపై సీఈవో వివరణ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఫైసలిస్తేనే ఆరోగ్యశ్రీ ఎం-ప్యానెల్‌మెంట్‌కు అనుమతిస్తున్నట్లు ఏ ఒక్క ప్రైవేటు ఆస్పత్రి నుంచి తమకు ఫిర్యాదు రాలేదని ఆరోగ్య శ్రీ ట్రస్టు సీఈఓ ఉదయ్‌కుమార్ తెలిపారు. ఆరోగ్య శ్రీ పథకానికి ప్రైవేటు ఆస్పత్రుల ఎం-ప్యానల్‌మెంట్ ప్రక్రియ పూర్తి పారదర్శకతతో చేపడుతున్నామన్నారు. 'ఆరోగ్య శ్రీ అనుసంధానం-ఫైసలిస్తే పరిపూర్ణం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తా కథనంపై బుధవారం ఆయన వివరణ ఇచ్చారు. 2023 డిసెంబర్ 9 నుంచి ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 97 ప్రైవేటు ఆస్పత్రులను ఆరోగ్యశ్రీలో ఎం-ప్యానెల్ చేశామన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఆన్‌లైన్‌లోనే ఆస్పత్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని ఉదయ్ కుమార్ తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువనున్న వారికి నగదు రహిత వైద్యం మరింత మందికి అందుబాటులోకి తేవడానికి 'ఆరోగ్య శ్రీ-ఎం-ప్యానెల్' ఆస్పత్రుల సంఖ్యను పెంచడంతోపాటు కఠిన నిబంధనలనూ సరళతరం చేశామని వివరించారు. ఎం-ప్యానెల్‌మెంట్ అండ్ డిసిప్లినరీ కమిటీని తొలగించలేదని స్పష్టం చేసిన ఉదయ్ కుమార్.. ప్రైవేటు ఆస్పత్రుల ఎం-ప్యానెల్ విషయమై పూర్తిగా సమీక్షించి, సిఫారసులు చేయడంలో ఈడీసీ కీలక పాత్ర పోషిస్తున్నదన్నారు. ఎం-ప్యానెల్ పర్యవేక్షణ అధికారికి ఆ బాధ్యతలు అప్పగించి ఏడాది కూడా దాటలేదని ఆయన తెలిపారు.

ఆరా మస్తాన్ వాంగ్మూలం నమోదు చేసిన సిట్

- ఆయన రేవంత్, కొండల్‌రెడితో మాట్లాడిన కాల్స్ ట్యాపింగ్
- వందల రికార్డింగ్‌లను ఆయనకు చూపిన సిట్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సెఫాలజిస్టు ఆరా మస్తాన్ వాంగ్మూలాన్ని సిట్ అధికారులు బుధవారం నమోదు చేశారు. నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో ఆరా మస్తాన్ మాట్లాడిన కాల్స్‌ను ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని టీం ట్యాపింగ్ ద్వారా రికార్డు చేసిందన్న విషయాన్ని మస్తాన్‌కు సిట్ అధికారులు ఆధారాలతో చూపించారు. 2023 నవంబరులో మస్తాన్ తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడిన ప్రతి ఫోన్ కాల్‌ను ట్యాపింగ్ చేసి సంభాషణలను ప్రభాకర్‌రావు బృందం రికార్డు చేసింది. తన ఫోన్ ట్యాపింగ్ డేటాను సిట్ అధికారులు చూపించడంతో మస్తాన్ విభ్రాంతికి గురైనట్లు తెలుస్తోంది. 2020 నుంచి మస్తాన్ ఫోన్‌ను ఎస్ఐబీ అధికారులు ట్యాపింగ్‌లో పెట్టారని, 2023లో మావోయిస్టుల సమాచారం కోసమంటూ ఆయన ఫోన్ నెంబర్ ట్యాపింగ్‌కు రివ్యూ కమిటీ అనుమతి తెచ్చుకున్నారని సమాచారం. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మస్తాన్ మాట్లాడిన, ఆయనకు వచ్చిన ఇన్ కమింగ్ కాల్స్‌ను రికార్డు చేశారు. ఫోన్ ట్యాపింగ్ చేయించిన వారికి తన కాల్స్‌లో ఒకటో రెండు అవసరం అవ్వవచ్చని అందుకని తన భార్యాపిల్లలతో మాట్లాడిన మాటలు కూడా రికార్డు చేయడం శోచనీయమని విచారణ తర్వాత మస్తాన్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేయాలంటేనే భయపడే విధంగా కేంద్రం చట్టాన్ని తీసుకు రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సిట్ అధికారులు తనకు చాలా డేటాతో పాటు రికార్డింగ్‌లు చూపించారని, ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు అత్యంత ప్రమాదకరమని ఆయన అన్నారు.

పౌరసరఫరాల శాఖలో డీఎస్‌వోల బదిలీలు

- అవినీతిపరులకు అందలమని ఆరోపణలు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో పలువురు డీఎస్‌వోలు బదిలీ అయ్యారు. జగిత్యాల డీఎస్‌వోగా వెంకటేష్, నల్గొండ డీఎస్‌వోగా రఘునందన్, వికారాబాద్ డీఎస్‌వోగా సుదర్శన్, హైదరాబాద్ డీఎస్‌వోగా శ్రీనివాస్, నిర్మల్ డీఎస్‌వోగా రాజేందర్, సంగారెడ్డి డీఎస్‌వోగా రాజేశ్వర్, సూర్యాపేట డీఎస్‌వోగా మోహన్‌బాబు, పెద్దపల్లి డీఎస్‌వోగా శ్రీనాథ్‌లకు పోస్టింగులు ఇస్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ బదిలీలపై పలు రకాలుగా చర్చలు జరుగుతున్నాయి. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులుగా కొంతకాలంగా విధులు నిర్వర్తిస్తున్న డీఎస్‌వోలపై ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో బదిలీల ప్రక్రియ చేపట్టారనే చర్చ ఒకవైపు జరుగుతుండగా.. ఆరోపణలు వచ్చినవారిపై చర్యలు తీసుకోకుండా, వారు కోరుకున్న స్థానాలకు బదిలీలు చేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. నిర్మల్ డీఎస్‌వోగా పనిచేస్తూ ఇప్పటికే మూడుసార్లు సస్పెండైన కిరణ్‌కుమార్‌ను జయశంకర్ భూపాలపల్లికి బదిలీ చేశారు. ఇటీవల సూర్యాపేట జిల్లా నుంచి వికారాబాద్ జిల్లాకు బదిలీ అయిన మోహన్‌బాబును... ఆరు నెలలు కూడా పూర్తికాకముందే తిరిగి సూర్యాపేట జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారనే చర్చ జరుగుతోంది. నారాయణపేటలో సస్పెండైన డీఎస్‌వో సుదర్శన్‌ను కొద్ది రోజుల్లోనే వికారాబాద్ జిల్లా డీఎస్‌వోగా నియమించడంలో ఆంతర్యమేమిటనే చర్చ పౌరసరఫరాల శాఖలో జరుగుతోంది.

కడసారి చూపూ దక్కని ఘోరం!



మూడు రోజులైనా ఆచూకీ లభించని పది మంది



మావాళ్ల ఆచూకీ చెప్పాలంటూ రోదిస్తున్న మృతుల కుటుంబసభ్యులు

- మంటలకు కాలి బూడిదైనట్లు అంచనా.. ఏమాత్రం గుర్తుపట్టలేని స్థితిలో మరో 20 మృతదేహాలు
- డీఎన్ఏ విశ్లేషణలో జాప్యం.. మార్చురీ వద్ద కుటుంబ సభ్యుల పడిగాపులు. ప్రాణాపాయ స్థితిలో ఆరుగురు
- వర్షంతో సహాయ చర్యలకు ఆటంకం.. ఘటనపై నిపుణుల కమిటీ.. నెల రోజుల్లో నివేదికకు ఆదేశం

సంగారెడ్డి ప్రతినిధి/రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమ దుర్ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన వారికి కడసారి చూపూ దక్కని వేదన వర్ణనాతీతంగా మారింది. గల్లంతైన వారిలో పది మంది ఆచూకీ దొరకని పరిస్థితి నెలకొంది. ప్లాంటులోని డ్రయర్‌కు సమీపంలో పనిచేస్తున్న ఆ పది మంది మంటల ఉధృతితో పాటు రసాయనాల ప్రభావంతో ఎముకలు సైతం బూడిదైపోయి ఉంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దలుగా మారిన మరో 20 మందికిపైగా మృతదేహాల గుర్తింపులోనూ జాప్యం జరుగుతోంది. ప్రమాదం జరిగి మూడు రోజులైనా తమవారి జాడ లేక.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఆచూకీ చెప్పాలంటూ బుధవారం పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. మృతులు, గల్లంతైన వారి విషయంలో ప్రభుత్వం, కంపెనీ ప్రతినిధులు ఒక్కో లెక్క చెబుతుండటం గందరగోళానికి దారితీస్తోంది.

ప్రత్యేకంగా గాలింపు చేపట్టినా..

ప్రమాదంలో ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం బుధవారం ఘటనా స్థలిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. హైడ్రా, ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలు.. శిథిలాల్లో గాలించాయి. అదనపు వాహనాలను, పరికరాలను తెప్పించి సహాయక చర్యలు చేపట్టారు. శిథిలాలను టిప్పర్లతో ఖాళీ ప్రదేశాలకు తరలించి, మృతదేహాల అవశేషాల కోసం వెతుకుతున్నట్టు తెలిసింది. బుధవారం ఒకరి చెయ్యి బయటపడగా మార్చురీకి తరలించారు. మంగళవారం రాత్రి నుంచీ కురుస్తున్న వర్షంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది.

మరణాలపై తికమక..

మంగళవారం ఉదయం మృతుల సంఖ్య 36కు చేరిందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. అదే రోజు సాయంత్రం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించారు. 46 మంది వరకు చనిపోయినట్టు అధికారుల ద్వారా తెలిసిందని చెప్పారు. బుధవారం ఉదయం సిగాచి పరిశ్రమ యాజమాన్యం 40 మంది మృతిచెందారని ప్రకటించింది. రాత్రి సంగారెడ్డి కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో మృతుల సంఖ్య 38 అని ఉంది. మరోవైపు పోస్టుమార్టం గదికి 45కు పైగా మృతదేహాల నమూనాలు వచ్చినట్టు చర్చ జరుగుతోంది. కాగా, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో పది మంది పరిస్థితి విషమంగా ఉందని, అందులోనూ ఆరుగురు వెంటిలేటర్లపై ఉన్నారని సమాచారం. మరో ఆరుగురి శరీరాలు 70శాతానికి పైగా కాలిపోయాయని, వారిని మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించాలని వారి బంధువులు కోరుతున్నారు.



పరిశ్రమలో బుధవారం బయటపడ్డ మృతదేహాన్ని తీసుకున్న రెస్క్యూ టీం

అధికారుల నిర్లక్ష్యం.. వేటుకు రంగం సిద్ధం!

సిగాచి పరిశ్రమ నిర్వహణ తీరు, అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంలో కర్మాగారశాఖ, బాయిలర్స్ విభాగం, అగ్నిమాపక శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నిర్లక్ష్యం ఉన్నట్టు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. బాధ్యులపై వేటు వేయడానికి ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేసినట్టు సమాచారం. కాగా, సిగాచి దుర్ఘటనలో మృతిచెందిన తమ రాష్ట్ర కార్మికులు, క్షతగాత్రుల కోసం ఒడిశా అధికారుల బృందం బుధవారం పాశమైలారం చేరుకుంది.

ప్రమాద ఘటనపై నిపుణుల కమిటీ

సిగాచి పరిశ్రమలో జరిగిన భారీ పేలుడు ఘటనపై అధ్యయనం కోసం ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో భారత రసాయన సాంకేతిక సంస్థ (ఐఐసీటీ)కి చెందిన శాస్త్ర, పారిశ్రామిక పరిశోధన విభాగం (సీఎస్ఐఆర్) శాస్త్రవేత్తలు డాక్టర్ బి.వెంకటేశ్వరరావు చైర్మన్‌గా, సభ్యులుగా టి.ప్రతాప్‌కుమార్, సూర్యనారాయణ, సంతోష్ గుజే ఉన్నారు. పరిశ్రమలో ప్రమాదానికి కారణాలు, భద్రతా ప్రమాణాలు పాటించారా లేదా? లోపాలు ఏమైనా ఉన్నాయా? యాజమాన్యం నిర్లక్ష్యం ఉందా అన్న అంశాలను పరిశీలించి నెల రోజుల్లో నివేదిక ఇవ్వాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై సిఫార్సులు చేయాలని సూచించింది. మరోవైపు ఈ దుర్ఘటనపై సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి చట్టబద్ధత కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం జీవో విడుదల చేసింది. ఈ కమిటీ గురు, శుక్రవారాల్లో విచారణ చేపట్టనుందని అధికారులు తెలిపారు. సిగాచి పరిశ్రమలో 40 మందికిపైగా మృతి చెందడం, చాలా మంది గాయపడిన నేపథ్యంలో 30కిపైగా అంబులెన్సులను అధికారులు సిద్ధంగా ఉంచారు. మృతదేహాలను, క్షతగాత్రులను ఆ వాహనాల్లో స్వస్థలాలకు తరలిస్తున్నారు. మూడు రోజులుగా తాము ఇక్కడే ఉంటున్నామని, ఇంత దారుణ ప్రమాదాన్ని మొదటిసారిగా చూశామని అంబులెన్సుల డ్రైవర్లు చెప్పారు.

వైస్ ప్రెసిడెంట్, డీజీఎం మృతదేహాల గుర్తింపు

పేలుడులో దుర్మరణం పాలైన సిగాచి పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఇలంగోవన్, డీజీఎం ప్రవీణ్‌కుమార్‌ల మృతదేహాలను డీఎన్ఏ విశ్లేషణ ఆధారంగా బుధవారం గుర్తించారు. ఇలంగోవన్ మృతదేహాన్ని ఆయన సోదరుడు సుందరానికి అప్పగించి, చెన్నైకి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇక ఏపీలోని వైజాగ్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ రెండేళ్లుగా సిగాచి పరిశ్రమలో డీజీఎంగా పనిచేస్తూ.. కుటుంబంతో కలసి అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ప్రమాదం జరిగిన రోజు నుంచీ ఆయన ఆచూకీ లేకపోవడంతో ఆ కుటుంబం విషాదంలో మునిగిపోయింది. డీఎన్ఏ విశ్లేషణలో బుధవారం ప్రవీణ్ మృతదేహాన్ని గుర్తించి, కుటుంబ సభ్యులకు అప్పగించారు.



పరిశ్రమ వద్ద సహాయ చర్యలు చేపడుతున్న రెస్క్యూ టీం

స్టోర్‌లో ఉండడంతోనే బతికిపోయాం: యశ్వంత్‌కుమార్, ఏపీ

రియాక్టర్లు ఉన్న ఫ్యాక్టరీలోనే స్టోర్ విభాగం ఉందని, అక్కడి నుంచి కంపెనీలోకి వెళ్లేముందే అగ్నిప్రమాదం జరిగిందని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఏపీకి చెందిన యశ్వంత్‌కుమార్ తెలిపారు. స్వల్ప వ్యవధిలోనే బిల్డింగ్‌లోని మొదటి అంతస్తు ప్రహరీ నుంచి కింది దూకామని చెప్పారు. తాము స్టోర్ విభాగంలో ఉండడం, సకాలంలో ఆస్పత్రికి తీసుకురావడం వల్లే బతికి బయటపడ్డామని పేర్కొన్నారు. గత పదేళ్లుగా సంస్థలో పనిచేస్తున్నానని, ఎప్పుడూ ఎలాంటి ప్రమాదం జరుగలేదని మరో క్షతగాత్రుడు సంజయ్ కుమార్ తెలిపారు. ఆ రోజు పెద్ద శబ్దం వచ్చిందని, మంటలు రావడంతో అందరం అరుచుకుంటూ పరుగు పెట్టామని వివరించారు.



యశ్వంత్‌కుమార్

డీఎన్ఏ నివేదికల కోసం ఎదురుచూస్తూ..

కాలిపోయిన మృతదేహాల డీఎన్ఏ విశ్లేషణ నివేదికల కోసం వారి కుటుంబ సభ్యులు, ఆప్తులు కన్నీళ్లతో ఎదురుచూస్తున్నారు. డీఎన్ఏ శాంపిళ్లు సరిపోలిన వారి కుటుంబాలకు మృతదేహాలను అప్పగిస్తున్నారు. బాధిత కుటుంబాలకు రూ.లక్ష చొప్పున తక్షణ నగదు సాయం అందజేసి, మృతదేహాలను స్వస్థలాలకు చేర్చేందుకు అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలకు వెళ్లలేక ఇక్కడే అంత్యక్రియలు చేపడతామన్న వారికి జీహెచ్ఎంసీ ఆయా స్మశాన వాటికల్లో ఏర్పాట్లు చేస్తోంది. అయితే డీఎన్ఏ విశ్లేషణ నివేదికలు అందడంలో జాప్యంతో మృతుల కుటుంబ సభ్యుల వేదనకు అంతే లేకుండా పోయింది.



ఒక్కగానొక్క కొడుకు కనిపించడం లేదంటూ..

తమ ఒక్కగానొక్క కొడుకు ఫ్యాక్టరీలో పనికోసం వచ్చి ఆచూకీ లేకుండా పోయాడంటూ శివ్‌జీ అనే కార్మికుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా ఫ్యాక్టరీ వద్ద, ప్రైవేట్ ఆస్పత్రుల్లో, ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో చూస్తూనే ఉన్నామని, ఎక్కడా జాడ లేదని చెబుతున్నారు. శిథిలాలు తొలగిస్తే కడసారి తమ కొడుకును చూసుకుంటామంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. శివ్‌జీకి భార్య, ముగ్గురు చిన్నపిల్లలు ఉన్నారు.

నా పిల్లలకు ఏం చెప్పాలి?



"అమ్మా నాన్నెప్పుడు వస్తాడు, డ్యూటీ నుంచి ఇంకా రాలేదంటి అని పిల్లలు అడుగుతుంటే ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదు.." అని ప్రమాదంలో ఆచూకీ తెలియకుండా పోయిన కార్మికుడు ప్రశాంత్ మహాపాత్ర భార్య సోనాలి ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఆస్పత్రుల్లో చూశామని, డీఎన్ఏ పరీక్షల కోసం నమూనాలు ఇచ్చామని చెప్పారు. పొట్టచేత పట్టుకుని ఒడిశా నుంచి వలస వచ్చామని, నా భర్త లేకుండా పిల్లలతో భవిష్యత్తును ఊహించుకుంటేనే భయం వేస్తోందంటూ ఆమె కన్నీరుమున్నీరు అవుతున్నారు.

మృతుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున ఇస్తాం

- నేనెక్కడికీ పారిపోలేదు.. 40 మంది మృతి చెందారు..
- 90 రోజులు పరిశ్రమ మూసేస్తున్నాం:సిగాచి డైరెక్టర్
- బాధితులందరికీ న్యాయం చేస్తాం: సీఈఓ అమిత్ రాజ్



సిగాచి డైరెక్టర్ చిదంబరనాథ్

పటాన్‌చెరు రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో 40 మంది మరణించారని, 33 మంది గాయాలపాలయ్యారని.. మృతుల కుటుంబాలకు రూ. కోటి చొప్పున పరిహారం అందిస్తామని సిగాచి పరిశ్రమ డైరెక్టర్ చిదంబరనాథ్ తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత తొలిసారిగా ఆయన బయటికి వచ్చారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో మృతదేహాలను పరిశీలించారు. వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. తాను ఎక్కడికి వెళ్లిపోలేదని, అధికారులకు అందుబాటులో ఉన్నానని తెలిపారు. తర్వాత పరిశ్రమ నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ యూనిట్‌లో 90 రోజుల పాటు అన్నిరకాల ఉత్పత్తులను నిలిపివేస్తున్నట్టు వివరించారు. రియాక్టర్ పేలుడు కారణంగా ప్రమాదం జరగలేదని, పూర్తిస్థాయి విచారణ జరుగుతోందని తెలిపారు. పాశమైలారం సిగాచి పరిశ్రమలో పరికరాలు కాలం చెల్లినవని అనడంలో అర్థం లేదని.. మిషనరీ కొత్తదేనని, భవనం పాతదని సిగాచి ఎండీ, సీఈఓ అమిత్‌రాజ్ సిన్హా పేర్కొన్నారు. ప్రమాదం దురదృష్టకరమని చెప్పారు. బాధితులందరికీ న్యాయం చేస్తామని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, క్షతగాత్రులకు వైద్య ఖర్చులన్నీ భరిస్తామని చెప్పారు. ఈ ఘటనతో సిగాచి కంపెనీ షేరు విలువ మూడు రోజుల్లో రూ.56 నుంచి రూ.42కు (25శాతం) పడిపోయింది.

ఇంటర్వ్యూకు వచ్చి, గల్లంతై.. ఆ అమ్మాయి ఎవరు?

సిగాచి పరిశ్రమలో ప్రమాదం జరిగిన రోజున ఇంటర్వ్యూకు వచ్చిన ఓ యువతి ఆచూకీ తెలియకుండా పోయినట్టు సమాచారం. ఉదయాన్నే ఇంటర్వ్యూకి వచ్చిన ఆ యువతి.. హెచ్ఆర్ చాంబర్‌కు వెళ్లిన సమయంలోనే భారీ పేలుడుతో భవనం కుప్పకూలిందని కార్మికులు చెబుతున్నారు. ఆమె ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారన్న వివరాలు తెలియలేదు. భవనం శిథిలాలను తొలగిస్తేగానీ దీనిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.

వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది

- క్షతగాత్రులకు మెరుగైన చికిత్స
- 13 మంది ఆచూకీ లభించాల్సి ఉంది
- బాధితులను పరామర్శించిన మీనాక్షి నటరాజన్, మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి దామోదర



క్షతగాత్రులను పరామర్శిస్తున్న మీనాక్షి, మహేశ్ గౌడ్, మంత్రి దామోదర

పటాన్‌చెరు రూరల్/మియాపూర్/హైదరాబాద్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న క్షతగాత్రుల వైద్య ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. బుధవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆమె పాశమైలారంలోని పరిశ్రమ సంఘటన ప్రాంతాన్ని సందర్శించి బాధిత బంధువులతో మాట్లాడారు. అంతకుముందు పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆస్పత్రి, ధ్రువ ఆస్పత్రి, మాదీనగూడ ప్రణం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మీనాక్షి మాట్లాడుతూ.. ఇప్పటికే బాధితులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందించినట్లు తెలిపారు. మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి, మంత్రులు ఘటనపై ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటున్నారని, క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. పేలుడు ఘటనను ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణిస్తోందని బాధ్యులను వదిలే ప్రసక్తి లేదన్నారు. మంత్రి రాజనర్సింహ మాట్లాడుతూ.. ఇప్పటివరకు 36 మృతదేహాలు లభ్యమయ్యాయని, 13 మంది ఆచూకీ లభించలేదన్నారు. 11 మంది మృతదేహాలను అప్పగించామని, ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్ వచ్చాక మిగిలిన మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని తెలిపారు. మిగిలిన శిథిలాలు తొలగిస్తే మిగతా 13 మంది ఆచూకీ లభించే అవకాశం ఉందన్నారు. బాధితులను పరామర్శించిన వారిలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులున్నారు. కాగా, ప్రమాదంపై విచారణకు ఆదేశించాలని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీ యాజమాన్యానిది తప్పు అని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



ఎవరూ రాక.. అనాథల్లా అంత్యక్రియలు

రామచంద్రాపురం టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పాశమైలారం గ్రామంలో బ్యాచిలర్లుగా ఉంటూ సిగాచి పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్న ఇద్దరు ప్రమాదంలో మృతిచెందారు. వారి కోసం ఎవరూ రాకపోవడం, మృతదేహాలు కాలిపోయి మాంసపు ముద్దగా మారడం, కుళ్లిపోయే పరిస్థితి నెలకొనడంతో.. అధికారులు, స్థానికులు కలసి పాశమైలారం శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తిచేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.